www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కొత్త హైకోర్టుకు నేడు శంకుస్థాపన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చేతుల మీదుగా..



- హాజరు కానున్న సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు
- రూ.1,000 కోట్లకు పైగా బడ్జెట్ 13
- ఏడాదిన్నరలో పనుల పూర్తికి ప్రణాళికలు
- రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం

హైకోర్టు జడ్జిగా సుజయ్ పాల్ ప్రమాణం

బుధవారం | 27-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 342
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: విదియ సా. 5.08 తదుపరి తదియ; నక్షత్రం: చిత్త సా. 4.16 తదుపరి స్వాతి వర్జ్యం: రా. 10.25-12.10; దుర్ముహూర్తం: ఉ. 11.57-12.45; అమృతఘడియలు: ఉ. 9.08-10.55; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 6.25
హైదరాబాద్ సిటీ *
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ట్యాపింగ్ మంటలు

ఫోన్లపై నిఘా వ్యవహారం మీద తీవ్ర ఆగ్రహం

- మా పార్టీ నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు
- కేసీఆర్‌దే బాధ్యత.. రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం
- దీనిపై న్యాయవిచారణ జరిపించాల్సిందేనని డిమాండ్
- మొదటి ముద్దాయి కేసీఆరే.. కేసు సీబీఐకి అప్పగించాలి
- దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో నా ఫోన్లు విన్నారు
- హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డినీ ముద్దాయిలుగా చేర్చాలి
- మునుగోడులో కోమటిరెడ్డి ఓటమికీ ట్యాపింగే కారణం
- హైకోర్టు దీన్ని సుమోటోగా స్వీకరించి విచారించాలి
- ఈ నెల 19న.. విమానంలో హరీశ్, రేవంత్ చర్చలు
- అందుకే చర్యలపై సర్కారు వెనకడుగు: రఘునందన్
- నా ఫోనూ ట్యాప్ చేశారు.. కఠిన చర్యలు తీసుకోండి
- డీజీపీకి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం ఫిర్యాదు





హైదరాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో రోజుకొక కొత్త పేరు వెలుగులోకి వస్తుండడంతో బీజేపీ నేతలు గత ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఈ వ్యవహారానికి నాటి ముఖ్యమంత్రిదే బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. కొందరు మంత్రులు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులతో అప్పటి సీఎం ఈ వ్యవహారాన్ని దుర్మార్గంగా నడిపించారంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల మాఫియాలూ రాజ్యమేలాయని దుయ్యబట్టారు. ట్యాపింగ్ వ్యవహారంతో అవినీతి అంశం కూడా ముడిపడి ఉందని.. దీనిపై న్యాయవిచారణ జరిపితేనే నాటి

మిగతా 14వ పేజీలో...

ట్యాపింగ్‌లో ఎమ్మెల్సీ!

- ఇజ్రాయెల్ టూల్ కొనుగోలుకు నిధులు సమకూర్చింది ఆయనే
- అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే.. ఖర్చుకు వెనుకంజ వేయలే
- నేడో రేపో ఆయనకూ నోటీసులు.. నిందితులపై ఏసీబీ ఫోకస్
- అక్రమాస్తుల లెక్కతీసే చాన్స్.. భూకబ్జాలు, తగాదాలపైనా నజర్
- హవాలా కోణం వెలుగుచూస్తే రంగంలోకి ఈడీ!

భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ కస్టడీపై తీర్పు నేటికి వాయిదా

హైదరాబాద్/సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా సాగించిన ఫోన్ ట్యాపింగ్‌లో తాజాగా నగరానికి చెందిన ఓ ఎమ్మెల్సీ పేరు వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ టూల్స్, రిమోట్ యాక్సెస్ టూల్/ట్రోజన్(ర్యాట్) కొనుగోలుకు సదరు ఎమ్మెల్సీ కూడా నిధులను సమకూర్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు సాయంతో ఎస్ఐబీలో టెక్నికల్ కన్సల్టెన్సీ సేవలు అందించే రవిపాల్ ద్వారా ఆ పరికరాలను తెప్పించారని తేల్చారు. అప్పటి

మిగతా 14వ పేజీలో...



చేవెళ్ల నియోజకవర్గ నేతలతో భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

రెఫరెండమే!

- వంద రోజుల పాలనపై తీర్పుగానే భావిస్తాం
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే ఇందుకు గీటురాయి
- 6 లేదా 7న తుక్కుగూడలో శంఖారావం
- 5 గ్యారెంటీలకు రాహుల్ హామీ: సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో 14 సీట్లు గెలుచుకుని సోనియా గాంధీకి కృతజ్ఞతలు చెబుదామని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని రంగారెడ్డి జిల్లా నుంచే పూరిస్తామని, ఏప్రిల్ 6 లేదా 7న తుక్కుగూడలో జనజాతర పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు

మిగతా 13వ పేజీలో...

నేడు కాంగ్రెస్ సీఈసీ సమావేశం

- తెలంగాణలో మిగిలిన సీట్లలో అభ్యర్థులపై స్పష్టత!
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్ 13

ఢిల్లీకి రేవంత్ రూ.2,500 కోట్ల కప్పం

- వ్యాపారుల్ని బెదిరించి వసూలు చేసి, పంపారు 12
- పథకాలివ్వలేకనే ఫోన్ ట్యాపింగ్ అంటూ కథనాలు
- ఎన్నికలయ్యాక బీజేపీలో చేరే తొలి వ్యక్తి ఆయనే: కేటీఆర్



తిహాడ్ జైలుకు కవిత

- 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్
- లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు
- మధ్యంతర బెయిల్‌పై 1న విచారణ
- కుమారుడికి పరీక్షలు ఉన్నందున తక్షణ మధ్యంతర బెయిల్ ఇవ్వాలన్న కవిత
- సాక్షులను ప్రభావితం చేస్తారన్న ఈడీ

కడిగిన ముత్యంలా బయటికొస్తా: కవిత

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, అతణ్ని సంరక్షించాల్సిన బాధ్యత తనపై ఉన్నందున బెయిల్

మిగతా 3వ పేజీలో...

జైల్లో ఇంటి భోజనమే! 3

- విడిగా గది.. చదువుకొనేందుకు పుస్తకాలు
- ఆభరణాలు, మందులకు అనుమతి

శరణ్ ఎవరో తెలియదు

- నాపై చేసిన ఆరోపణలు అవాస్తవం
- అతడిపై ఎన్నో చీటింగ్ కేసులు
- ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు
- పార్టీ మారాలంటూ నాపై ఒత్తిడి
- బీఆర్ఎస్‌ను వీడను: ఎర్రబెల్లి 12


క్యాన్సర్ పేషంట్లకు హెల్ప్‌లైన్ నంబర్

న్యూఢిల్లీ, మార్చి 26: క్యాన్సర్ పేషంట్లకు ఫోన్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించటానికి వీలుగా కొందరు అంకాలజిస్టులు (క్యాన్సర్ వైద్యులు) 'క్యాన్సర్ ముక్త్ భారత్ క్యాంపెయిన్' పేరుతో హెల్ప్ లైన్ నెంబరును ఏర్పాటు చేశారు. 93555 20202 నెంబరుపై ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇది ముఖ్యంగా సెకండ్ ఒపీనియన్ (క్యాన్సర్ నిర్ధారణపై ఒక డాక్టర్‌పైనే ఆధారపడకుండా.. మరో డాక్టర్ అభిప్రాయం కూడా తీసుకోవటం) కోసం పేషంట్లకు ఉపయోగపడుతుందని క్యాంపెయిన్ సారథి డాక్టర్ ఆశీష్ గుప్తా వెల్లడించారు. 'క్యాన్సర్ జీవన్మరణ సమస్య కాబట్టి.. దాని బారిన పడినవారందరికీ సెకండ్ ఒపీనియన్‌ను సిఫార్సు చేస్తారు. చికిత్స సమయంలో కూడా పేషంట్లకు పలు సందేహాలు వస్తుంటాయి. క్యాన్సర్ చికిత్స వ్యయమూ అధికమే. ఈ నేపథ్యంలోనే, ఎటువంటి ఆర్థికభారం లేకుండా ఉచితంగా సీనియర్ అంకాలజిస్టుల సేవలను ఈ హెల్ప్‌లైన్ ద్వారా అందిస్తున్నాం' అని తెలిపారు. క్యాన్సర్ చికిత్స రోజురోజుకీ మెరుగుపడుతోందని, అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని.. సెకండ్ ఒపీనియన్ హెల్ప్‌లైన్ ద్వారా వీటి గురించి విలువైన సమాచారం పేషంట్లకు అందుబాటులో ఉంటుందన్నారు.

34 కంపెనీలు.. 170 కోట్లు

» తెలుగు రాష్ట్రాల్లోని పునరుత్పాదక ఇంధన కంపెనీలు కొన్న ఎన్నికల బాండ్ల విలువ

హైదరాబాద్, మార్చి 26: మొత్తం 34 కంపెనీలు.. పవన శక్తి, సౌర శక్తి, హైడ్రోపవర్.. ఇలా అన్నీ పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేసే సంస్థలే.. తెలుగు రాష్ట్రాలకు చెందినవే! ఈ కంపెనీలన్నీ కలిసి అక్షరాలా 170 కోట్ల రూపాయల విలువ చేసే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి బీజేపీ, బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు సమర్పించుకున్నాయి. వీటిలో గ్రీన్‌కో గ్రూప్ రూ.34 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసి, అందులో రూ.13 కోట్ల బాండ్లు బీజేపీకి, రూ.11 కోట్ల బాండ్లు బీఆర్ఎస్‌కు, రూ.10 కోట్లు వైసీపీకి చదివించుకుంది. మైత్రా ఎనర్జీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఒక్కొక్కటీ రూ.కోటి విలువ చేసే 19 బాండ్లు కొని.. అందులో 10 బాండ్లు బీజేపీకి, 6 బాండ్లు బీఆర్ఎస్‌కు ఇచ్చింది. ఎస్ఈపీసీ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసిన రూ.40 కోట్ల బాండ్లలో రూ.4 కోట్లు బీజేపీకి ఇచ్చింది. దాదాపు 18 కంపెనీలు.. కొన్న బాండ్లలో అత్యధికం కారు పార్టీకే ఇవ్వడం గమనార్హం. ఉదాహరణకు.. అచింత్య సోలార్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొని.. అందులో రూ.4 కోట్లు బీఆర్ఎస్‌కు సమర్పించింది. అలాగే.. ఆర్టీ రెన్యువబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సరోజా రెన్యువబుల్స్, సనోలా విండ్ ప్రాజెక్ట్, విశ్వరూప సోలార్ పవర్ తదితర సంస్థలు రూ.2 కోట్ల చొప్పున గులాబీ పార్టీకి సమర్పించుకున్నాయి. ఇక.. ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీకి స్నేహ కైనెటిక్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10 కోట్లు, స్కైబరన్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ రూ.7 కోట్లు, దివ్యేష్ పవర్ రూ.3 కోట్లు, ఎలినా రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ, యాక్సిస్ విండ్ ఫార్మ్స్, టానోట్ విండ్ పవర్ తదితర సంస్థలు రూ.3 కోట్ల చొప్పున ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి సమర్పించాయి.



మైక్రోసాఫ్ట్‌లో మరో కీలక పదవిలో
తెలుగు తేజం పవన్



» విండోస్-సర్ఫేస్ హెడ్‌గా నియామకం

వాషింగ్టన్, మార్చి 26: మైక్రోసాఫ్ట్‌లో మరో తెలుగు తేజానికి కీలక పదవి లభించింది. మైక్రోసాఫ్ట్ విండోస్ అండ్ సర్ఫేస్ విభాగం బాస్‌గా పవన్ దావులూరి నియమితులయ్యారు. ఇంతవరకు ఈ పదవిని నిర్వహించిన పనోస్ పనయ్ గత ఏడాది రాజీనామా చేసి అమెజాన్‌లో చేరడంతో ఆయన స్థానంలో పవన్‌ను నియమించారు. గతంలో విండోస్, సర్ఫేస్ అంశాలకు రెండు విభాగాలు ఉండేవి. సర్ఫేస్ సిలికాన్ వర్క్ విభాగాన్ని పవన్ దావులూరి చూసేవారు. ప్రస్తుతం రెండు విభాగాలను ఏకం చేసి ఆయనను అధిపతిగా నియమించారు. ఐఐటీ-మద్రాసులో విద్యాభ్యాసం చేసిన ఆయన 1999లో మేరీలాండ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎస్.పట్టా పొందారు. అనంతరం మైక్రోసాఫ్ట్‌లో చేరి గత 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. 2001లో రిలయబిలిటీ కాంపోనెంట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. మైక్రోసాఫ్ట్ సీఈఓగా ఇప్పటికే సత్య నాదెళ్ల వ్యవహరిస్తుండగా ప్రస్తుతం ఆ కోవలో పవన్ చేరారు.

కస్టడీ నుంచి కేజ్రీవాల్ రెండో ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనను అరెస్టు చేస్తే జైలు నుంచే పరిపాలిస్తానని చెప్పిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాన్ని ఆచరించి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న ఆయన.. అక్కడి నుంచే రెండోసారి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మొహల్లా క్లినిక్‌లలో ఉచిత మందుల కొరత లేకుండా చూడాలని, రోగ నిర్ధారణ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదివారం లాకప్ నుంచి కేజ్రీవాల్ మొదటిసారి ఆదేశాలు పంపిన సంగతి తెలిసిందే. సీఎం ఆదేశాలు దేవుడి ఆదేశాల్లాంటివని ఢిల్లీ ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. కాగా, ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారని, బెయిల్ మంజూరు చేయాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరగనుంది.

పంజాబ్‌లో బీజేపీ ఒంటరి పోరాటం

న్యూఢిల్లీ, మార్చి 26: పంజాబ్‌లో ఒంటరి పోరాటానికి బీజేపీ సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికలకు పొత్తు కోసం శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) పార్టీతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో 20 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఎవరితో పొత్తు లేకుండా పంజాబ్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బరిలోకి దిగుతుంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి ఒంటరిగా పోటీ చేస్తున్నామని బీజేపీ పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జఖార్ మంగళవారం ప్రకటించారు. బీజేపీ ప్రకటనపై అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కూడా స్పందించారు. వందేళ్ల చరిత్ర కలిగిన అకాలీదళ్ సాధారణ రాజకీయ పార్టీ కాదని, తమ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని అన్నారు. సీట్ల కంటే తాము నమ్మిన సిద్ధాంతాలే తమకు ముఖ్యమన్నారు.

రాజకీయాల్లో పాల్గొనవద్దని కోర్టులు అనలేవు

» బెయిల్ మంజూరుకు దాన్నో షరతుగా పెట్టలేవు: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 26: ప్రజలు రాజకీయాల్లో పాల్గొనకుండా కోర్టులు నిరోధించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదన్న షరతుతో బెయిల్ మంజూరు చేయలేవని కూడా తెలిపింది. అలాంటి షరతు పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఒరిస్సా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించింది. ఒక కేసులో బరంపురం మాజీ మేయర్ శిబ శంకర్ దాస్‌కు 2022 ఆగస్టులో బెయిల్ ఇచ్చిన ఒరిస్సా హైకోర్టు.. ప్రజా శాంతికి భంగం కలిగించే ఎలాంటి పరిస్థితులు కల్పించకూడదని, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని షరతులు విధించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు.

రామకృష్ణ మిషన్ అధ్యక్షులు స్వామి స్మరణానంద కన్నుమూత



కలకత్తా, మార్చి 26: రామకృష్ణ మిషన్ అధ్యక్షులు స్వామి స్మరణానంద (95) వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో మూడు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు రామకృష్ణ మిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. 2017లో ఆయన రామకృష్ణ మిషన్‌కు 16వ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. స్వామి స్మరణానంద మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రముఖ గణిత శాస్త్రవేత్త సుబ్రమణియం మృతి



న్యూయార్క్, మార్చి 26: ప్రవాస భారతీయుడైన ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ టి.ఎస్.సుబ్రమణియం (76) మంగళవారం కన్నుమూశారు. ఆయన ప్రఖ్యాత కార్ల తయారీ సంస్థ జనరల్ మోటార్స్‌కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. 1979లో అమెరికాకు వలస వెళ్లిన ఆయనకు రెండు దేశాల్లోని విద్యారంగంలో మంచి గుర్తింపు ఉంది. పలు గణిత శాస్త్ర సూత్రాలు, సిద్ధాంతాలను ఆయన రూపొందించారు. అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు వ్యక్తిగతంగా ఆయనతో భేటీ అయ్యేవారు.

అమెరికాలో హిందూ ఫోబియా!

అగ్రరాజ్యంలో హిందూ ఆధిపత్యం పెరుగుతోందని 100కు పైగా హక్కుల సంఘాల ఆందోళన

» పలు కీలక తీర్మానాలకు ఆమోదం

» ప్రజాస్వామ్యానికి పెను ముప్పని, భారత్‌కూ ఇబ్బందేనని హెచ్చరిక



యూఎస్ కాంగ్రెస్ భవనంలో హిందూ-అమెరికన్ సదస్సు(ఫైల్)

న్యూఢిల్లీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యం అమెరికాలో చాపకింద నీరులా హిందూ ఆధిపత్యం పెరిగిపోతోందని, ఫలితంగా ఇప్పటి వరకు అందరికీ అన్ని హక్కులు అనే విధానాన్ని అవలంబిస్తున్న దేశంలో హిందూత్వం పెరిగిపోతోందని హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని పేర్కొన్నాయి. ఈ క్రమంలో చేయి చేయి కలిపి అమెరికాలో అందరికీ హక్కులు అనే విషయంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని 100కు పైగా హక్కుల సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కొన్ని కీలక తీర్మానాలు సైతం చేశాయి. "అమెరికాలో హిందూత్వ ఆధిపత్యం వివిధ అంశాల్లోకి చొచ్చుకుపోయింది. దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది" అని హక్కుల సంఘాల నాయకులు వ్యాఖ్యానించారు. కొన్ని సంస్థలు, వ్యక్తులు అమెరికాలో హిందూత్వను పెంచి పోషిస్తున్నారని తెలిపారు. "20వ శతాబ్దం ప్రారంభంలో నాజీయిజం, ఫాసిజం, ఇతర జాతిపరమైన అణిచివేత సిద్ధాంతాల నుంచి ప్రత్యక్ష ప్రేరణతో తొలిసారి వ్యక్తీకరించిన రాజకీయ భావజాలం.. ఇప్పుడు అమెరికాలో తీవ్ర ప్రభావం చూపిస్తోంది" అని వక్తలు పేర్కొన్నారు. "హిందూత్వ పెరుగుదల ప్రజాస్వామ్యంపై పెను ప్రభావం చూపిస్తుంది. న్యాయం, భావవ్యక్తీకరణ వంటిని నియంత్రిస్తుంది. ఇది అమెరికాకే కాదు.. భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి కూడా ఇబ్బందే" అని వ్యాఖ్యానించారు. "భారతీయ అమెరికన్ల పక్షాన గళం వినిపించేందుకు ఏర్పడిన కొత్త యునైటెడ్ ఫ్రంట్ 'సవేరా'కు సంఘీభావం ప్రకటిస్తున్నాం" అని నేతలు పేర్కొన్నారు. హిందూత్వ వాదులు, సంస్థలు.. బహుళ సాంస్కృతికత, వైవిధ్యాలపై తెరచాటున ఉండి యుద్ధం చేస్తున్నాయని విమర్శించారు. ముస్లిం వ్యతిరేక తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను అణిచివేసే చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. హిందూత్వ వాదుల చర్యలు కేవలం భారత్‌కు మాత్రమే కాకుండా దక్షిణాసియా, అమెరికాలోని ముస్లింలకు కూడా ప్రమాదకరంగా మారాయన్నారు.

సత్వర న్యాయవిచారణ ఆశిస్తున్నాం

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుపైనా అమెరికా స్పందించింది. కేజ్రీవాల్ విషయంలో న్యాయవిచారణ పారదర్శకంగా జరగాలని ఆశిస్తున్నామని పేర్కొంది. 'కేజ్రీవాల్ అరెస్టు, తదనంతర పరిణామాలను అమెరికా గమనిస్తోంది" అంటూ అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌తో అన్నారు. కాగా, కేజ్రీవాల్ విషయంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, భారత్ ప్రజాస్వామ్య ప్రమాణాలను పాటిస్తుందని భావిస్తున్నట్లు జర్మనీ విదేశాంగ ప్రతినిధి ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై తీవ్రంగా స్పందించిన భారత్.. మా అంతర్గత వ్యవహారాల్లో మీ జోక్యమేంటి ? అని జర్మనీ విదేశాంగ ప్రతినిధి వద్ద నిరసన తెలిపిన సంగతి తెలిసిందే.

ఇవీ తీర్మానాలు

- హిందూత్వ సహా రాజకీయాల్లో ద్వేషం ఏ రూపంలో ఉన్నా సహించరాదు.
- హిందూ ఆధిపత్య సిద్ధాంతాలపై అవగాహన పెంపొందించాలి.
- సరిహద్దులు దాటి విస్తరిస్తున్న హిందూత్వపై పోరాడాలి.
- ఇస్లామోఫోబియాను నిర్మూలించే క్రమంలో ప్రపంచవ్యాప్త ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలి.
- అమెరికాలో కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలి.
- మోదీ హయాంలో మానవహక్కులు, ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న అమెరికా ప్రభుత్వం పిలుపునకు మద్దతివ్వాలి.

మతం ఆధారంగా పౌరసత్వమా..

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై అమెరికా మరోసారి తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టం చాలా స్పష్టంగా ముస్లింలను దూరం పెట్టిందని అమెరికా హక్కుల సంస్థ అయిన యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) పేర్కొనడం వివాదాస్పదంగా మారింది. దీన్ని భారత్ తీవ్రంగా నిరసించింది. సీఏఏ నిబంధనలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయని, ఈ చట్టం అమలును నిశితంగా పరిశీలిస్తామని ఇటీవలే అమెరికా ప్రభుత్వం వ్యాఖ్యానించింది. తాజాగా 'యూఎస్‌సీఆర్ఎఫ్' ప్రకటన కూడా అదే వైఖరిని ప్రకటించింది. మతం, విశ్వాసాల ఆధారంగా ఏ వర్గానికీ పౌరసత్వం నిరాకరించడానికి వీల్లేదని తెలిపింది. సమస్యాత్మకమైన ఈ చట్టం శరణార్థులను మత ప్రాధాన్యాల ఆధారంగా పరిశీలిస్తుందని ఈ సంస్థ కమిషనర్ స్టీఫెన్ ష్నెక్ వ్యాఖ్యానించారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	40.5	19.2
ఆదిలాబాద్	39.3	24.5
వరంగల్	38.6	20.4
నల్లగొండ	38.5	23.6
హైదరాబాద్	38.2	24.5
ఖమ్మం	38.0	24.0
సంగారెడ్డి	37.0	26.0

ఓటీపీ మోసాలకు 'అడాప్ఐడీ'తో చెక్!

ఐఐటీ మండి పరిశోధకుల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, మార్చి 26: ఇటీవల కాలంలో ఓటీపీ మోసాలు, పాస్‌వర్డ్ హ్యాకింగ్ వంటి నేరాలు అధికమయ్యాయి. అయితే ఈ తరహా నేరాలకు చెక్ పెట్టే విధంగా ఐఐటీ మండి పరిశోధకులు ప్రత్యేకమైన బయోమెట్రిక్ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేశారు. 'అడాప్ఐడీ' అని పిలిచే ఈ వ్యవస్థ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అవసరం లేకుండానే సురక్షితమైన యూజర్ యాక్సెస్ ప్రక్రియను అందిస్తుంది. ఏఐ సాయంతో పనిచేసే అడాప్ఐడీని ఐఐటీ మండీలోని సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ (సీఏఐఆర్)కు చెందిన అమిత్ శుక్లా, డీప్ అల్గారిథమ్స్‌కు చెందిన జేపీ మిశ్రాతో కలిసి అభివృద్ధి చేశారు. 'అడాప్ఐడీ' వ్యవస్థకు ఇప్పటికే పేటెంట్ లభించిందని, దీన్ని ఇప్పటికే ఒక బ్యాంకు, ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఉపయోగించారని పరిశోధకులు తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో దీని వినియోగం కోసం పరిశోధక బృందం ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై)తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.

బీజేపీ మాయ నుంచి బయటపడితేనే బతుకు

» మేం అధికారంలోకి వచ్చాక 30లక్షల ఉద్యోగాల భర్తీ



న్యూఢిల్లీ, మార్చి 26: ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన పేరుతో అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. బీజేపీ మాయ నుంచి బయటపడితేనే దేశ యువత రాత మారుతుందని అన్నారు. యువత ఉపాధి కల్పనకు ప్రధాని మోదీ వద్ద ఉన్న ప్రణాళిక లేంటని ఆయన ప్రశ్నించారు. యువ న్యాయ్ ద్వారా ఉపాధి విప్లవం చేపట్టాలని కాంగ్రెస్ సంకల్పించిదని, తాము అధికారంలోకి వస్తే 'పెహ్లీ నౌక్రీ పక్కీ' పథకం ద్వారా 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. మరోవైపు అసంఘటిత కార్మికులకు ఉద్దేశించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకంపై అధికార బీజేపీ.. కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం రాజుకుంది. ఈ పథకం ప్రచారంలో తప్ప వాస్తవంలో లబ్ధిదారులకు చేరడం లేదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల ఇచ్చే పెన్షన్ ఏ మూలకు రాదని, స్కీమ్‌ను సరిగా డిజైన్ చేయలేదని జైరాం విమర్శించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల స్పందించారు. జైరాం రమేశ్ వాస్తవాలను విస్మరించారని పేర్కొన్నారు. ఏపీవై కింద చందాదారులకు కనీసం 8% ప్రతిఫలం అందేలా ప్రభుత్వ హామీ ఉందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా, విపక్షాలతో కూడిన ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సీఏఏను చించి చెత్త బుట్టలో పడేస్తామని కేరళలో ఓ కార్యక్రమంలో థరూర్ స్పష్టం చేశారు.

నువ్వో శక్తిస్వరూపిణివి

ఓ అరాచకవాదిని జైలుకు పంపావ్!

» సందేశ్‌ఖాలీ బాధితురాలు, బసిర్ హట్ బీజేపీ అభ్యర్థి రేఖా పత్రాతో ఫోన్‌లో మోదీ



రేఖా పత్రా

న్యూఢిల్లీ, మార్చి 26: పశ్చిమ బెంగాల్‌లోని బసిర్‌హట్ ఎంపీ టికెట్ పొందిన సందేశ్‌ఖాలీ బాధితురాలు రేఖా పత్రాకు ప్రధాని మోదీ నేరుగా ఫోన్ చేశారు. ఎన్నికల సన్నాహాలు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. రేఖా అభ్యర్థిత్వంపై స్థానిక ప్రజలు ఏమనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. బెంగాలీలో ఫోన్ సంభాషణ మొదలుపెట్టిన మోదీ.. 'దుర్గా పూజకు నెలవైన బెంగాల్‌లో నువ్వో శక్తి స్వరూపిణివి. ఓ అరాచకవాదిని జైలుకు పంపావ్. ఎన్నికల్లో మీ మీద పెద్ద బాధ్యత ఉంచాం. మా సంపూర్ణ మద్దతు ఉంటుంది. మహిళల గౌరవం కోసం బసిర్‌హట్‌లోనే కాదు. యావత్ బెంగాల్‌లోనూ పోరాటం సాగిద్దాం' అని సూచించారు. సందేశ్‌ఖాలీలో మహిళలు గొంతెత్తగలగడం సామాన్య విషయం కాదని, తృణమూల్ పాలనతో విసిగిపోయిన బెంగాల్ నారీశక్తి ఈసారి తమకు అండగా ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిగా రేఖా పత్రా స్పందిస్తూ "మీరు మా పాలిట దేవుడిలా వచ్చారు. ఆ శ్రీరాముడే మాతో ఉన్నట్లుగా భావిస్తున్నాం. 2011 నుంచి ఇక్కడ ఎవరం ఓటు వేయలేదు. ఈ సారి హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించండి" అని కోరారు. సందేశ్‌ఖాలీలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాజహాన్ షేక్, అతడి అనుచరులు మహిళలపై లైంగిక వేధింపులు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఇటీవల తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అరెస్టు చేసేందుకు వెళ్లిన ఈడీ అధికారులపై షాజహాన్ అనుచరులు దాడికి కూడా పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సందేశ్‌ఖాలీలో జరుగుతున్న దారుణాలను, వాటికి తృణమూల్ మద్దతు ఇస్తుండడాన్ని మోదీ ఇప్పటికే పలుసార్లు ప్రస్తావించారు. కాగా, బెంగాల్ సీఎం మమతాబెనర్జీని ఎదుర్కొనేందుకు సందేశ్‌ఖాలీని బీజేపీ ఓ ఆయుధంగా ఎంచుకుంది. ఈ క్రమంలో షాజహాన్ అకృత్యాలపై మహిళలు సాగించిన ఆందోళనలకు నాయకత్వం వహించిన రేఖా పత్రాను బసిర్‌హట్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. సందేశ్‌ఖాలీ ఈ నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది. తృణమూల్ తరఫున ఇక్కడినుంచి హాజీ నరుల్ ఇస్లామ్ పోటీ చేస్తున్నారు.

వేశ్యనైనా సరే గౌరవించాల్సిందే



» వృత్తిని బట్టి ఏ మహిళనూ కించపర్చవద్దు

» తనపై కాంగ్రెస్ నేతలు సుప్రియ, ఆహిర్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కంగన

న్యూఢిల్లీ, మార్చి 26: సినీ నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనతే, మరో యువనేత హెచ్ఎస్ ఆహిర్ సోమవారం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ఈ పోస్టులపై కంగన స్పందిస్తూ.. "ఒక మహిళ సామాజిక నేపథ్యం, ఆమె చేసే పనిని బట్టి ఆమెను తక్కువగా చూడకూడదు. కించపర్చవద్దు. ఉపాధ్యాయురాలు, నటి, జర్నలిస్టు, రాజకీయ నాయకురాలు, వేశ్య.. ఇలా ఎవరైనా సరే ప్రతీ మహిళను గౌరవించడం మన సంస్కారం" అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు తనతో పాటు, మండీ ప్రజలను తీవ్రంగా బాధించాయని చెప్పారు. కాంగ్రెస్ నేతల అభ్యంతరకర పోస్టులపై జాతీయ మహిళా కమిషన్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రియపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఫిర్యాదులో ఆహిర్ పేరును కూడా ప్రస్తావించింది. అయితే, తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల పాస్‌వర్డ్ పలువురికి తెలుసని, తనకు తెలియకుండానే రనౌత్‌పై ఎవరో అభ్యంతరకర పోస్టు చేశారని సుప్రియ వివరణ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన వెంటనే ఆ పోస్టును డిలీట్ చేసినట్లు చెప్పారు. ఈ పోస్టు మొదటి 'సుప్రియాపేరడీ' అనే 'ఎక్స్ ' ఖాతాలో పోస్టు చేశారని, దాని నిర్వాహకులు ఎవరో తనకు తెలియదని చెప్పారు. మరోవైపు, తన ఎక్స్ అకౌంట్ హ్యాక్ అయిందని ఆహిర్ చెప్పారు. ఇదిలా ఉండగా, సుప్రియ వివరణ నేపథ్యంలో వివాదానికి ఇంతటితో ముగింపు పలకాలని కాంగ్రెస్ పేర్కొంది. హిమాచల్‌లోని మండీ లోక్‌సభ అభ్యర్థిగా కంగనను బీజేపీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ వివాదం రేగింది.

వెంట్రుక ముక్కతో దొరికిపోయాడు

1994లో బ్రిటన్‌లో కొలంబియా యువతి హత్య

» పెరిగిన టెక్నాలజీతో 30 ఏళ్లకు పరిష్కారమైన కేసు

» హంతకుడు భారతీయ సంతతికి చెందినవాడే



మరీనా



సందీప్

లండన్, మార్చి 26: ముప్పై ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసును లండన్ పోలీసులు ఛేదించారు. భారతీయ సంతతికి చెందిన హంతకుడికి 19 ఏళ్ల జైలుశిక్ష పడేట్లు చేశారు. హతురాలి వేలి ఉంగరంలో చిక్కుకున్న వెంట్రుకను డీఎన్ఏ పరీక్ష చేయడం ద్వారా హంతకుడిని గుర్తించగలిగారు. కొలంబియా నుంచి 1980ల్లో పొట్టకూటి కోసం లండన్‌కు వలస వచ్చిన మరీనా అక్కడ డేవిడ్ కొప్పల్‌ను పెళ్లి చేసుకున్నారు. 11ఏళ్లపాటు కాపురం సంతోషంగా గడిచింది. అయితే, ఆమెకు కొలంబియాలో గత వివాహానికి సంబంధించిన పిల్లలను పోషించాల్సిన బాధ్యత ఉండటం, సంపాదిస్తున్న డబ్బు సరిపోకపోవడంతో భర్తకు ఇష్టం లేకపోయినా స్థానికంగా మసాజ్ పార్లర్‌లో ఉద్యోగంలో చేరింది. తర్వాత వేశ్యావృత్తిలో కూడా దిగింది. ఇదే విషయంలో వారిద్దరికీ తరచూ గొడవలు అయ్యేవి. డేవిడ్ కొప్పెల్ ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మరీనా వేశ్యావృత్తిని కొనసాగిస్తూనే వారాంతంలో భర్త దగ్గరకు వెళ్లి వస్తుండేది. 1994 జూలైలో కొత్త ఫ్లాట్ కూడా తీసుకుంది. అదే ఏడాది ఆగస్టు 8న ఆమె ఫ్లాట్‌లోనే విటులతో గడిపే గదిలో దారుణంగా హత్యకు గురైంది. ఆమె ఒంటిపై ఏకంగా 140 కత్తి పోట్లు ఉన్నాయి. మరుసటి రోజు మరీనా ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో డేవిడ్ ఆమె ఫ్లాట్‌కు వెళ్లాడు. భార్య మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు కాల్ చేశాడు. ఫోరెన్సిక్ నిపుణులు గదిలో ప్లాస్టిక్ బ్యాగు మీద వేలిముద్రలు కనుగొన్నారు. హంతకుడు ఆమెను పొడిచినపుడు ఒకవైపే పదునుగా ఉన్న కత్తి సరిగా దిగకపోవడంతో గదిలో ఉన్న చెక్క పలకను కత్తి మీద పెట్టి కాలితో బలంగా తొక్కాడు. దాంతో చెక్క పలక మీద కాలి ముద్రలు కూడా పడ్డాయి. ఈ భయానక హత్య అప్పట్లో బ్రిటన్‌లో సంచలనం సృష్టించింది. మెరీనా హత్యకు సంబంధించి అనుమానితుల్లో భారతీయ సంతతికి చెందిన 21 ఏళ్ల సందీప్ పటేల్ కూడా ఉన్నాడు. ప్లాస్టిక్ బ్యాగు మీద సందీప్ వేలి ముద్రలు కూడా ఉన్నాయి. ఆ ప్లాస్టిక్ బ్యాగు సందీప్ తండ్రి నిర్వహించే పుస్తకాల షాపు నుంచి రావడంతో అక్కడ పనిచేసే సందీప్ వేలిముద్రలు పడే అవకాశం ఉందని భావించి వదిలేశారు. 2008లో కేసును తిరగదోడినపుడు గదిలో దొరికిన ఆమె చేతి వేలి ఉంగరంలో హంతకుడి వెంట్రుక ఉన్నట్లు గమనించారు. అప్పటికి డీఎన్ఏ టెక్నాలజీ అంతగా అభివృద్ధి చెందకపోవడంతో వెంట్రుకను దాచారు. 2013లో సందీప్ పటేల్ తన ప్రియురాలితో గొడవ పడి కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. పోలీసు కేసు నమోదైంది. ఆ సందర్భంగా అతని డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేసి పెట్టారు. 2022లో మరీనా కేసు మరోసారి తిరగదోడారు. పోలీసులు దాచిపెట్టిన నిందితుడి వెంట్రుకకు డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేసేశారు. నేరగాళ్ల డేటాబేస్‌ను స్కాన్ చేయగానే సందీప్ పటేల్ డీఎన్ఏతో సరిపోలింది. వెంటనే గదిలోని చెక్క పలక మీద ఉన్న పాదముద్రలను కూడా సరిపోల్చగా అవి కూడా సందీప్ పటేల్‌వే అని తేలింది. దానికితోడు మరీనాను హత్య చేసే సమయంలో హంతకుడు ఆమె డెబిట్ కార్డును తీసుకొని, పిన్ నంబరు చెప్పించుకొని ఆ తర్వాత ఏటీఎంలో విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ ఏటీఎం సందీప్ పటేల్ ఇంటి దగ్గరే ఉంది. ఈ ఆధారాలన్నీ సరిపోలడంతో 2023 జనవరిలో సందీప్ పటేల్‌ను అరెస్టు చేశారు.



న్యూయార్క్, మార్చి 26: అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రం బాల్టిమోర్‌లో అనూహ్య ప్రమాదం చోటు చేసుకుంది. కంటెయినర్ల లోడుతో వెళ్తున్న ఓ భారీ నౌక పటాప్‌స్కో నదిపై ఉన్న వంతెనను ఢీ కొనడంతో ఆ బ్రిడ్జి కుప్పకూలింది. దాంతో ఆ వంతెనపై వెళ్తున్న వాహనాలు నదిలో పడడంతో కనీసం 20 మంది గల్లంతయినట్టు సమాచారం అందింది. ఆ కంటెయినర్ షిప్‌పై పనిచేస్తున్న ఇద్దరు పైలట్లు సహా మొత్తం 22 మంది సిబ్బంది భారత దేశానికి చెందిన వారేనని, వారు సురక్షితంగా ఉన్నారని నౌకను నిర్వహిస్తున్న సినర్జీ మెరైన్ గ్రూపు ప్రకటించింది. సింగపూర్ జెండా ఉన్న ఆ నౌక 'డాలీ' మియర్స్క్ కంపెనీకి చెందిన కంటెయినర్లను లోడు చేసుకొని మంగళవారం బాల్టిమోర్ నుంచి కొలంబో బయలుదేరింది. తెల్లవారుజామున (స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి 1.30 గంటలు) పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జి స్తంభాన్ని ఢీకొంది. అనంతరం ఆ వంతెన పేక మేడలా కుప్పకూలింది. ఇందుకుగల కారణం ఏమిటన్నది వెంటనే తెలియరాలేదు. సంఘటన దృష్ట్యా ఎమర్జెన్సీని విధించినట్టు మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూర్ ప్రకటించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని సహాయ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

తిహాడ్‌లో ఇంటి భోజనమే!

- జైలులో కవితకు ప్రత్యేక వసతులు
- కుమారుడి పరీక్షలకు బెయిలడిగిన కవిత
- ఏప్రిల్ 1 వరకు ఈడీకి గడువిచ్చిన కోర్టు

న్యూఢిల్లీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిహాడ్‌లోనూ కవిత ఇంటి భోజనమే చేయనున్నారు. జైలులో ఉన్నప్పటికీ ఆభరణాలు ధరించే ఉంటారు. తనకు నచ్చిన మంచం, పరుపు.. ఇలా కొన్ని ప్రత్యేక వసతుల మధ్య జీవించనున్నారు. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన తర్వాత తనకు జైలులో కొన్ని వసతులు కల్పించాలని న్యాయస్థానానికి కవిత విజ్ఞప్తి చేశారు. ఇంటి భోజనం, మంచం, పరుపు, చెప్పులు, దుస్తులు, బెడ్ షీట్, దుప్పటి, పుస్తకాలు, పెన్నులు, రాసుకోవడానికి కాగితాలు, ఆభరణాలు, మందులు తీసుకెళ్లడానికి అనుమతి కావాలని కోరారు. అన్ని రకాల విజ్ఞప్తులకు న్యాయమూర్తి కావేరి బవేజా అంగీకరించారు. ఇంటి భోజనం చేయడానికి, జైలులోనూ ఆభరణాలు ధరించడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే కవిత నిద్రపోవడానికి మంచం, పరుపులు, చెప్పులు, దుస్తులు, దుప్పట్లు, పుస్తకాలు స్వయంగా ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేసింది. వీటితో పాటు పెన్ను, తెల్ల కాగితాలు, ఆభరణాలు, మందులు తీసుకెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. అయితే కస్టడీలో ఉన్నప్పుడు కవితకు చేసిన అన్ని వైద్య సంబంధిత రికార్డులను ఆమె తరఫున న్యాయవాదులకు అందజేయాలని ఈడీని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధిస్తున్నట్టు చెప్పగా, ఆ తర్వాత కొద్దిసేపటికే కవితను రౌస్ అవెన్యూ కోర్టులోని ప్రత్యేక సెల్ లోకి తీసుకెళ్లారు. సుమారు మూడు గంటలు ఆ సెల్‌లోనే ఉంచారు. ఆ సమయంలో కవిత బయటికి వస్తే కలిసేందుకు కుటుంబ సభ్యులు, ఆత్మీయులు ఉండగా పోలీసులు అభ్యంతరం తెలిపారు. వారిని ఆ సెల్ నుంచి దూరంగా పంపించివేశారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జైలు వాహనాన్నే ఆ సెల్ లోపలికి వెళ్లనిచ్చారు. కవితను సెల్ లోపలే వాహనంలోకి ఎక్కించుకుని తిహాడ్ జైలుకు తీసుకెళ్లారు. సుమారు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కవిత జైలుకు చేరుకున్నారు. అక్కడ జైలు అధికారులు కవితకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిసింది. కవిత కోసం తిహాడ్ జైలులో ప్రత్యేక గదిని కేటాయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఏప్రిల్ 1లోపు అభ్యంతరాలు తెలపండి

కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమె తరఫున న్యాయవాది కోర్టును కోరారు. కవిత రెండో కుమారుడు మైనర్ అని, అతనిని సంరక్షించాల్సిన బాధ్యత తల్లిపై ఉందని న్యాయమూర్తికి తెలిపారు. అందుకే, కవితకు బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 11వ తరగతి ఫైనల్ ఎగ్జామ్స్ ఉన్నాయని, మంగళవారం పరీక్షలు మొదలయ్యాయని, ఏప్రిల్ 16 వరకు ఉన్నాయని ప్రస్తావించారు. బెయిలు విజ్ఞప్తికి ఈడీ తరఫున న్యాయవాది అభ్యంతరం తెలిపారు. నల్లధనం చెలామణి నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) 45(1)(బీ)(ఐ) నిబంధన ప్రకారం నిందితులు బెయిల్ కోసం దరఖాస్తు చేస్తే కౌంటర్ వేయడానికి వారం రోజుల సమయం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కవిత బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. అభ్యంతరాలు ఉంటే ఆ తేదీలోపే కోర్టుకు నివేదించాలని ఈడీని ఆదేశించారు. మద్యం కేసులో ఇప్పటికే ఈడీ జప్తు చేసిన ఆస్తులను నిర్ధారించారు.

తిహాడ్ జైలుకు కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలంటూ కవిత చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. తిరిగి ఏప్రిల్ 9న కోర్టులో హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. అయితే కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారణ జరుపుతామని పేర్కొంది. దీంతో పోలీసులు ఆమెను తిహాడ్ జైలుకు తరలించారు. కవిత ఈడీ కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం 11.40 గంటలకు ఆమెను రౌస్ అవెన్యూ కోర్టుకు తీసుకొచ్చారు. కేసుపై సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా విచారణ చేపట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫున న్యాయవాది జోహెబ్ హొస్సేన్, కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి ఇద్దరూ ఆన్‌లైన్‌లోనే వాదనలు వినిపించారు. తొలుత జోహెబ్ హొస్సేన్ వాదనలు వినిపిస్తూ.. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవితది కీలకపాత్ర అని ఆరోపించారు. కేసు దర్యాప్తులోనే ఉందని, మరికొంత మందిని ప్రశ్నించాల్సి ఉందని తెలిపారు. కవిత సమాజంలో ఎంతో పలుకుబడి ఉన్న వ్యక్తి అని, రాజకీయంగా, ఆర్థికంగా ఆమె సమాజాన్ని ప్రభావితం చేయగలరని పేర్కొన్నారు. ఆమె బయట ఉంటే సాక్షులను బెదిరించే అవకాశం ఉందన్నారు. కేసులో కవిత పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నామని, మరికొన్ని విషయాలు వెలుగులోకి రావాల్సి ఉందని అన్నారు. ఆర్థిక నేరాల దర్యాప్తు కఠినమైనదని, మొదటి నుంచీ కవిత ఎంతో ప్రణాళికతో నేరానికి పాల్పడ్డారని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. పైగా గతంలోనే కొన్ని సాక్ష్యాలను ఆమె ధ్వంసం చేశారని, ఇప్పుడు విడుదల చేస్తే మిగిలిన సాక్ష్యాలను కూడా మాయం చేసే అవకాశం ఉందని చెప్పారు. ఆమెకు 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించాలని కోరారు.

బెయిల్ ఇవ్వండి

కవిత తరఫున న్యాయవాది విక్రమ చౌదరి వాదనలు వినిపిస్తూ.. కవిత చిన్న కుమారుడికి 11వ తరగతి పరీక్షలు ఉన్నాయని, ఈ సమయంలో ఆమె తన కుమారుడితో ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. కవిత జైలులో ఉంటే ఆ ప్రభావం ఆమె కుమారుడి భవిష్యత్తుపై పడే అవకాశం ఉందని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. అందుకే ఆమెకు ఏప్రిల్ 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో సాధారణ బెయిల్ పిటిషన్ విచారణకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. మధ్యంతర బెయిల్‌తోపాటే ఈ నెల 30న బెయిల్ పిటిషన్‌పై వాదనలకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి.. మధ్యాహ్నం 2 గంటలకు తీర్పును రిజర్వ్ చేశారు. సుమారు గంటన్నర తర్వాత తీర్పును వెలువరిస్తూ.. కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 9న ఉదయం 11 గంటలకు ఆమెను కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న వాదనలు వింటామన్నారు. అయితే ఏప్రిల్ 9న ఉగాది కావడంతో ఆరోజు కూడా కేసు విచారణ మరోసారి వాయిదా పడే అవకాశం ఉంది. దాంతో మరో 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కుటుంబ సభ్యులతో గంటసేపు..

కవిత కేసులో తీర్పును న్యాయమూర్తి రిజర్వ్ చేయగానే ఆమె తరఫున న్యాయవాది కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి అనుమతి కోరారు. దీంతో.. ఎవరెవరు కలుస్తారు? వాళ్లిప్పుడు అందుబాటులో ఉన్నారా? అని న్యాయమూర్తి అడిగారు. అందరూ అందుబాటులోనే ఉన్నారని చెప్పగా.. కోర్టు హాల్లోనే కలవాలని, దీనికోసం పిటిషన్ ఫైల్ చేయాలని సూచించారు. ఆ నిబంధనల మేరకే పిటిషన్ దాఖలు చేసిన తర్వాత.. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు కవితను కలిశారు. పిటిషన్‌లో పేర్కొన్న పేర్ల ప్రకారం ఒకరి తర్వాత ఒకరిని లోపలికి అనుమతించారు. కవిత భర్త అనిల్, తోటికోడలు నవిత, రాజశేఖర్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, వ్యక్తిగత సహాయకుడు శరత్ తదితరులు కవితను కలిసిన వారిలో ఉన్నారు.

కడిగిన ముత్యంలా బయటికి వస్తా: కవిత



కోర్టు హాల్లోకి వెళ్లే సమయంలో కవిత మీడియాతో మాట్లాడారు. "ఇదో రాజకీయ కుట్ర. ఎన్నికల్లో లబ్ధి కోసం జరిగే కుట్ర. ఇది మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఒక నిందితుడు బీజేపీలో చేరాడు. మరో నిందితుడికి బీజేపీ కూటమి టికెట్ ఇస్తోంది. మూడో నిందితుడు ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి రూ.50 కోట్లు ఇచ్చాడు. ఇది ముమ్మాటికీ కేసుల పేరుతో లొంగదీసుకునేందుకు జరిగే కుట్ర. తాత్కాలికంగా నన్ను జైలులో పెట్టొచ్చు. కానీ, నా ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయలేరు. కడిగిన ముత్యంలా బయటికి వస్తా" అని కవిత అన్నారు. కోర్టు లోపలికి వెళ్లేటప్పుడు, తిరిగి బయటికి వచ్చేటప్పుడు 'జై తెలంగాణ.. జై జై తెలంగాణ..' అంటూ నినాదాలు చేశారు.

కేంద్రం తీరు విచారకరం: వద్దిరాజు

ఎమ్మెల్సీ కవితపై ఈడీ తప్పుడు కేసు బనాయించిందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కవితకు సంబంధం లేనప్పటికీ రాజకీయ దురుద్దేశంతో కేసు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. ఇది విచారకరం.. దురదృష్టకరమని అన్నారు. రౌస్ అవెన్యూ కోర్టు ముందు రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. ఉద్యమాలు, నిర్బంధాలు, కోర్టులు.. ఇవన్నీ కేసీఆర్ కుటుంబానికి కొత్తేమీ కాదన్నారు. బీఆర్ఎస్ 20 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందని చెప్పారు. లోకసభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు.



కవిత జోక్యం ఉందా? లేదా?

- ఢిల్లీ లిక్కర్ కేసుపై కేటీఆర్ స్పందించాలి
- కవిత ఎందులో.. కడిగిన ముత్యంలా వస్తారు?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- కేటీఆర్ పనికిరానోడని విమర్శలు


హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో కవిత జోక్యం ఉందా? లేదా? అనే విషయాన్ని కేటీఆర్ స్పష్టం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నారో లేదో కూడా తనకు తెలియదని ఎద్దేవా చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కవిత కొంతమంది వ్యక్తులతో వ్యాపార సంస్థను ఏర్పాటు చేసి అందులో తన బినామీలను పెట్టారా.. లేదా..? ఢిల్లీలో ఆప్ ప్రభుత్వంతో మంతనాలు జరిపారా.. లేదా..? కోట్లాది రూపాయలు చేతులు మారాయా.. లేదా..? ఈ విషయంపై కేటీఆర్ స్పందించాలన్నారు. రాష్ట్ర రాజకీయాలకు, తెలంగాణ సెంటిమెంటుకు, కవిత అరెస్టుకు ఏమాత్రం సంబంధం లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. లిక్కర్ స్కాంలో కవిత జోక్యం లేకపోతే, ఇది అక్రమ కేసైతే కేసీఆర్ బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అంటున్నారని.. ఎందులో కడిగిన ముత్యంలా బయటకు వస్తారో చెప్పాలని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి ఏమీ చేయలేదంటూ కేటీఆర్ చేసిన విమర్శపై ఘాటుగా స్పందించారు. పనికిరానోళ్లు మాట్లాడితే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. సికింద్రాబాద్‌లో తానేం చేశానో చెబుతానని.. కేటీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలని కిషన్‌రెడ్డి సవాలు విసిరారు.

'చంగిచర్ల' నిందితులపై చర్యలేవీ?

హోలీ పండగ సందర్భంగా చంగిచర్ల స్లాటర్ హౌస్ దగ్గర నివసిస్తున్న గిరిజన మహిళలు వేడుకలు చేసుకుంటుంటే కొందరు మతోన్మాదులు వచ్చి విచక్షణారహితంగా రాళ్లతో దాడి చేశారని, గర్భిణులు, చిన్న పిల్లలనూ వదల్లేదని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ ఘటనలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపించారు. నామమాత్రపు కేసులతో ముగించారని విమర్శించారు. గిరిజన ఆడబిడ్డలపై దాడులు జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. చంగిచర్ల వధశాలలోకి మనుషులు వెళితే తిరిగి వచ్చే అవకాశం లేని భయంకర మాఫియా అక్కడ ఉందని చెప్పారు. అక్రమంగా ఏర్పాటు చేసిన వధశాలను మూసివేయించాలని డిమాండ్ చేశారు.

బీజేపీతో కలవలేదనే అరెస్ట్: హరీశ్

మెదక్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోలేదనే అక్కసుతోనే ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మెదక్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీతో కలవని వారందరిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కవిత అరెస్టులే అందుకు నిదర్శనమన్నారు. ఓ వైపు ఈడీ అరెస్టులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఖండిస్తుండగా, ఇక్కడ రేవంత్‌రెడ్డి సమర్థిస్తుండడం హాస్యాస్పదమన్నారు. గుజరాత్ నమూనా విఫలమైందని రాహుల్ బీజేపీపై విమర్శలు చేస్తుంటే.. మన సీఎం మాత్రం గుజరాత్ మోడల్ సూపర్ అంటుండడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. చోర్ అదానీ అని రాహుల్ అంటే, అదే అదానీతో దోస్తీ కట్టడం రేవంత్‌కే చెల్లిందన్నారు. వందరోజుల పాలనలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రఘునందన్‌రావు పనితీరు బాగా లేకపోవడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డి 54వేల ఓట్ల మెజార్టీతో గెలిచారన్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రూ. 15 వేలు రైతుబంధు వచ్చిన వారే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని, రానివారంతా బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇప్పటివరకూ కాంగ్రెస్ పాలనలో 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు పార్టీలో చేరుతున్న వారిపై ఉన్న ప్రేమ రైతులపై లేదని ధ్వజమెత్తారు. పంటలు ఎండుతుంటే పట్టించుకోని సీఎం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ఇప్పటివరకూ మైనార్టీలకు చోటు కల్పించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు, పింఛన్లు, 24 గంటల కరెంట్ వంటి పథకాలేవి అమలు జరగడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓట్లేస్తే ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా పరవాలేదని ఒప్పుకున్నట్లు అవుతుందని హరీశ్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సింగరేణిలో బీఆర్ఎస్‌కు షాక్!

పార్టీతో 21ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న టీబీజీకేఎస్.. ఇకపై స్వతంత్ర సంఘంగా వ్యవహరించాలని నిర్ణయం

- ఏప్రిల్‌లో నూతన కమిటీల ఏర్పాటు
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నష్టం?

వరంగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్‌లో గులాబీ పార్టీకి భారీ షాక్ తగిలింది. 21 ఏళ్లుగా సింగరేణిలో బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఇకపై స్వతంత్రంగా వ్యవహరించాలని సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెగదెంపులు చేసుకుంది. ఈ మేరకు ఈ నెల 23వ తేదీన పెద్దపల్లి జిల్లా రామగుండంలో టీబీజీకేఎస్ కీలక నేతలు, ఆ సంఘం ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఇక నుంచి బీఆర్ఎస్‌తో సంబంధం లేకుండా, స్వతంత్ర సంఘంగా ముందుకు వెళ్లాలని తీర్మానించారు. ప్రస్తుతం సింగరేణిలో హిందూస్థాన్ మజ్దూర్ సంఘ్ (హెచ్ఎంఎస్) స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, ఆ సంస్థలాగే టీబీజీకేఎస్‌ను కూడా రాజకీయ నీడ పడకుండా కార్మిక సమస్యల కోసం పోరాడే సంఘంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. టీబీజీకేఎస్‌కు ఇన్నాళ్లూ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ఢిల్లీ మద్యం విధానం కేసులో జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ పరిణామం నేపథ్యంలో, వచ్చే నెలలో ఏ రాజకీయ పార్టీ నేతలతో సంబంధం లేకుండా నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకీ మద్దతు ఇవ్వకూడదని తీర్మానించారు. అయితే పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్‌కు మాత్రం మద్దతు ఇవ్వాలని కొందరు కార్మికులు చేసిన సూచనకు సమావేశంలో సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మికుడిగా ప్రస్థానం ప్రారంభించి టీబీజీకేఎస్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన దృష్ట్యా ఆయనకు మాత్రం రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శిగా ఉన్న రాజిరెడ్డి చైర్మన్‌గా, మరో 11మంది సభ్యులుగా తాత్కాలిక కమిటీని నియవిం



చారు. ఈ కమిటీ నేతృత్వంలో కోల్‌బెల్ట్ అన్ని ఏరియాల్లో వచ్చే నెలలో నూతన కమిటీలు వేయనున్నారు.

బీఆర్ఎస్‌కు భారీ కుదుపే

సింగరేణిలో ప్రధాన కార్మిక సంఘాల్లో ఒకటిగా ఉన్న టీబీజీకేఎస్.. లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌ను వీడటం ఆ పార్టీకి భారీ షాక్‌గానే రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వరంగల్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం ఎంపీ స్థానాల పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లే కీలకం. ఈ ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు కూడా సింగరేణి కార్మికుల్లోనే బలమైన నేతలు, కార్యకర్తలున్నారు. అటువంటప్పుడు, టీబీజీకేఎస్ దూరం కావటం వల్ల బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో భారీగా నష్టం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 2003 నుంచి ప్రతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా టీబీజీకేఎస్ నేతలు ప్రచారం చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోగానే, 2023 డిసెంబరులో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ పోటీ చేయకుండా బీఆర్ఎస్ అధిష్ఠానం అడ్డుపడటాన్ని సంఘం శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయి. బీఆర్ఎస్ నుంచి విడిపోవటానికి ఇదొక ప్రధాన కారణమని సమాచారం.

ఇక నుంచి స్వతంత్రంగా వ్యవహరిస్తాం

'సింగరేణిలో ఇక నుంచి స్వతంత్రంగా వ్యవహరిస్తాం. ఏ పార్టీకి అనుబంధంగా పని చేయం. బీఆర్ఎస్‌తో ఉన్న అనుబంధాన్ని తెంచుకున్నాం. సింగరేణి కార్మికుల సంక్షేమమే ఎజెండాగా కొనసాగుతాం' అని టీబీజీకేఎస్ చైర్మన్ మిరియాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వటం లేదని, పెద్దపల్లిలో మాత్రం సింగరేణి మాజీ కార్మికుడు, టీబీజీకేఎస్ వ్యవస్థాపక సభ్యుడైనందున కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా పని చేస్తామని చెప్పారు.

21 ఏళ్ల దోస్తానా..

సింగరేణిలో కమ్యూనిస్టు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఆధిపత్యం ఉన్న సమయంలో 2003 జనవరి 27న గోదావరిఖనిలో ప్రొఫెసర్ జయశంకర్ చేతుల మీదుగా టీబీజీకేఎస్ ఆవిర్భవించింది. తెలంగాణ సాధనే లక్ష్యంగా ఎన్నో ఉద్యమాలు చేసిన కార్మికులు కోల్‌బెల్ట్ ఏరియాలో బీఆర్ఎస్ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. 2003, 2007లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ ఓడిపోయింది. 2012, 2017లో జరిగిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఎన్నికైంది. కానీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదంటూ టీబీజీకేఎస్‌పై విమర్శలు వచ్చాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైన క్రమంలో.. డిసెంబరులో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ పోటీ చేయకుండా గులాబీ నేతలే అడ్డు పడ్డారు. దీనికి నిరసనగా టీబీజీకేఎస్ కీలక నేతలు రాజిరెడ్డి, వెంకట్రావు, మల్లయ్య తదితరులు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించినా గులాబీ అధిష్ఠానం పట్టించుకోలేదు. దీంతో గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ నామమాత్రంగా మిగిలిపోయింది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ నుంచే విడిపోయి, స్వతంత్రసంఘంగా ప్రస్థానాన్ని కొనసాగించటానికి నిర్ణయం తీసుకుంది.

మానుకోటలో బంజారా వర్సెస్ ఆదివాసీ

- ఎంపీ టికెట్‌ను బంజారాలకే కేటాయించిన మూడు ప్రధాన పార్టీలు
- ఆదివాసీ సంఘాల ఆగ్రహం.. పోటీకి సమాయత్తం
- మహబూబాబాద్ స్థానంలో 4లక్షల ఆదివాసీ ఓట్లు!

ఇల్లెందు, మార్చి 26: మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బంజారా అభ్యర్థులకే టికెట్లు కేటాయించడం పట్ల ఆదివాసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆదివాసీల తరఫున స్వతంత్ర అభ్యర్థిని బరిలోకి దింపాలని యోచిస్తున్నాయి. మహబూబాబాద్‌లో కాంగ్రెస్.. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌కు, బీజేపీ.. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌కు, బీఆర్ఎస్.. సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితకు టికెట్లు కేటాయించాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ జడ్పీ చైర్మన్ చందా లింగయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి రానున్న ఎన్నికల్లో ఆదివాసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు, ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలన్న ప్రధాన డిమాండ్‌తో నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం నిర్వహిస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ కూడా ఆదివాసీల హక్కుల సాధన పేరిట పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ జనసమితి(టీజేఎస్) అభ్యర్థిగా పోటీ చేసిన అరుణ్‌కుమార్‌కు 57వేలకు పైగా ఓట్లు వచ్చాయి. అయితే, ఇలా ఎవరికి వారే పోటీ చేస్తామని ప్రకటిస్తే ఆదివాసీల ఐక్యతకు విఘాతం కలుగుతుందని భావిస్తున్న పలు ఆదివాసీ సంఘాల నేతలు.. అందరి తరఫున ఒకే ఉమ్మడి అభ్యర్థిని బరిలో నిలబెట్టాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్(ఏఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ వివిధ సంఘాల నాయకులతో చర్చలు జరుపుతున్నారు. కాగా, మహబూబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఆదివాసీల ఓట్లు దాదాపు 4లక్షల మేర ఉన్నాయని, లోక్‌సభ నియోజకవర్గంలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆదివాసీ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆదివాసీ సంఘాలు పేర్కొంటున్నాయి. అయినా, మూడు ప్రధాన పార్టీలు ఎంపీ టికెట్‌ను బంజారాలకే కేటాయించాయని విమర్శిస్తున్నాయి.

జనసేనకు పవన్ 10 కోట్ల విరాళం

అమరావతి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జనసేన సాగిస్తున్న రాజకీయ ప్రయాణానికి తన వంతుగా రూ.10 కోట్లు ఇస్తున్నానని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సమక్షంలో పార్టీ కోశాధికారి ఏవీ రత్నంకు మంగళవారం ఆ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం ఈ డబ్బు ఇస్తున్నానని తెలిపారు. జనసేన పార్టీ ప్రయాణానికి సగటు కూలి తన చిన్నపాటి సంపాదనలో రూ.100 పక్కన పెట్టి ఇవ్వడం.. పార్టీ ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. ఓ బేల్దారీ మేస్త్రీ రూ.లక్ష విరాళం అందించారని, అలాగే తమకు అందుతున్న పింఛన్ సొమ్ములో కొంత భాగం పార్టీకి పంపుతున్న సగటు మనుషులెందరో ఉన్నారని పవన్ వెల్లడించారు. వారంతా ఎన్నో ఆశలతో, ఆశయాలతో నిర్మించిన పార్టీ కోసం తమ వంతు సాయం అందిస్తున్నారని వివరించారు. అలాంటి వారి స్ఫూర్తితో తాను సినిమాల ద్వారా వచ్చిన తన కష్టార్జితాన్ని, ప్రభుత్వానికి పన్నులు కట్టిన తర్వాత పార్టీ కోసం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో 40 నుంచి 50 కోట్లు పన్నులు కట్టానన్నారు. ఎన్నికల వేళ ఈ డబ్బు పార్టీకి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

'టెట్ ఫీజు తగ్గించాలి'

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాతే దరఖాస్తులను స్వీకరించాలని కోరింది. 33 జిల్లాల్లోనూ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం. రాధారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లద్దాఖ్ బతుకుపోరు

లద్దాఖ్ ప్రాంతానికి రాష్ట్రహోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని ఆరవషెడ్యూల్‌లో చేర్చడం ఇత్యాది డిమాండ్లతో ఇరవై ఒక్కరోజుల నిరాహారదీక్షకు దిగిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం తన దీక్ష ముగించారు. మార్చి 6నుంచి అత్యంత కఠినమైన వాతావరణంలో కొనసాగిన ఆయన దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు లభించింది. దీక్షవిరమణ రోజున సినీనటుడు ప్రకాష్ రాజ్ తన పుట్టినరోజును దీక్షాస్థలిలోనే జరుపుకొని లద్దాఖ్ ప్రజల ఉద్యమానికి తన సంఘీభావం ప్రకటించారు. తాను దీక్షవిరమించినప్పటికీ లద్దాఖ్ ప్రజల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం ఆగదని ప్రకటించిన సోనమ్, ఒక వీడియోలో ప్రధాని, హోంమంత్రిని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. మైనస్ పదిడిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో తనతోపాటు 350మంది దీక్షలో కూచుంటే పాలకులు ఏ మాత్రం స్పందించపోవడంమీద ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మోదీ, అమిత్‌షాలు రాజకీయనాయకుల్లాగా కాక, రాజనీతిజ్ఞుల్లాగా వ్యవహరించాలని తామంతా కోరుకుంటున్నామని, అందుకు వారిద్దరూ కాస్తంత ఔన్నత్యాన్ని, దూరదృష్టిని ప్రదర్శించాలని వ్యాఖ్యానించాడు. ఆయన దీక్ష ముగిసినప్పటికీ, ఇప్పుడు లద్దాఖ్‌లోని మహిళాసంఘాలు అవే డిమాండ్లతో నిరాహారదీక్ష ఆరంభించాయి.

లద్దాఖ్ ప్రజల డిమాండ్ల మీద నెలలక్రితమే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించి, ఉద్యమకారులతోనూ, ప్రతినిధులతోనూ పలుమార్లు చర్చోపచర్చలు సాగించింది కేంద్రప్రభుత్వం. మార్చి 4వతేదీన తనను కలిసిన లద్దాఖ్ నాయకులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కఠినంగా మాట్లాడుతూ వారి డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని తేల్చేయడంతో సోనమ్ వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నట్టు వార్తలు వచ్చాయి. పర్యావరణ ఉద్యమకారుడు, సృజనాత్మక విద్యావేత్త, ఇంజనీర్ అయిన సోనమ్ జీవితం ఆధారంగానే హిందీచిత్రం 'త్రీ ఇడియట్స్' నిర్మితమైన విషయం తెలిసిందే. లద్దాఖ్ పర్యావరణం, గిరిజన సంస్కృతి పరిరక్షణల కోసం ఈ రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత పడుతున్న ఆవేదనను కానీ, భూమి, ఉపాధి ఇత్యాది విషయాల్లో స్థానికుల భయాందోళనలను కానీ పాలకులు లెక్కచేయడం లేదు.

జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కుదించిన ఏడాదిలోనే లద్దాఖ్‌వాసులకు తమకు జరిగిన, జరగబోతున్న అన్యాయం అర్థమైంది. లద్దాఖ్ ప్రధానంగా బౌద్ధమతాన్ని ఆచరించే వివిధ ఆదివాసీ తెగల ప్రాంతం. రాష్ట్రంగా లేకపోవడం, ప్రత్యేకరక్షణలు తొలగిపోవడంతో భూమిపై వస్తున్న సంప్రదాయహక్కులకు హామీలేకుండా పోయింది. డెబ్బయ్యేళ్ళలో ఎన్నడూ లేనంత అభద్రతలోకి వారు జారిపోయారు. తమ సర్వహక్కులను, రక్షణలను ఆర్టికల్ 370 మింగేసిన నేపథ్యంలో, వాటిని తిరిగి సాధించడానికి పోరాటం తప్పదని వారు గ్రహించారు. వివిధ ప్రజాసంఘాలతో కూడిన లేహ్ అపెక్స్ బాడీ నాలుగేళ్ళుగా లద్దాఖ్‌ను ఆరోషెడ్యూల్ కింద చేర్చాలని పోరాటం చేస్తున్నది. లద్దాఖ్‌తో బలవంతంగా కలిపిన కార్గిల్ ప్రాంతవాసులు తమను తిరిగి కశ్మీర్‌తో కలపమని మరోపక్క ఉద్యమిస్తున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, రాజ్యాంగంలోని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం ద్వారా ఆదివాసీ తెగల స్థానిక స్వయంపాలనకు అవకాశం, స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను రిజర్వుచేస్తూ ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు ఇత్యాదివి వారి డిమాండ్లలో ప్రధానమైనవి.

లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణరీత్యా అవశ్యకమంటూ షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ నాలుగేళ్ళక్రితం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసిందని అంటారు. అయితే, కేంద్రప్రభుత్వం స్థానిక ప్రజల ఉద్యమాలకు స్పందిస్తున్నట్టు కనిపిస్తూనే వారి డిమాండ్లకు ఏమాత్రం లొంగదల్చుకోలేదని అర్థమవుతోంది. తమ వనరులు ఇతరులు దోచుకుంటారన్న లద్దాఖ్‌వాసుల భయం కూడా క్రమంగా నిజమవుతోంది. బయటివ్యక్తులు వారి భూములను కొనుగోలు చేయడం, అభివృద్ధి పేరిట సాగే విధ్వంసం కూడా ఆరంభమైంది. అస్మదీయ కార్పొరేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూమిని అప్పగించడం మొదలైంది. ఆరవషెడ్యూల్‌లో చేర్చినపక్షంలో ఈ భారీ భూ సంతర్పణలు, వనరుల అప్పగింత సులభం కాదు కనుక, కేంద్రప్రభుత్వం ఆ ఊసు ఎత్తడం లేదు. చైనా, పాకిస్థాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న లద్దాఖ్ వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా ఎంతో కీలకమైనది. కశ్మీర్ ఉగ్రవాదం పతాకస్థాయిలో ఉన్నప్పుడు కూడా అది లద్దాఖ్‌ను తాకలేదు. కార్గిల్ యుద్ధ సమయంలో లద్దాఖ్‌వాసులు భారతసైన్యానికి అందించిన సేవలు విలువకట్టలేనివి. గాల్వాన్ ఘటన, చైనా వరుస చొరబాట్లు లద్దాఖ్ విషయంలో మనం అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. గడ్డకట్టే చలిలో వేలాదిమంది చేస్తున్న ఆ ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.

ప్రపంచీకరణకు మార్క్స్ వ్యతిరేకమా?

ప్రపంచీకరణకు పునాది వేసిన స్వేచ్ఛ వాణిజ్య సిద్ధాంతం 18వ శతాబ్దంలో వెలుగులోకి వచ్చింది. దీన్ని ఫ్రాన్సుకు చెందిన 'ప్రకృతి ధర్మవాదులు', తర్వాత సాంప్రదాయ ఆర్థికవేత్తలైన ఆడమ్ స్మిత్, జె.బి.సే అభివృద్ధి చేశారు. ఈ సిద్ధాంతం 'ఆర్థిక వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం అవసరం లేదని, దాన్ని ప్రైవేట్ వ్యక్తులకు వదిలివేయాలని చెబుతుంది. కానీ అందుకు భిన్నంగా నాటి స్వేచ్ఛ వాణిజ్య పోటీ మార్కెట్ నుంచి గుత్త పెట్టుబడిగా తరువాత నేటి కార్పొరేటీకరణ వరకు ప్రభుత్వ మద్దతుతోనే పెట్టుబడిదారీ వ్యవస్థగా అభివృద్ధి చెందుతూ, విస్తరిస్తూ ఉన్నది. కాబట్టే మార్క్స్ 'ప్రభుత్వం అంటే పాలకవర్గాల వ్యవహారాలను సక్కబెట్టే యంత్రం' అని అంటాడు.

ఇక మన దేశానికి సంబంధించినంత వరకు మౌలిక పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడి పెట్టే సామర్థ్యం ప్రైవేట్ రంగానికి లేకపోవడం వల్ల ప్రభుత్వ సహకారంతోనే వాటిని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు ఆ శక్తి రాగానే నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించే విధానానికి ఈ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వల్ల ప్రజా సంక్షేమంపై కోతలు విధించబడతాయని మొత్తంగా మన దేశ సార్వభౌమత్వమే ప్రమాదములో పడుతుందనీ వామపక్షాలు విస్తృతంగా సాహిత్యాన్ని తెచ్చారు. తెలుగు సాహిత్యకారులు కూడా 'పడమటి గాలి', 'గ్లోబలి' తదితర పుస్తకాలను తెచ్చారు. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 'పల్లె కన్నీరు పెడుతుందో' అనే గోరటి వెంకన్న పాట తెలిసిందే.

వామపక్షాలు చెప్పినట్లే అన్ని రంగాలలో ప్రైవేటీకరణను చూస్తున్నాం. అదే సమయంలో రాజకీయ పార్టీలు పోటీలు పడి సంక్షేమ పథకాలను ప్రకటించడం కూడా చూస్తున్నాం. మరీ కమ్యూనిస్టులు చెబుతున్న స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా వ్యాప్తి చెందుతున్న ప్రపంచీకరణను వ్యతిరేకించాలా? ఈ విషయంలో శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంత మూలకర్తలైన మార్క్స్, ఏంగెల్స్ అంచనా ఏమిటనే విషయాన్ని ఈ వ్యాసం పరిశీలించే ప్రయత్నం చేస్తున్నది.



వామపక్షాలు చెప్పినట్లే అన్ని రంగాలలో ప్రైవేటీకరణను చూస్తున్నాం. అదే సమయంలో రాజకీయ పార్టీలు పోటీలు పడి సంక్షేమ పథకాలను ప్రకటించడం కూడా చూస్తున్నాం. మరి కమ్యూనిస్టులు చెబుతున్న స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా వ్యాప్తి చెందుతున్న ప్రపంచీకరణను వ్యతిరేకించాలా? ఈ విషయంలో శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంత మూలకర్తలైన మార్క్స్, ఏంగెల్స్ అంచనా ఏమిటి?

1848 సెప్టెంబర్ 15, 16, 17 తేదీల్లో స్వేచ్ఛా వాణిజ్యంపై జరిగిన అంతర్జాతీయ వాణిజ్య సదస్సు సందర్భంగా మార్క్స్ ఏంగెల్స్ 'వాస్తవములో కార్మికులకు ఈ స్వేచ్ఛ వాణిజ్యం వరగబెట్టేది ఏం ఉండదు. అలాగని మేము స్వేచ్ఛ వాణిజ్యానికి వ్యతిరేకమా? కాదు. అనుకూలం. ఎందుకంటే ఈ విధానాల వల్ల ఉనికిలోకి వచ్చే వైరుధ్యాలు విశాల భూభాగంలోకి విస్తరిస్తాయి. ఇందువలన బహుముఖ వైరుధ్యాల నుంచి ఒకే ఒక్క గొప్ప వైరుధ్యం తలెత్తుతుంది. ఈ వైరుధ్యంతో ఆ సమూహాలు ముఖాముఖి తలపడతాయి. ఆ రకంగా కార్మిక వర్గానికి విముక్తిని కలిగిస్తుంది.' ఇదీ వారి అంచనా. అంటే పెట్టుబడిదారీ పూర్వ అస్తిత్వాలైన జాతి, మతం, ప్రాంతం, దేశం తదితర బహుముఖ వైరుధ్యాలు రద్దు కాబడి, కార్మికులు — పెట్టుబడిదారులనే గొప్ప వైరుధ్యంగా ఏర్పడి కార్మిక వర్గ విముక్తి జరుగుతుందని వారు చెప్పారు.

ఇంకా, 'కమ్యూనిస్టు మానిఫెస్టో'లో, 'పెట్టుబడిదారీ వర్గం ప్రపంచమంతటినీ తన మార్కెట్టుగా చేసుకోవడం ద్వారా ప్రతి దేశంలోనూ సరుకుల ఉత్పత్తికి, సరుకుల వినియోగానికి జాతి, మతాతీత స్వభావాన్ని కల్పించింది. పరిశ్రమల జాతీయ పునాదిని కూడా తొలగించి వేసింది. ఇందువలన స్థానిక పరిశ్రమలన్నీ నాశనమైనాయి. ఇంకా ఏమైనా మిగిలి ఉంటే అవి రోజురోజుకు నాశనం అవుతూ ఉన్నాయి. ఈ పరిణామం సకల నాగరిక జాతులకు జీవన్మరణ సమస్యగా ఉంది. స్థానిక, జాతీయ ఒంటరితనాలు, ఇంకా స్వయంసమృద్ధి స్థితి పోయి నలువైపులా ఇచ్చిపుచ్చుకోవడమూ వివిధ జాతులు ఒకదానిపై ఒకటి ఆధారపడటమూ జరుగుతున్నది. అన్ని దేశాల మేధోపరమైన ఆవిష్కరణలు యావత్తు ప్రపంచ సమిష్టి ఆస్తి అవుతున్నాయి. జాతీయ, ప్రాంతీయ సంకుచితత్వం రాను రాను తగ్గిపోతాయి. ప్రాంతీయ సాహిత్యాల నుంచి విశ్వసాహిత్యం ఉద్భవిస్తున్నది'. ఈ రకంగా పెట్టుబడిదారీ విస్తరణ వల్ల జరిగే మార్పుల పట్ల ఆశావాద దృక్పథం వారిలో కనబడుతుంది. ఒక మాటలో చెప్పాలంటే ప్రపంచ కార్మికులు ఏకం కావటానికి కావలసిన భౌతిక పరిస్థితులను ఇది సృష్టిస్తున్నది.


అయితే సోషలిస్టు విప్లవాలకు అనువైన వాతావరణం నెలకొన్నదని అనుకోవచ్చా? వారు అవుననే అంటారు. అదే కమ్యూనిస్టు మానిఫెస్టోలో, 'ఐరోపాను కమ్యూనిజమనే భూతం ఆవరించి'నట్లు చెప్పుకొచ్చారు. అంటే అక్కడ సోషలిస్టు విప్లవానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయన్న అంచనాకు వచ్చారు. వారు బ్రతికుండగానే ప్యారిస్ కమ్యూన్ వైఫల్యాన్ని కూడా చూశారు. కానీ సోవియట్ యూనియన్‌లో లెనిన్ నాయకత్వంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. అయితే అన్ని దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థలు ఏర్పడుతున్నప్పుడు ఒక దేశంలో సోషలిస్టు విప్లవం తేవటం, దాన్ని నిలబెట్టుకోవటం అసాధ్యమనే చర్చ కూడా నడిచింది. ఆ తరువాత 1929లో కోమింటర్న్ ఐరోపా దేశాలలో పెట్టుబడిదారీ విధానం పతనం కాబోతున్నదని అంచనా వేసింది. అది జరగలేదు. కానీ 1950లో చైనాలో రైతాంగ విప్లవం విజయవంతమైంది. ఆ స్ఫూర్తితో నక్సలైట్లు భారతదేశంలో 1970 నాటికే విప్లవానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని అంచనా వేశారు. వారి అంచనాలు అటుంచితే, యూరప్‌లో సోషలిస్టు విప్లవాలు రాకపోగా సోవియట్ యూనియన్ కూలిపోయింది, చైనా మార్కెట్ సోషలిజంలో పయనిస్తున్నది.

మొత్తంగా మన అనుభవాలు ఏం చెబుతున్నాయి? అంటే, ప్రపంచమంతటా పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తులు గుణాత్మక స్థాయికి చేరకుండా సోషలిస్టు విప్లవాలు సంభవిస్తాయా? అనే సందేహాలు, వాదనలు ఉన్నాయి. కాబట్టి కమ్యూనిస్టు మానిఫెస్టోలో వివరించిన విధంగా భౌతిక పరిస్థితులు పరిపక్వం చెందకుండా కూడా సోషలిస్టు విప్లవాలు సంభవించవేమో? దీనికి కూడా మార్క్స్ నుండే సమాధానం పొందవచ్చు. 'మనుషులు చరిత్ర సృష్టిస్తారు. అయితే దాన్ని తాము కోరుకున్న ఇష్టానుసారం సృష్టించలేరు. అలాకాకుండా గతం నుంచి సంక్రమించిన వాటి ద్వారా తారసపడే పరిస్థితులను మాత్రమే మార్చగలరు'. దీనికి భిన్నంగా ఉన్న అంచనాలు, పోరాట నిర్మాణాలు జరిగితే అవి వైఫల్యాలను మిగులుస్తాయనీ ప్రపంచ అనుభవాలు మన ముందు ఉంచాయి. ఇటువంటప్పుడు కార్మిక వర్గ కర్తవ్యాలు, పోరాటాలు ఎలా ఉండాలి? అన్న ప్రశ్న ఉదయిస్తున్నది.

■ డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లు

ఆ లక్ష్యాన్ని బీజేపీ సాధించగలదా?

'జూన్ 4, 400 సీట్లు' — లక్ష్యం పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ తన ప్రచార వెల్లువలో తానే కొట్టుకుపోతున్నట్లు కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ప్రచారం ప్రారంభించిన తర్వాత దాన్ని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' (ఈసారి 400 దాటుతాం) అన్న నినాద హోరులో బీజేపీ కార్యకర్తలు మోదీ సునామీ దేశాన్ని ముంచేస్తోందా అన్న స్థాయిలో ప్రచారం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో జరిగిన సభల్లో మోదీ స్వయంగా ఎన్డీఏ 400 సీట్లకు పైగా సాధిస్తుందని ప్రకటించారు. ఇక, బీజేపీ ఒక్కటే 370 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ పోటీ చేస్తున్న 450 సీట్లలో 370 సీట్లు అంటే 82 శాతం సీట్లు గెలుచుకోవాలన్న మాట. ఇప్పటివరకూ బీజేపీ పోటీ చేసిన సీట్లలో అత్యధికంగా 70 శాతం సీట్లు 2019లోనే సాధించింది. అప్పుడు 436 సీట్లకు పోటీ చేసి 303 గెలుచుకుంది. ఎన్డీఏ 400 సీట్లు దాటడం మాట అటుంచితే, ఇప్పుడు బీజేపీ 82 శాతం సీట్లు ఎలా సాధించగలుగుతుంది అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. ఈ ప్రశ్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా వేసుకుని ఉంటారు. మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీకి అత్యధిక సీట్లు నాడు లభించాయి. ఈసారి అంతకంటే ఎక్కువ లభిస్తే కాని బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోలేదు.



గాలి జనార్దన రెడ్డి జరిపిన 35 వేల కోట్ల అక్రమ మైనింగ్ గురించి, సీబీఐ ఆరోపణల గురించి పత్రికల్లో నాడు వందలాది పేజీల కథనాలు ఎన్ని వస్తే మాత్రం ఏమి జరిగింది? ఆయనపై విచారణ ముగించమని సుప్రీంకోర్టు పలుసార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎవరివల్ల ఎప్పుడు ఎలా ప్రయోజనం పొందాలో బీజేపీకి బాగా తెలుసు కనుకనే ఈ ఎన్నికల సమయంలో గాలిని అక్కున చేర్చుకున్నారు.

సాధారణంగా రాజకీయ నాయకులు అరచేతిలో స్వర్గం చూపించేందుకు అందమైన అబద్ధాలు చెబుతూ ఉంటారు. మోదీ ప్రకటన కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఒక ఊపు తెచ్చేందుకో, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి మీడియాను కూడా భ్రమల్లో ముంచేందుకో చేసిందని చెప్పడానికి వీల్లేదు. అన్ని వ్యవస్థల్నీ అదుపులో పెట్టుకుని, ప్రతి చర్యా పకడ్బందీగా తీసుకుంటూ, ప్రతిపక్షాల్ని అణిచివేయడం ద్వారా తాననుకున్నది సాధించగలననే ధీమా ఆయనలో కనిపిస్తున్నది.

మోదీ ప్రతి ఒక్క లెక్కా ప్రణాళికాబద్ధంగా వేసుకున్నదే. ఫిబ్రవరి 18న ఆయన బీజేపీ జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ వచ్చే 100 రోజులు పార్టీకి కీలకమని, క్షణం కూడా వృథా చేయకుండా మళ్లీ అధికారంలోకి బ్రహ్మాండమైన మెజారిటీతో తిరిగి రావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంటే వంద రోజులలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి కాదని ఫిబ్రవరి 18నే మోదీకి తెలుసని అర్థం. నిజానికి గత మూడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మే రెండో వారంలోనో, మూడో వారంలోనో వచ్చాయి. కాని ఈ సారి ఉద్దేశపూర్వకంగా జూన్ మొదటి వారంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే విధంగా ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. మోదీ అధికారిక పర్యటనలన్నీ ముగించుకున్న తర్వాత ఆయన వ్యూహరచనకు అనుగుణంగా, ఇక పొడిగించడం అసాధ్యమని అనుకున్నప్పుడే ఎన్నికల ప్రక్రియను ప్రకటించారనుకోవచ్చు.

ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందా అన్న అనుమానాలు చాలామందికి ఉన్నాయి. తెలంగాణలో మోదీ పర్యటించిన రోజే కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు చేశారు. సరిగ్గా వారం రోజులకు ప్రధాని భూటాన్‌లో ఉన్నప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. బహుశా కవిత అరెస్టు మూలంగా పెద్దగా సానుభూతి వచ్చే అవకాశాలు లేవని, కేసీఆర్ ఆత్మరక్షణలో పడినందువల్ల బీజేపీ బలోపేతం అవుతుందని ఆయనకు సమాచారం వచ్చే ఉంటుంది. ఇక కేజ్రీవాల్ అరెస్టు వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలను ఎదుర్కోవడానికి కూడా ముందే సిద్ధమై ఉంటారు. 2014లో ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 10న జరిగితే, 2019లో మే 12న జరిగాయి. ఈసారి ఢిల్లీ ఎన్నికలను ఆశ్చర్యకరంగా ఆరవ దశలో మే 25న నిర్ణయించారు. అంటే కేజ్రీవాల్ అరెస్టు జరిగిన రెండు నెలలకు ఢిల్లీలో ఎన్నికలు జరుగుతున్నాయన్నమాట. ఢిల్లీలో పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ మాత్రం సమయం చాలునని నరేంద్రమోదీ అనుకుని ఉంటారు. ఢిల్లీలో గత ఎన్నికల్లో ఏడుకు ఏడుసీట్లు గెలిచిన బీజేపీ ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ చేతులు కలపడంతో కలవరానికి గురయినట్లుంది. కేజ్రీవాల్‌ను అరెస్టుచేయడం ద్వారా ఆప్‌ను చితక్కొట్టడానికి, కనీసం ఇతర రాష్ట్రాల్లో ఆప్ ప్రభావాన్ని అడ్డుకోవడానికి వ్యూహరచన జరిగి ఉంటుంది. ఢిల్లీ ఎన్నికల షెడ్యూలే కాదు, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలు కూడా బీజేపీ వ్యూహరచనకు అనుగుణంగా ఉన్నాయి. బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేని తమిళనాడు, కేరళ ఎన్నికలు మొదటి రెండు దశల్లోనే పూర్తి కాగా బీజేపీ పోరాడగలిగే రాష్ట్రాల్లో ఎన్నికలను వివిధ దశల్లో చివరి వరకూ నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో భౌగోళిక సామీప్యతను అంతగా పట్టించుకోలేదు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఆశించినన్ని ఫలితాలు వస్తాయా అన్న చర్చ బీజేపీలో జరుగుతోంది. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ మధ్య ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీదే పై చేయి అవుతుందని మోదీ భావన. ఇది ఇతర రాష్ట్రాలలో వర్తిస్తుందేమో కాని తెలంగాణలో మాత్రం సాధ్యం కాదు. తెలంగాణలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దూకుడును తట్టుకొని బీజేపీ ప్రభంజనం వీచేలా చూడడం అంత సులువు కాదు. మోదీ ఎంత బలవంతుడైనా స్థానిక నేతలు బలంగా లేకపోతే విజయం సాధించడం కష్టం. అందుకే చివరి నిమిషంలో ఇతర పార్టీ నేతల్ని, వ్యాపారస్తుల్ని లాగి వారికి అప్పటికప్పుడే సీట్లు ఇస్తున్నారు. ఆ నేతల విశ్వసనీయత, బీజేపీ సిద్ధాంతాల పట్ల వారి చిత్తశుద్ధి దేవుడెరుగు. కాని వారు బీజేపీని ఆదుకుంటారన్న ఆశ మోదీలో బాగా ఉన్నట్లు కనపడుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఆరు సీట్లకు పోటీ చేస్తున్న బీజేపీ తెలుగుదేశం గెలిపిస్తే కాని స్వంతంగా ఒక్కసీటు కూడా గెలిచే అవకాశాలు లేవు. కేరళలో కేంద్ర మంత్రులతో పోటీ చేయించినా ఖాతా తెరుస్తుందా అన్నది అనుమానమే. కర్ణాటకలో కూడా బీజేపీ గత ఎన్నికల్లో 28కి 26 సీట్లు గెలిచినా ఈసారి అన్నిసీట్లు గెలవడం సాధ్యపడదని బీజేపీకి సమాచారం వచ్చినట్లుంది. అందువల్లే అక్కడ యడ్యూరప్పకు మళ్లీ ప్రాధాన్యత పెంచారు. అక్కడ బీజేపీలో అంతర్గత తగాదాలు, జేడీ(ఎస్) సీట్ల పంపిణీ వల్ల ఏర్పడిన అసంతృప్తి గురించి ఢిల్లీకి సమాచారం అందుతూనే ఉన్నది. ఈ క్రమంలో మైనింగ్ వ్యాపారి గాలి జనార్దన రెడ్డి పార్టీని కూడా బీజేపీలో విలీనం చేసుకోవాల్సి వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కల్యాణ కర్ణాటక ప్రాంతంలో గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' పార్టీ వల్ల బీజేపీకి వచ్చిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను బీజేపీలో చేర్చుకోవల్సివచ్చిందని అంటున్నారు. గాలి అప్పుడు గంగావతి నుంచి విజయం సాధించారు. 'నీ రాజకీయ భవిష్యత్ బీజేపీలోనే ప్రారంభమైంది. నీవు వెంటనే పార్టీలో చేరిపో' అని హోంమంత్రి అమిత్ షా చెప్పడంతో తాను తన పార్టీని బీజేపీలో విలీనం చేశానని గాలి జనార్దన్ రెడ్డి చెప్పారు. గాలి జనార్దన్ రెడ్డి అక్రమ మైనింగ్ గురించి, చేసిన దారుణాల గురించి 2011లో అప్పటి లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే ఇచ్చిన నివేదికతో గాలి పతనం ప్రారంభమైంది. బళ్లారి గనుల నుంచి చైనాకు టన్నుకు రూ. 6500 నుంచి రూ. 7000 చొప్పున ధరకు ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, రాష్ట్రానికి రూ. 27 మాత్రమే రాయల్టీగా చెల్లించారని హెగ్డే వెల్లడించారు. గాలి జరిపిన 35 వేల కోట్ల అక్రమ మైనింగ్ గురించి, ఆయనపై సీబీఐ చేసిన ఆరోపణల గురించి, సాక్షులకు బెదిరింపులు, న్యాయమూర్తులకు ప్రలోభాల గురించి పత్రికల్లో నాడు వందలాది పేజీల కథనాలు వస్తే మాత్రం ఏమి జరిగింది? ఆయనపై విచారణ ముగించమని సుప్రీంకోర్టు పలుసార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. 'ఇది న్యాయవ్యవస్థకే అవమానం' అని కూడా సుప్రీం ఒక సందర్భంలో పేర్కొంది. ఎవర్ని ఎప్పుడు చేర్చుకోవాలో, వారి వల్ల ఎలా ప్రయోజనం పొందాలో బీజేపీకి తెలుసు కనుకే ఇప్పుడు కర్ణాటక ఎన్నికల సమయంలో గాలిని అక్కున చేర్చుకున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత తన నియోజకవర్గంలో హనుమంతుడి జన్మస్థలమైన అంజనాద్రి పర్వతాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానని గాలి జనార్దన రెడ్డి ప్రకటించారు. ఆయనపై కేసులు కూడా ఇక గాలిలో కలిసిపోతాయనడంలో అతిశయోక్తి లేదు. కాని గాలి లాంటి శక్తుల తోడ్పాటు మూలంగా బీజేపీ మళ్లీ కర్ణాటకలో 26 సీట్లు గెలుచుకుంటుందా అన్నది చర్చనీయాంశం.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పార్టీ నేతలను అరెస్టు చేయడం, ప్రత్యర్థులపై ఏజెన్సీలను ప్రయోగించడం, గాలి జనార్దన్ రెడ్డి, నవీన్ జిందాల్ వంటి నేతలను ఆగమేఘాలపై చేర్చుకోవడం ద్వారా తమ పార్టీ బలం పెంచుకోగలమని బీజేపీ నేతలు అనుకుంటున్నారు. 'మాకు రైలు టిక్కెట్లు కొనడానికి కూడా డబ్బులు లేవు.' అని రాహుల్ గాంధీ అంటున్నప్పుడు ప్రతిపక్ష పార్టీల్లో నిస్పృహ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. విజయం సాధించడమే తమ ఏకైక లక్ష్యమని రాజకీయ పార్టీలు భావిస్తున్నప్పుడు విలువల గురించి చర్చించి పెద్దగా ప్రయోజనం లేదు.

ఆదివాసీ స్వయం పాలన సారధి

ఆదివాసీ లిబరేషన్ టైగర్స్ వ్యవస్థాపకుడు కుంజ రాము 17వ వర్ధంతి నేడు. ఆదివాసీలు ఇతర ప్రాంతాల వారితో సమానంగా వృద్ధి చెందాలంటే స్వయం పాలనా ఉద్యమాలు తప్పని సరి అని త్రికరణశుద్ధిగా నమ్మిన విప్లవ యోధుడు, ఆదివాసీ నాయకుడు కుంజ రాము. అవిభక్త వరంగల్ జిల్లా పాకల కొత్తగూడెం మండలంలోని మోకాళ్ళపల్లిలో నిరుపేద కోయతెగ కుటుంబంలో పుట్టిన కుంజ రాము పదిహేనేళ్ళ వయసులోనే విప్లవోద్యమబాటలో నడిచారు. 35 ఏళ్ళ పాటు సాగిన అజ్ఞాత ఉద్యమ జీవితంలో ప్రజాస్వామ్య, సామాజిక మార్పు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఉద్యమాల రూపకల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించారు. తుడుందెబ్బ, మాదిగ దండోరా, డోలి దెబ్బ, మోకు దెబ్బ, పూసల కేక వంటి అనేక కుల ఉద్యమాలను సంఘటితపరిచాడు. స్వయం పాలన కోసం గెరిల్లా తరహా పోరాటమే శరణ్యమని భావించిన రాము 2004 సెప్టెంబర్ 30వ తేదీన ఆదివాసీ లిబరేషన్ టైగర్స్ అనే సంస్థను స్థాపించాడు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకూ షెడ్యూల్డ్ ప్రాంతాలను ఐక్యం చేస్తూ ప్రత్యేక పరిపాలనా విధానాన్ని స్వయంపాలనను ఆదివాసీలకు అందించాలని తద్వారా ఆదివాసీ సమాజం విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పురోగతి సాధించగలదని ఆయన త్రికరణశుద్ధిగా విశ్వసించాడు. 2005 మార్చి 27వ తేదీన వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఎర్రమ్మ గుట్టలపై సమావేశంలో ఉన్న రాముపై పోలీసులు ఏకపక్షంగా జరిపిన కాల్పుల్లో ఆయన మరణించాడు. జల్, జమీన్, జంగల్‌పై సర్వహక్కులు మావే అని గర్జించి మా గూడెంలో మా రాజ్యం కావాలని నినదించి తెగలను ఏకంచేసి పోరాడిన కొమురం భీం వారసుడు కుంజ రాము.

— పూకె రామకృష్ణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అంత సులభం కాదు!

తెలంగాణ సమస్యలు, సవాళ్ల మీద ఫిబ్రవరి 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పౌరసమాజ ప్రతినిధులతో ఒకటిన్నర గంటలు లోతుగా చర్చించారు. పౌరసమాజంలో క్రియాత్మకంగా పనిచేస్తున్న ఇతర సంస్థల బాధ్యులను కూడా పిలిస్తే మరింత ప్రజాస్వామికంగా ఉండేది. ప్రభుత్వం ప్రజాసంఘాలను నిరంతరం కలవడం ప్రజాస్వామ్య అవసరమని సూచించడం జరిగింది. ఈ చర్చ తర్వాత ప్రభుత్వం ఒక అధికార ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనకు మీడియా చాలా ప్రాధాన్యతనిచ్చింది. ప్రకటన రైతు సమస్యల, అలాగే విద్యారంగం సమస్యల మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఈ రెండు సమస్యల మీద రెండు కమిషన్లు ఒకటి విద్యా కమిషన్, రెండు వ్యవసాయ కమిషన్ వేసామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ సమస్యల మీద చాలా చర్చ జరిగింది. కాని ఈ ప్రకటనలో రాష్ట్రంలోని నిర్బంధం మీద జరిగిన చర్చకు అంత ప్రాధాన్యం లభించలేదు. తెలంగాణ ప్రజాసంఘాలు గత పదేళ్లుగా విపరీతంగా పెరిగిన నిర్బంధం పట్ల ఏం చర్యలు తీసుకుంటారనే కాక, ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని తమ మానిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని గుర్తు చేసాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని రూపంలో కాక సారంలో పునరుద్ధరిస్తే, విద్యారంగ సమస్యలపై కాని, రైతాంగ సమస్యలపై కాని సమాజంలో విస్తృత చర్చ జరుగుతుంది. ప్రజలు తమ ఉద్యమాల ద్వారా సమస్యల తీవ్రతనూ వ్యక్తపరుస్తారు. తద్వారా ప్రభుత్వానికి ఈ తీవ్రత అవగాహన కావడమే కాక సమాజంలో జరిగే క్రియాత్మకమైన చర్చలో చాలా సలహాలు, పరిష్కారాలు ముందుకు వస్తాయి.

తెలంగాణ ప్రజలు తెలంగాణను తమ రాజీలేని పోరాటంతో విస్తృత ప్రజల భాగస్వామ్యంతో సాధించుకున్నారు. అప్పుడు అధికారంలోకి వచ్చిన పార్టీ ఈ అంశాన్ని నిండుగా గుర్తించి ఉద్యమం సృష్టించిన ప్రజాస్వామ్య సంస్కృతిని వికసింపచేసి ఉంటే ఇవ్వాళ తెలంగాణ చాలా భిన్నంగా ఉండేది. తెలంగాణ రావడం, రావడమే ఎన్‌కౌంటర్లతో ప్రారంభమయ్యింది. పోలీసు యంత్రాంగానికి గత మూడు నాలుగు దశాబ్దాలుగా అలవాటైన చట్టాతీత బలప్రయోగం మార్చుకోవాలని కాని, దానిని మార్చడానికి కాని రాజకీయ నాయకత్వం ఏ ప్రయత్నం చేయకపోవడం విషాదం. ఇంత పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ నిర్బంధమేమిటి? మీటింగ్‌లు పెట్టుకోలేకపోవడమేమిటి? మీటింగ్ హాల్‌కు తాళాలు వేయడమేమిటి? అనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. ఈ కొనసాగుతున్న వైఖరిని గురించి ఒక సీనియర్ పోలీసు అధికారితో అంటే, "మీరు తెలంగాణలో పోలీసుల సంస్కృతి మారాలని కాని, నిర్బంధ చట్టాలు మార్చాలని కాని పోరాటంలో భాగంగా డిమాండ్ చేసారా?" అని ఎదురు ప్రశ్న వేసారు. నిజమే తెలంగాణ ఉద్యమంలో ఈ అంశం మీద విస్తృత చర్చ జరగలేదు. తెలంగాణ వస్తే ఉద్యమంలో పాల్గొన్న వాళ్ల గొంతుకు చాలా విలువ ఉంటుందని నిర్బంధాన్ని నియంత్రించవచ్చని భావించారు. ఉద్యమంలో ప్రజాస్వామ్య ఆకాంక్ష అంతర్లీనంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో పేరుకుపోయిన నిర్బంధానికి వ్యతిరేకంగానే కదా ఉద్యమం వచ్చింది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర పాలకులు ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య విలువలని, చట్టబద్ధ పాలనని గౌరవించి ఉంటే, తెలంగాణ పోరాటాలను, ప్రజల ఆకాంక్షలను సరిగ్గా అంచనా వేసి స్పందించి ఉంటే, రాష్ట్ర విభజన దాకా పరిస్థితి వచ్చేది కాదేమో.

రాష్ట్ర విభజన తర్వాత ప్రజలు కోరుకున్నది స్వేచ్ఛ. ఈ అంశం మీద ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కాని స్వేచ్ఛ మీద దాడి జరిగితే సహించరు' అన్న ఒక మంచి సూత్రీకరణ చేసారు. స్వేచ్ఛ ఉంటే ఆకలితో ఉన్నవాళ్లు ఉద్యమించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మీద పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి తమ ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న కొన్ని చర్యల గురించి ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ అవగాహన మేరకు ప్రభుత్వం పనిచేస్తే పాలన స్వభావంలో కొంత మార్పు వస్తుంది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే అది అన్నంత సులభం కాదు. ఈ పునరుద్ధరణకు తీసుకోవలసిన కొన్ని చర్యలను చర్చలో భాగంగా ప్రస్తావించడం జరిగింది. శాంతిభద్రతల యంత్రాంగం అవగాహనలో, ప్రవర్తనలో, ఆచరణలో కొన్ని ప్రజాస్వామ్య ప్రమాణాలను గౌరవించడం, బలప్రయోగం చట్ట పరిమితులకు పరిమితం చేయడం ప్రజాస్వామ్యానికి ఇరుసు వంటిది. ఈ దేశంలో ఒక రాజ్యాంగం ఉందని, ఈ రాజ్యాంగం పౌరులకు చాలా హక్కులు కల్పించిందని, మాట్లాడే స్వేచ్ఛ, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, ఎలాంటి భావాలనైనా కలిగి ఉండే స్వేచ్ఛ, తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించే స్వేచ్ఛ వారికి ఉన్నాయని గుర్తెరగాలి— వాటి మీద కనీస అవగాహన కావాలి.

స్వేచ్ఛతో కూడిన సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి విలువల పునాదిగా సమాజాన్ని నిర్మిస్తామని, అన్ని రకాల అసమానతలను తగ్గిస్తామని, దేశ సంపదను కేంద్రీకృతం కానివ్వబోమని రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. తెలంగాణ ప్రజల చైతన్యంలో ఈ విలువలు, అవగాహన మిగతా రాష్ట్రాలకంటే ఎక్కువ పాళ్లలో ఉన్నవి. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాజ్యాంగ దృక్పథమే ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ రాజకీయం కావాలి. ఈ కోణంలో ముఖ్యమంత్రి అన్నట్లు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ మీద దాడి జరిగితే సహించరు అన్నది నిజం. టీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా, ఈ "తెలంగాణ ఆత్మను" పట్టుకోలేకపోయింది. కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తే ప్రజలు సదా రుణపడి ఉంటారని ఎక్కడో ఒక అవగాహన లోపం ఆ పార్టీ సంక్షోభానికి ప్రధాన కారణం.

తెలంగాణ ప్రజల చైతన్యంలో ఈ విలువలు, అవగాహన మిగతా రాష్ట్రాలకంటే ఎక్కువ పాళ్లలో ఉన్నవి. టీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా, ఈ 'తెలంగాణ ఆత్మను' పట్టుకోలేకపోయింది. కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తే ప్రజలు సదా రుణపడి ఉంటారని ఎక్కడో ఒక అవగాహన లోపం ఆ పార్టీ సంక్షోభానికి ప్రధాన కారణం. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సభ్యులకు, మంత్రులకు ఈ అంశం మీద దృష్టి చాలా అవసరం. తాము ప్రజలతో ఎలా ప్రవర్తించాలి, సమస్యలకు ఎలా స్పందించాలి, ఎంత మానవీయంగా ఉండాలి? చరిత్ర తమ గురించి భవిష్యత్తులో ఎలా అంచనా వేస్తుంది? అన్న ఒక స్పృహ కలిగి ఉండాలి.



ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సభ్యులకు, మంత్రులకు ఈ అంశం మీద దృష్టి చాలా అవసరం. మంత్రులందరూ ఒక ప్రశ్న తమకు తాము వేసుకోవాలి. అధికారం యొక్క లక్ష్యం ఏమిటి? తాము ప్రజలతో ఎలా ప్రవర్తించాలి? సమస్యలకు ఎలా స్పందించాలి? ఎంత మానవీయంగా ఉండాలి? చరిత్ర తమ గురించి భవిష్యత్తులో ఎలా అంచనా వేస్తుంది? అన్న ఒక చారిత్రక స్పృహ కలిగి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమంటే ఒక తాత్విక, చారిత్రక అవగాహన ఉంటే తప్ప సాధ్యంకాదు. మంత్రులందరికీ కనీసం ప్రజల మీద నిర్బంధం తగ్గాలని, దాన్ని నియంత్రించాలనే కనీస పట్టింపు ఇప్పుడు అవసరం. ఉదాహరణకు తెలంగాణలో దుర్మార్గమైన ఉపా (UAPA) చట్ట దుర్వినియోగం దేశంలో ఏ రాష్ట్రంలో లేనంత పెద్ద ఎత్తున జరిగింది. గత పదేళ్లుగా తెలంగాణ గతంతో పోలిస్తే శాంతియుతంగానే ఉంది. ఐనా పదమూడు కుట్రకేసుల్లో రెండువందల కంటే ఎక్కువ మందిని ఇరికించారు. తాడ్వాయ్ ఉపా కేసు ఈ దురుపయోగానికి పరాకాష్ఠ. బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి, అత్యంత గౌరవప్రదుడైన జస్టిస్ సురేష్‌ని, అదీ ఆయన అమరుడైన రెండేళ్ల తర్వాత ఇందులో ఇరికించి ఆయనపై కుట్ర కేసు పెట్టడమేమిటో? పోలీసుల ఈ విచ్చలవిడి దురుపయోగానికి తెలంగాణ సమాజం నుండి పెద్ద ఎత్తున నిరసన రావడంతో మొత్తం కేసును ఎత్తివేసే బదులు ఆరు మందిపై కేసును ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కేసులు పెట్టే ముందు పై అధికారులకు కనీసం వీళ్లు ఎవ్వరు అనే కనీస విచక్షణైనా ఉండాలి కదా. పోలీసు యంత్రాంగం ఇలా ప్రవర్తించడానికి పోలీసులే పూర్తి కారణం కాదు. దీనికి రాజకీయ వ్యవస్థ ప్రత్యక్ష లేదా పరోక్ష సమ్మతి ఉన్నప్పుడే ఇలా ప్రవర్తిస్తారు. ఇలాంటి దురుపయోగానికి ప్రజలు పోలీసులను కాక అధికార పార్టీని శిక్షిస్తారు. గత ప్రభుత్వం పెట్టిన ఉపా కేసులని సమగ్రంగా సమీక్షించి వాటిని ఈ ప్రభుత్వం ఎత్తివేయాలి. గత వంద రోజులుగా ముఖ్యమంత్రి ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి మాట్లాడినా, కింది యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు వెళ్లలేదు. ఉదాహరణకు, భువనగిరిలో ఇద్దరు అమ్మాయిల ఆత్మహత్యకు నిరసనగా చైతన్య మహిళా సంఘం ధర్నా చేస్తే పోలీసులు దాన్ని భగ్నం చేసారు. ఇద్దరు జిల్లా స్థాయి అధికారులు, న్యూ డెమోక్రసీ పార్టీని, అరుణోదయ విమల నాయకత్వం వహిస్తున్న సంస్థను నిషేధిత సంస్థలుగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. ఆ రెండు సంస్థలు దశాబ్దాలుగా ఓపెన్‌గా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల మధ్య పనిచేస్తున్నవి. ఈ వైఖరికి మినహాయింపు.. కొన్ని దశాబ్దాల తర్వాత వరంగల్ పోలీసులు అమరుల బంధుమిత్రుల సంఘం విప్లవ రాజకీయ పార్టీల మీద నిషేధం ఎత్తివేయాలనే సదస్సు నిర్వహిస్తే ఏ మాత్రం జోక్యం చేసుకోలేదు. పౌరహక్కుల సంఘం తన యాభై సంవత్సరాల ప్రస్థానాన్ని జరుపుకుంటే హైదరాబాద్ పోలీసులు జోక్యం చేసుకోలేదు కానీ హరగోపాల్ నక్సలైట్ కాబట్టి ర్యాలీకి అనుమతి ఇవ్వం అనడంపై ఎలా స్పందించాలో తెలియడం లేదు. అనుమతి ఇవ్వకపోవడానికి ఏదో తమకు తోచిన కారణం చెప్పడం చాలా కాలం అలవాటుగా మారిన నేపథ్యంలో, ఈ వైఖరి మార్చే దిశగా చర్యలు ఉండాలి.

• ప్రొ. జి.హరగోపాల్



స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

ఐపీఎల్‌కు పటిష్ఠ బందోబస్తు

● 2,500 మంది పోలీసులతో పహారా ● మీడియా సమావేశంలో రాచకొండ సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో బుధవారం జరగనున్న ఐపీఎల్-2024 (ఇండియన్ ప్రీమియర్ లీగ్) మ్యాచ్‌కి 2500 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ముంబై ఇండియన్స్ సన్‌రైజర్స్ మధ్య మ్యాచ్ జరగనున్నట్లు తెలిపారు. స్టేడియాన్ని మంగళవారం నుంచే తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా సిబ్బందితో పాటు డీసీపీలు, ఏసీపీలు నేరుగా స్టేడియంలో తిరుగుతూ భద్రతను పర్యవేక్షించనున్నట్లు సీపీ తెలిపారు. ప్రత్యేకంగా 360 సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి ఐటీ సెల్ అధికారులు మానిటరింగ్ చేస్తారు. మహిళలకు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా, పోకిరీలు, ఆకతాయిలు వేధించకుండా షీటీమ్ బృందాలను మఫ్టీలో ఉంటారన్నారు.

వీటిని అనుమతించరు

- ల్యాప్‌టాప్స్, కెమెరాలు, మ్యాచ్‌బాక్స్‌లు, బైనాక్యులర్స్, బ్యాటరీలు, బ్యాగులు, బ్యానర్స్, సిగరెట్లు, లైటర్స్, కాయిన్స్, హెల్మెట్స్, బయటి నుంచి తెచ్చే తినుబండారాలు, వాటర్ బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, షార్ప్ మెటల్ వస్తువులు, వైరింగ్ పెన్స్‌కు అనుమతి లేదు.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్స్‌ను వాహనం వద్దనే ఉంచి లాకింగ్ ఏర్పాట్లు చేసుకోవాలి.

ట్రాఫిక్ మళ్లింపులు

ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ జరుగుతున్నందున నగరంలోకి వచ్చే హెవీ వాహనాలను దారిమళ్లిస్తామని సీపీ తరణ్‌జోషి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11:50 వరకు వాహనాల మళ్లింపులు అమల్లో ఉంటాయన్నారు.

ఆర్టీసీ 60 ప్రత్యేక బస్సులు

ఉప్పల్ స్టేడియంలో మార్చి 27న, ఏప్రిల్ 4న జరిగే ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చే అభిమానుల కోసం 60 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఆయా రోజుల్లో సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మెహిదీపట్నం, ఘట్‌కేసర్, హయత్‌నగర్, ఎన్జీవోస్‌కాలనీ, ఇబ్రహీంపట్నం, ల్యాబ్ క్వార్టర్స్ కోఠి, అఫ్జల్‌గంజ్, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, మేడ్చల్, వియాపూర్, జేబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, బోయిన్‌పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, కొండాపూర్, బీహెచ్ఈఎల్, ఎల్‌బీనగర్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి స్టేడియానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బస్సుల వివరాలు, ఇతర సమాచారం కోసం 9959226160 (కోఠి), 9959226154 (రేతిఫైల్ బస్‌స్టేషన్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్, అమల, తదితరులు

వీధి కుక్కల బెడద నివారణకు
సలహాలివ్వండి

స్వచ్ఛంద సంస్థలకు కమిషనర్ సూచన

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధికుక్కల బెడద నుంచి ప్రజలు సురక్షితంగా ఉండేలా జీహెచ్ఎంసీ పటిష్ఠ చర్యలు చేపట్టిందని కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛందసంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వీధికుక్కల బెడద, కుక్కకాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి కుక్కల విషయంలో అప్రమత్తంగా ఉండడం, వాటి బెడద నివారణకు

మిగతా 8వ పేజీలో..



యాప్ ద్వారా హాజరు తీసుకుంటున్న అధికారి

సింథ‘ట్రిక్స్’కు చెక్

ఫస్ట్ నుంచి ముఖ ఆధారిత హాజరు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హాజరు విషయంలో సింథటిక్ వేలిముద్రలను ఉపయోగించి జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొడుతున్న కేసులు వెలుగుచూడడంతో కొత్త విధానంలో హాజరు తీసుకునేందుకు అధికారులు శ్రీకారం చుడుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి ముఖ ఆధారిత (ఫేస్ రికగ్నైజేషన్) హాజరును తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఇప్పటికే ఈ విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. మొబైల్ యాప్‌లో సర్కిళ్ల వారీగా కార్మికులు, ఎస్ఎఫ్ఏల వివరాలు నమోదు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా కార్మికుల హాజరు తీసుకుంటారు. కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

Shaan-e Ramazan
షాన్-ఎ రమజాన్
ఇఫ్తార్: 6:35 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:51 (గురువారం ఉదయం)

- నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు
- రోడ్డు విస్తరణకు ఆటంకాలు
- చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయాలపై తర్జనభర్జన
- దుకాణాలు, ప్రార్థనా మందిరాలను తొలగిస్తేనే ముందుకు
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే క్షేత్రస్థాయిలో పనులు

పాతబస్తీలో మెట్రో ఓ సవాలే..!



దారుల్‌షిఫా నుంచి శాలిబండకు వెళ్లే మార్గంలోని మీరాలం మండి ప్రాంతం

పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణం అధికారులకు సవాల్‌గా మారింది. ఎన్నో అడ్డంకులను దాటితేకానీ.. పనులు సజావుగా సాగే పరిస్థితి కనిపించడం లేడు. ఏళ్ల తరబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపెట్టడంపై తర్జనభర్జన పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భారీ భవనాలను తొలగించడం, మతపరమైన కట్టడాలను, ప్రార్థన మందిరాలను సమస్యలు తలెత్తకుండా తరలించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్డు విస్తరణకు ఆస్తుల సేకరణ తలనొప్పిగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన పాతబస్తీ మెట్రోపనులపై కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. కారిడార్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఏకంగా రూ.2 వేల కోట్లను కేటాయించింది. పనులకు ఈనెల 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫరూక్‌నగర్‌లో శంకుస్థాపన చేశారు. మొదటి దశలో ప్రతిపాదించిన పనులకు ఇప్పటికే డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధంగా ఉండడంతో లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత పనులు ప్రారంభించనున్నారు.

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మొత్తం నాలుగు స్టేషన్లు రానున్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా వద్ద స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే దారుల్‌షిఫా-పురానీహవేలీ-ఎటెబార్‌చౌక్-అలీజాకోట్ల-మీర్‌మోమిన్ దైరా-హరిబౌలి-శాలిబండ-శంషేర్‌గంజ్-అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు ఎలివేటెడ్ కారిడార్ ఉంటుందని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. మెట్రో పిల్లర్లు, వయాడక్టుల నిర్మాణం కోసం 100 నుంచి 120 అడుగుల

దారుల్‌షిఫా-శాలిబండలో 60 ఫీట్ల రోడ్డు..

మేర రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని, ఈ మార్గంలో దాదాపు 1100 ఆస్తుల సేకరణ చేయాల్సి వస్తుందని చెప్పారు. అయితే, పనులు చేపట్టేందుకు పలుచోట్ల రోడ్డు విస్తరణ కష్టతరం కానున్నట్లు తెలుస్తోంది. శాలిబండ నుంచి ఫలక్‌నుమాకు వెళ్లే రోడ్డు ఇప్పటికే 80 అడుగుల వెడల్పుతో ఉంది. దీనిని రోడ్డుకు రెండు వైపులా 10 నుంచి 20 అడుగుల చొప్పున విస్తరిస్తే సులువుగా పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇక్కడ వ్యాపారులు సైతం కొంతమేరకు అంగీకరించే వీలుంది. కానీ, దారుల్‌షిఫా నుంచి శాలిబండ వరకు ఉన్న 2.5 కిలోమీటర్ల మార్గంలో ప్రస్తుతం 60 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా మరో 30 ఫీట్ల చొప్పున విస్తరించాల్సి ఉంది. ఈ క్రమంలో పురాతన భవనాలు, చిరు వ్యాపారుల దుకాణాలు, చిల్లాలు, దర్గాలను తొలగించాల్సి ఉంది. 5.5 కిలోమీటర్ల మార్గంలో మొత్తం 103 మతపరమైన నిర్మాణాలు, సున్నితమైన కట్టడాలను తొలగించాలి. అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటే తప్ప. పనులు ముందుకుసాగని పరిస్థితి నెలకొంది.

ఫలక్‌నుమాలో డిపో?

గ్రీన్‌లైన్ కారిడార్‌లో భాగంగా మొదటి దశలో జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 16 కిలోమీటర్ల పనులను ప్రతిపాదించారు. ఈ సమయంలో ఫలక్‌నుమా వద్ద డిపో ఏర్పాటుకు 17 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు అప్పగించారు. అప్పుడు వినియోగించుకోలేని స్థలాన్ని.. రెండో దశ విస్తరణ కింద ఉపయోగించుకోనున్నట్లు తెలుస్తోంది. రెండో దశలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్లతోపాటు ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1.5 కిలోమీటర్లను ప్రతిపాదించారు. ఫలక్‌నుమాలో డిపో ఏర్పాటుచేయడం ద్వారా జేబీఎస్, చాంద్రాయణగుట్ట మధ్య నడిచే రైళ్లకు ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫలక్‌నుమా వద్ద డిపోను ఏర్పాటు చేసే దిశగా అధికారులు ఆలోచిస్తున్నారు.

పిల్లి, ఎలుక, పావురం..

కాదేదీ ఫీడర్ల బ్రేక్‌డౌన్‌కు అనర్హం

విద్యుత్ సరఫరాలో తప్పని అంతరాయం

సరూర్‌నగర్ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్‌పై పిల్లిపడి.. గంటన్నరకు పైగా నిలిచిన సరఫరా

ప్రకృతి విపత్తుల వల్లే కాదు.. పక్షులు, ఎలుకలు, బల్లులు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమవుతున్నాయి. వాటి వల్ల గ్రేటర్‌జోన్ పరిధిలో ప్రతి నెలా 30కి పైగా ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. ఏడాదిలో 350 నుంచి 400 ఫీడర్లలో బ్రేక్‌డౌన్ సమస్యలు తలెత్తుతున్నాయి. పక్షులు, ఎలుకలు, ఉడతలతో పాటు బల్లులు ట్రాన్స్‌ఫార్మర్ల ఇన్సులేటర్లకు తగిలి కాలిపోతుండడంతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

పీటీఆర్‌పై పిల్లిపడటంతో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేసవిలో డిమాండ్ ఎంత పెరిగినా, సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా 24 గంటలూ విద్యుత్ అందిస్తామని ఆ శాఖ ప్రకటించింది. అయితే, అవుట్‌డోర్ సబ్‌స్టేషన్లలో పక్షులు, బల్లులు, పిల్లులు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పీటీఆర్), బ్రేకర్ల మధ్య తిరుగుతూ ఫీడర్ల బ్రేక్‌డౌన్‌కు కారణమవుతున్నాయి. మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో సరూర్‌నగర్

మిగతా 8వ పేజీలో..

ద్విచక్రవాహనం రిపేర్ విషయంలో గొడవ..
యువకుడి హత్య 8

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నిజాం కాలేజీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్లను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల కోసం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటరీ, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వారి కోసం కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లను ఇచ్చేందుకు నిజాం కళాశాల గ్రౌండ్‌లో మే 7 నుంచి 12 వరకు రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉద్యోగులు బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బొమ్మగాని ధర్మభిక్షంకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సామాజిక న్యాయం కోసం పాటుపడిన
బొమ్మగాని ధర్మభిక్షం

● సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల్లో, సమాజంలో ఇలా అన్నిస్థాయిల్లోనూ సామాజిక న్యాయం ఉండాలని కోరుకున్న వ్యక్తి బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. హైదరాబాద్‌లోని మగ్దుం భవన్‌లో మంగళవారం ఆయన 13వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ మీద ఏర్పాటు చేసేలా సీఎంకు లేఖ రాస్తామన్నారు. నగరంలో 50 ఎకరాల్లో తెలంగాణ రైతుల పోరాట స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత పనివారి ఉద్యమ నేతగా ఆ సంఘాన్ని దేశవ్యాప్తంగా ధర్మభిక్షం విస్తరించారని ఆయన సేవలను కొనియాడారు.

ఏజెంట్లు లేకనే
వెనుకబాటు!

- పాతబస్తీలో పోలింగ్‌బూత్‌ల విషయమై కమలదళం కసరత్తు
- ఏజెంట్లను నియవి ఎంచుకోవడంలో నిమగ్నం



హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పోలింగ్‌బూత్‌లలో ఏజెంట్ల నియామకం కమలం పార్టీకి కత్తిమీద సాములాగా మారింది. ఎంఐఎం కంచుకోటలో బీజేపీ ముద్ర వేసుకుని ఏజెంట్లుగా పనిచేసేందుకు చాలామంది భయపడుతున్నారు. ఏజెంట్లు ఉంటేనే బోగస్ ఓట్లకు కళ్లెం వేయగలమని బీజేపీ నేతలు భావిస్తున్నారు. 7









ప్రత్యేక రైళ్లు పొడిగింపు


● దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు అయా ప్రాంతాల నుంచి వెళ్లి వచ్చే ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్- అగర్తల(07030) రైలును(సోమ) ఏప్రిల్ 1 నుంచి జూన్ 24వరకు, అగర్తల- సికింద్రాబాద్(07029) రైలును(శుక్ర) ఏప్రిల్ 5నుంచి జూన్ 28 వరకు, సికింద్రాబాద్- దిబ్రూగఢ్(07046) రైలు(సోమ) ఏప్రిల్ 1నుంచి మే 13 వరకు, దిబ్రూఘర్- సికింద్రాబాద్(07047) రైలును(గురు) ఏప్రిల్ 4నుంచి మే16 వరకు, తిరుపతి సాయినగర్ శిరిడీ(07637) రైలు(ఆది) ఏప్రిల్ 7నుంచి జూన్ 30 వరకు, సాయినగర్ శిరిడీ- తిరుపతి (07638) రైలు(సోమ) ఏప్రిల్ 8నుంచి జూన్1 వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్- గోరఖ్‌పూర్(02575) రైలు(శుక్ర) ఏప్రిల్ 5నుంచి జూన్ 28వరకు, గోరఖ్‌పూర్- హైదరాబాద్(02576) రైలు(ఆది) ఏప్రిల్ 7నుంచి జూన్ 30వరకు, సికింద్రాబాద్- రక్సాల్(07007) రైలు(బుధ) ఏప్రిల్ 3నుంచి జూన్ 26వరకు, రక్సాల్- సికింద్రాబాద్(07008) రైలు(శుక్ర) ఏప్రిల్ 5నుంచి జూన్ 28వరకు, హైదరాబాద్- రక్సాల్(07051) రైలు(శని) ఏప్రిల్ 6నుంచి జూన్ 29వరకు రక్సాల్- హైదరాబాద్ (07052) రైలు(మంగళ) ఏప్రిల్ 9నుంచి జూలై 2వరకు సికింద్రాబాద్- దానపూర్(07419) రైలు(శని) ఏప్రిల్ 6నుంచి జూన్ 29వరకు, దానపూర్- సికింద్రాబాద్(07420) రైలు(సోమ) ఏప్రిల్ 8నుంచి జూలై 1 వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్- జైపూర్(07115) రైలు(శుక్ర) ఏప్రిల్ 5 నుంచి జూన్ 28వరకు, జైపూర్- హైదరాబాద్(07116) రైలు(ఆది) ఏప్రిల్ 7నుంచి జూన్ 30వరకు షోలాపూర్- ఎల్‌టీటీముంబై(01435) రైలు(మంగళ) ఏప్రిల్ 2నుంచి జూన్ 25వరకు, ఎల్‌టీటీ ముంబై- షోలాపూర్(01436) రైలు(బుధ) ఏప్రిల్ 3నుంచి జూన్ 26వరకు, తిరుపతి- షోలాపూర్(01438) రైలు(శుక్ర) ఏప్రిల్ 5నుంచి జూన్ 28వరకు, షోలాపూర్- తిరుపతి(01437) రైలు(గురు) ఏప్రిల్ 4నుంచి జూన్ 27వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

యూఎస్‌ఏలో ఆంకాలజీ సదస్సుకు 'బసవతారకం' డైరెక్టర్ డాక్టర్ టీఎస్ రావు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఏలో సొసైటీ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ వార్షిక సమావేశంలో ప్రసంగించాలని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ టి.సుబ్రమణ్యేశ్వర రావు(టీఎస్‌రావు)కు ప్రత్యేక ఆహ్వానం అందింది. డాక్టర్ టీఎస్ రావు లాన్సెట్ గ్లోబల్ ఆంకాలజీ కమిషన్ అంబాసిడర్‌గా కేన్సర్ శస్త్ర చికిత్సా పద్ధతులను మెరుగుపరచడం, విస్తరించడానికి చేసిన కృషిని గుర్తించి ఈ అరుదైన ఆహ్వానం అందించినట్లు బసవతారకం ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దక్షిణాసియాలో కేన్సర్ సర్జన్లకు అవసరమైన శిక్షణా పద్ధతులను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన పలు చర్యలను వివరిస్తూ తన అనుభవాలను పంచుకొన్నారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ టీఎస్ రావును ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.











కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

● మాణిక్‌రావుకు కండువా కప్పి ఆహ్వానించిన సీఎం



సీఎం రేవంత్‌తో మాణిక్‌రావు, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులమై ఆ పార్టీలో చేరామని వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పి. మాణిక్‌రావు అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అధ్వర్యంలో మాణిక్‌రావు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో తనకు మంచి పట్టు ఉన్నదని, ముఖ్యంగా దళిత వర్గాలను కాంగ్రెస్ వైపునకు తీసుకొచ్చి రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్ తదితరులు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు పనిచేయాలి

రాజేంద్రనగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు అందరూ సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రేంరాజ్ యాదవ్ సూచించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రేంరాజ్ మాట్లాడుతూ, బూత్ కమిటీలు సరిగ్గా పనిచేస్తున్నాయా.. లేదా అని చూసి వారి జాబితాను తీసుకోవాలన్నారు. ప్రతీ బూత్‌లో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, కోరని సదానంద్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, హరికిషన్‌జీ, పసుపుల సందీప్ ముదిరాజ్ పాల్గొన్నారు.



ఖాళీ స్థలంలో ముగ్గు వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాధారాణి, మహిళా సంఘాల సభ్యులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజేంద్రనగర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మన ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయొద్దని, స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలని ప్రజలకు సూచించారు. మంగళవారం శాస్త్రీపురం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ ప్రదేశాలలో ముగ్గులు వేసి, స్థానికులకు అవగాహన కల్పించారు. ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, ఖాళీ స్థలాలలో చెత్త, వ్యర్థాలు వేయడం వలన దుర్గంధంతో ప్రజలు రోగాల బారిని పడుతారని వివరించారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రతి నెలా రూ. 100లు చెల్లిస్తే, ఇంటింటికీ వారు వచ్చి చెత్తను తీసుకెళ్తారని చెప్పారు. వ్యాపారులు కూడా చెత్తను ఓ సంచిలో వేసి స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని సూచించారు.



ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లేశ్

'ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి'

గోషామహల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు నీటి సమస్య రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని జననీ ఫౌండేష్ అధ్యక్షుడు రాచకొండ మల్లేశ్ సూచించారు. జాంబాగ్ డివిజన్, కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో ంకుడు గుంతల ప్రాముఖ్యతపై విద్యార్థులకు జననీ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచకొండ మల్లేష్ మాట్లాడుతూ ఇంకుడుగుంతల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ, వారిని చైతన్య పరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. విద్యార్థులు ప్రతీ ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండేలా తల్లిదండ్రులకు తెలియజెప్పాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే వర్షాలు కురిసిన సమయంలో వరదనీరు ఇంకుడు గుంతల్లో చేరి భూగర్భజలాలు నిల్వ ఉంటాయని చెప్పారు. సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హేమ, మంజుల, ప్రమీళ, సునీత, జ్యోతి, కవిత, ప్రియా, కురుమయ్య పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో యువ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బి. దంపూరి, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అడాల్‌సెంట్ హెల్త్ అకాడమీ, యూ, నిలోఫర్ ఆస్పత్రి, శ్రీవిద్య హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమారదశలో వచ్చే మార్పులు, ఇబ్బందులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని వివేకనందానగర్‌లోని శ్రీవిద్య హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బి. దంపూరి కౌమారదశ, యుక్త వయస్సులో వచ్చే మార్పులు, ఆందోళన, శారీరకశ్రమ, వ్యక్తిగత శుభ్రత, ఆహారం తదితర అంశాలను వివరించారు. 150 మంది విద్యార్థులు, స్కూల్ ప్రిన్సిపాల్ హేమలత, కౌన్సిలర్ జీవన్ పాల్గొన్నారు.



చార్మినార్ పరిసర ప్రాంతాలను మంగళవారం సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. చార్మినార్ నుంచి మదీన వరకు నడుచుకుంటూ పలువురితో మాట్లాడుతూ రంజాన్ షాపింగ్‌ను పరిశీలించారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

చేవెళ్లలో రెండోసారి గులాబీ జెండా ఎగురవేస్తాం



బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

నార్సింగ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో రెండోసారి గులాబీ జెండా ఎగరవేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని హోం కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా సబితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలిచారని, త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ గత ఫలితమే పునరావృతం అవుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న వారితో నష్టమేమీ లేదన్నారు. ప్రజల అండ బీఆర్ఎస్ పార్టీకే ఉన్నదని సబితారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి ఆదరణ ఉందని, ఎంపీగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలవడం ఖాయమని అన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి ఎన్నో సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. 96 కులాల బీసీ ఐక్య వేదిక ఏర్పాటు చేసి అందరి ఐక్యతకు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాటు పడ్డారని ఎమ్మెల్యే కొనియాడారు. బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్ల తనకు తెలియని ప్రాంతం కాదని, తనకు ఈ నియోజకవర్గంతో విడదీయరాని బంధం ఉందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో తనకు వెన్నంటి ఉన్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారని భారీ మెజార్టీతో గెలుస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, మున్సిపాలిటీల చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలా నాయకులు పాల్గొన్నారు. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట కవిత ఫొటో లేకపోవడం చర్చనీయంశంగా మారింది.

'హైదరాబాద్' ఎంపీ సీటు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇస్తా: గడ్డం శ్రీనివాస్ యాదవ్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, పక్కన తలసాని, పద్మారావు తదితరులు

గోషామహల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు కానుకగా ఇస్తానని ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆయన మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇక్కడి నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించి కానుకగా ఇస్తానని అన్నారు.

గత పదేళ్లుగా తన తండ్రి గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నానని, పేద విద్యార్థులను గుర్తించి ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులలో హైందవి కాలేజీలో చేర్పించి వారికి ఉచితంగా విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. నగరంలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలతో తనకు మంచి సత్సంబంధాలు ఉన్నాయన్న ఆయన, త్వరలో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో ప్రత్యక్షంగా కలిసి ఎన్నికల ప్రచారానికి ప్రణాళికను రూపొందిస్తానని తెలిపారు.

తెలంగాణ నాటక రంగాన్ని విశ్వ వ్యాప్తం చేయాలి: మధుసూదనాచారి



గోపాలకృష్ణను సత్కరిస్తున్న మధుసూదనాచారి, రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా నాటక రంగ వృద్ధికి కృషి చేస్తున్న రసరంజని సంస్థ సేలు అభినందనీయమని అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి కొనియాడారు. అంతర్జాతీయ రంగస్థల దినోత్సవంలో భాగంగా రసరంజని 31వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న నాటకోత్సవం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం పాండవోద్యోగమ్ పద్యనాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మధుసూదనాచారి కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సాంస్కృతిక రంగ వికాసంలో రమణాచారి పాత్ర గొప్పదని పేర్కొన్నారు. నాటకమంటే చిన్నానాటి నుంచి చాలా ఇష్టమని తెలిపారు. చిన్నతనంలో సురభి నాటకాలు చూస్తూ పెరిగామని చెప్పారు. తెలంగాణ నాటకాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరముందని అన్నారు. ఈ దశలో రసరంజని చేస్తున్న కృషి గొప్పదని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి, కేంద్ర సమాచార శాఖ మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్, ఓలేటి పార్వతీశం, కామేశ్వరరావు తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం పాండవోద్యోగమ్ పద్య నాటకాన్ని ప్రదర్శించారు. తిరుపతి వేంకట కవులు రచించిన ఈ నాటకానికి గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వ నిర్వాహణ చేశారు. చక్కటి పద్య పఠనంతో గుమ్మడి గోపాకృష్ణతో పాటు పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు.



పొన్న వెంకట్ రమణను పరామర్శిస్తున్న బండి సంజయ్

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు

● కరీంనగర్‌ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

చాంద్రాయణగుట్ట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమ పార్టీకి లేదని కరీంనగర్‌ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులే కూలుస్తారన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్న వెంకట్ రమణ తండ్రి పొన్న సుదర్శన్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన అలియబాద్ లోని పొన్న వెంకట్ రమణ ఇంటికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ లోక్ సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బోగస్ ఓట్లను తొలగించాలని ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ బిఆర్ ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని తెలిపారు. కాళేశ్వరంపై విచారణ పేరిట కాంగ్రెస్ పార్టీ సాగదిస్తుందని. అసెంబ్లీ లో బీఆర్ఎస్ ఆరు గ్యారంటీలపై నోరు మేదపొద్దని, అంతర్గత ఒప్పందం అన్ని బండి సంజయ్ కుండ బద్దలు కొట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, నాయకులు తాడెం శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్, భానుప్రకాష్, శివచంద్రగిరి, మహేందర్, పాతనగర మున్నూరు కాపు సంఘం నాయకులు తిరుపతి శివ కుమార్, జానకిరామ్, గోవింద్ పాల్గొన్నారు

ఏజెంట్లు లేకనే వెనుకబాటు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు రెండు వేల పోలింగ్ బూత్‌లున్నాయి. ఇందులో దాదాపు 300 నుంచి 500 పోలింగ్ బూత్‌లు బస్తీలు, గల్లీల్లో ఉన్నాయి. అలాంటిచోట్ల బీజేపీ ఇప్పటివరకు ఏజెంట్లను నియమించుకోలేక పోయింది. ఈసారి ఎలాగైనా ఏజెంట్లను నియమించుకోవాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. సమర్థులైన కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన భరోసా ఇచ్చి ఏజెంట్లుగా పంపాలని ప్రణాళికలో ఉన్నది. గట్టి బందోబస్తు, ఏజెంట్ల నియామకం ద్వారా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో బోగస్ ఓట్లను నిలవరించవచ్చునని బీజేపీ భావిస్తోంది. అంతే కాకుండా, గతంలో తొలగించిన దాదాపు లక్షన్నర మంది ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్పినట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఆ ఓట్లు తమకు లాభిస్తాయని భావిస్తున్నారు. ఇంకా దాదాపు నాలుగున్నర లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఒక్కొక్క ఇంట్లో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు ఉన్నాయని, ఖాళీ స్థలాల చిరునామాలో కూడా ఓటర్ల పేర్లు నమోదు అయినట్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఓట్లను అడ్డుకుంటే బీజేపీ లాభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ దిశగా పార్టీ శ్రేణులు దృష్టి సారించినట్లు చెబుతున్నారు. అలాగే పేద మైనారిటీ వర్గాలను ఆకట్టుకునేందుకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవీలత కొంత కాలంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నాయకులు చెబుతున్నారు. పోలింగ్ నాడు బూత్ ఏజెంట్లను పెట్టకపోవడంతో ఓటింగ్ ఇష్టానుసారంగా జరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఏజెంట్లపై దృష్టి సారించాలన్న నిర్ణయానికి వచ్చారు.

పూర్వ వైభవం కోసం..

పాతబస్తీలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తూ వచ్చిన బీజేపీ ఇప్పుడు దాదాపు సమఉజ్జీగా ఉందని చెప్పాలి. అసెంబ్లీ, పార్లమెంట్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలే బలంగా పోటీ పడుతున్నాయి. మజ్లిస్ కంచుకోటను బీటలు కొట్టి మళ్లీ పూర్వవైభవం పొందాలనే ప్రణాళికలో ఈసారి విరించి ఆస్పత్రుల చైర్‌పర్సన్ మాధవీలతకు హైదరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారు.

ఆమె కొంతకాలంగా ధార్మిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల ద్వారా స్థానికంగా పేరొందారు. టికెట్ ప్రకటించక ముందు నుంచే పాతబస్తీలో హైందవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు, చైతన్యం తీసుకురావడం ద్వారా వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

1980 నుంచి పోరాటం..

1962లో జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి జనసంఘ్ పోటీ చేసింది. 1980లో జనసంఘ్ జనతాపార్టీలో విలీనం కావడంతో ఆలె నరేంద్ర ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1,35,304 ఓట్లు సాధించారు. 1991, 1998, 1999 ఎన్నికల్లో పోటీ చేసిన బద్దం బాల్‌రెడ్డి కూడా ఓడిపోయారు. కానీ, మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందారు. 1991లో ఆయన 42.2 శాతం ఓట్లు సాధించడం విశేషం. 2004 ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి సుబాష్ చందర్‌జీ పోటీ చేసి 2 లక్షలా 78 వేల ఓట్లు సాధించారు. 2009లో సతీష్ అగర్వాల్ పోటీ చేసినా, కనీస ఓట్లు సాధించలేకపోయారు. అప్పటి నుంచి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. 2014లో స్థానికంగా పట్టు ఉన్న భగవంతరావును బరిలోకి దింపడంతో ఆయన గట్టి పోటీ ఇచ్చి దాదాపు 3,11,414 ఓట్లు సాధించారు.

ఓడిపోయినా పాతబస్తీలో బీజేపీకి ఆదరణ ఉందని నిరూపించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో భగవంతరావు మళ్లీ పోటీ చేసి ఓడిపోయారు. ఈ లోక్‌సభ స్థానం నుంచి నాలుగు సార్లు కాంగ్రెస్, ఒకసారి తెలంగాణ ప్రజా సమితి విజయం సాధించింది. వరుసగా 12 సార్లు మజ్లిస్ పార్టీయే గెలిచింది. ఆలే నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి వంటి నేతలు మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చినా మజ్లిస్‌ను నిలువరించి ఎంపీగా గెలవలేకపోయారు.

తెలంగా ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు, వైద్యాధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం కోఠిలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (పరిపాలన వైద్య విద్య సంచాలకులు) డాక్టర్ వాణి, అకాడమిక్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా.శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, ప్రవీణ్, బసప్ప, రమేష్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, కౌసరున్నీసా, ముజీబ్, శ్రీనివాస్, నరసయ్య, రత్నమాల, కవిత, విజయ భాస్కర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా నగరానికి గంజాయి

● ట్రాలీ వాహనంలో తీసుకొస్తున్న ఇద్దరి అరెస్ట్

● రూ. 30 కేజీల గంజాయి ప్యాకెట్లు, ట్రాలీ వాహనం స్వాధీనం





స్వాధీనం గంజాయి ప్యాకెట్లు, ట్రాలీ, ద్విచక్ర వాహనం

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా నగరానికి ట్రాలీ వాహనంలో అక్రమంగా గంజాయి తీసుకొస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయి, అశోక్ లేల్యాండ్ ట్రాలీ, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో వాహన తనిఖీలు న్వహిస్తున్నారు. ఒడిశాకు చెందిన ఆయాన్ దీపక్ పాటిల్ గంజాయి సరఫరా చేస్తుండేవాడు. నగరంలో ఈదీ బజార్ యాకుత్‌పురా రైల్వే బ్రిడ్జి వద్ద ఉంటున్న మహ్మద్ అయాన్ అలీఖాన్ అలియాస్ అయాన్(36), చార్మినార్ తలాబ్‌కట్ట జావీద్ నగర్‌కు చెందిన మహ్మద్ మొయినుద్దీన్(38) డ్రైవర్లు. ఇద్దరు ఒడిశాలో దీపక్ పాటిల్ వద్ద 30 కిలోల (15 ప్యాకెట్లు) గంజాయి కొనుగోలు చేశారు. ఆ ప్యాకెట్లను అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనంలో తీసుకుని నగరానికి బయలుదేరారు. వారికి ముందు ద్విచక్ర వాహనంపై మహ్మద్ మొహీనుద్దీన్ వస్తూ ఎక్కడెక్కడ తనిఖీలు జరుతుగున్నాయో ముందస్తు సమాచారం అందిస్తుండగా, వెనుకాల అయాన్ అలీఖాను ట్రాలీతో వస్తుండేవాడు. మంగళవారం తెల్లవారుజామున వారు మైలార్‌దేవుపల్లికి చేరుకున్నారు. ఆ సమయంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న ఎస్ఓటీ పోలీసులకు అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ట్రాలీలో చిన్నచిన్న ప్యాకెట్లలో దాదాపు 30 కేజీ గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ దాదాపు రూ. 22 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒడిస్సాలో కేజీ రూ. 5 వేలకు కొనుగోలు చేసి నగరంలో కేజీ రూ.35 వేలకు విక్రయిస్తున్నట్టు నిందితులు అంగీకరించారు. ఇద్దరిని అరెస్ట్ చేశామని, ప్రధాన గంజాయి సరఫరాదారుడు దీపక్ పాటిల్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. మహ్మద్ అయాన్ అలీఖాన్‌పై నార్సింగ్, మేడిపల్లి, లంగర్‌హౌజ్, మలక్‌పేట్, మేడిపల్లి, సైదాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులు, 30 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవుపల్లి పోలీసులకు అప్పగించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/CsJblYX లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఎస్సీ మోర్చా బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా జోగి రవి



కొండేటి శ్రీధర్‌ను సన్మానిస్తున్న జోగి రవి

రాజేంద్రనగర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్‌కు చెందిన జోగి రవిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీచేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకునకు కృషిచేయాలని శ్రీధర్ సూచించారు. జోగి రవి మాట్లాడుతూ ఇప్పటికే మాదిగల మద్దతు బీజేపీకి ఉన్నదని, ఎస్సీలు అందరూ సమష్టిగా పనిచేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు.

టీ హబ్‌లో 'ఈవెంట్ నీడ్జ్'



మాట్లాడుతున్న జయేష్ రంజన్

రాయదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాలని తెలంగాణ ఐటీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని టీహబ్‌లో ఈవెంట్ నీడ్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెంటల్స్, సేల్స్ వెండర్‌లతో వినియోగదారులను కనెక్ట్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీహబ్ సీ ఈవో అనీష్‌ఆంథోని, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరి స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరాంబాబు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో ఏసీపీ మునావర్‌అలీ, సీఐ రామస్వామి

ఎన్నికల్లో నిర్భయంగా ఓటేయాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటేయాలని కుల్సుంపుర ఏసీపీ మునావర్ అలీ, ఇన్‌స్పెక్టర్ రామస్వామి అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి జియగూడ, బల్దియా కాలనీ, సమర్థ నారాయణ కామధేను గోశాల, గోపీ హోటల్, ఇందిరానగర్ తదితర బస్తీల్లో సీఐఎస్ఎఫ్ ఫోర్స్ అదనపు పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మునావర్ అలీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం బస్తీల ప్రజలు కూడా పోలీసులకు అండగా నిలువాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణవేణి, సిహెచ్.నర్సింగ్‌రావు, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

● 20 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలు అపహరణ

రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారం, వెండి నగలను అపహరించుకు పోయారు. కిస్మత్‌పూర్ శివసాయి కాలనీలో ఉంటున్న లోకేశ్ ఇంటికి తాళం వేసి ఆదివారం బంధువుల వద్దకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. మంగళవారం లోకేశ్ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పన్నెండేళ్ల బాలికకు అరుదైన సర్జరీ


శస్త్రచికిత్స చేయించుకున్న బాలికతో వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గూనితో బాధపడుతున్న ఓ బాలికకు అరుదైన శస్త్రచికిత్స చేసి సరిచేశారు. తీవ్రమైన స్కోలియోసిస్, న్యూరోఫైబ్రోమాటోసిస్‌తో గూని ఏర్పడి ఇబ్బంది పడుతున్న పన్నెండేళ్ల బాలికకు ఈ ప్రక్రియను నిర్వహించారు. ఈ జబ్బు వల్ల ఆమె శ్వాస, ఆహారం తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. వైద్య పరీక్షల అనంతరం బాలికకు 11గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించినట్లు వెన్ను శస్త్రచికిత్స విభాగం అధిపతి డాక్టర్ వెంకట రామకృష్ణ తెలిపారు.

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-1లో ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో 2024లో గ్రూప్-1 సర్వీసెస్ పరీక్ష రాసే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నాంపల్లి హజ్‌హౌస్ భవనంలోని 6వ అంతస్తులోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు స్వీకరణ గడువును మార్చి 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

● మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ బోర్డ్

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తండ్రి, సంరక్షకులు లేని విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రొఫెసర్. ఎం.ఆర్.వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు దరఖాస్తు పత్రంతో పాటు తండ్రి లేక సంరక్షకుని మరణ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్ నంబరు జతచేసి ఏప్రిల్ 7లోగా కాచిగూడలోని మున్నూరుకాపు ట్రస్ట్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.040-24658160, 9491627404లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఓయూలో జాతీయ స్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్

తార్నాక, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27నుంచి ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండురోజుల పాటు జాతీయస్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాధిపతి డా. టి.సతీష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్ధమాన చిత్ర నిర్మాతలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఓయూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం, తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక విభాగం సంయుక్త సహకారంతో ఈ నెల 27, 28న జాతీయస్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొ. ఆర్.లింబాద్రితో పాటు, ఓయూ వీసీ డా.రవీందర్, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రెండురోజుల పాటు జరిగే జాతీయ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్యానల్ చర్చలు, థియేటర్ నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చిత్ర ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

4న సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు

బంజారాహిల్స్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సుచిరిండియా ఫౌండేషన్ ఇచ్చే సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏప్రిల్ 4న శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో నిర్వహించనున్నారు. పలు దఫాలుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో సుమారు 1500 పాఠశాలలకు చెందిన లక్ష మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 16 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 16మంది ర్యాంకర్స్‌కు, 396 జిల్లా స్థాయి ర్యాంకర్లకు చిత్రాలయ అవార్డులు, 8 మందికి గురుబ్రహ్మ అవార్డుల ప్రదానం చేయనున్నారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఎల్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సినీ రచయిత చంద్రబోస్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరం

● రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్ ● సికింద్రాబాద్‌లో మానవ అక్రమ రవాణాపై వర్క్‌షాప్


మానవ అక్రమ రవాణాపై బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రైల్వే పోలీస్ అధికారులు తదితరులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరమని, తెలంగాణ రాష్ట్రం సేఫ్ జోన్‌గా ఉండేందుకు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సమర్థవంతంగా పని చేయాలని రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్ సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో జరిగిన ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీస్ అధికారుల వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2023లో 500మంది బాలకార్మికులు యువతీ యువకులను మానవ అక్రమ రవాణా కింద అదుపులోకి తీసుకుని ప్రభుత్వ సీడబ్ల్యూసీ కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. అక్రమ రవాణా సూత్రధారులు ఎవరైనాసరే అరెస్ట్ చేసి జైలుకు పంపించాలని, నిందితులకు శిక్ష పడేందుకు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమసింగ్ ఠాగూర్, బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో మానవ అక్రమ రవాణాపై ఆర్పీఎఫ్, జీఆర్పీ బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ సంయుక్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే డివిజనల్ మేనేజర్ బర్తేష్ కుమార్ జైన్, రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మితి బెనర్జీ, ఆర్పీఎఫ్ డీఐజీ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ షాదన్ జెబ్ ఖాన్, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమాతో పాటు పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.


పోలీసుల వైఖరిని నిరసిస్తూ బైఠాయించిన మహిళా మోర్చా నాయకులు

చెంగిచర్లలో మరోసారి ఉద్రిక్తత

● బాధిత కుటుంబాలకు బీజేపీ మహిళా మోర్చా పరామర్శ

● నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్

ఉప్పల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకలు జరుపుకుంటున్న కుటుంబాలపై ఓ వర్గం దాడి చేసిన ఘటనలో గాయపడిన మహిళలను మంగళవారం బీజేపీ మహిళా మోర్చా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మహిళలు పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఘటనా స్థలంలో బైఠాయించి ఆందోళన చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మేకల శిల్పారెడ్డితోపాటు మరికొంతమంది మహిళలను అరెస్ట్ చేసి కీసర పీఎస్‌కు తరలించారు.

నిందితులను అరెస్టు చేయాలి: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్

నిందితులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, కల్యాణ్ నాయక్ వెంట ఉన్నారు.

ప్రజాపాలన పేరుతో కుల, వారసత్వ రాజకీయాలు


ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

పంజాగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో కుల, వారసత్వ రాజకీయాలు చేస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఐదుగురు, బీఆర్ఎస్ ఆరుగురు బీసీలకు ఎంపీ టికెట్లు ఇవ్వగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ప్రకటించిన తొమ్మిది సీట్లలో రెండు మాత్రమే బీసీలకు ఇచ్చిందని, మిగతా ఎనిమిది సీట్లలో ఎక్కువ సీట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సామాజికవర్గానికి చెందిన వారి ఇళ్లలోకి వెళ్లి మరీ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలో ఏ సామాజిక వర్గానికి ఎన్ని పదవులు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు సముచిత స్థానం కల్పించిన వారికే తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు మాజీ ఎంపీ బి.ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, టి.విక్రమ్ గౌడ్, లింగం గౌడ్, మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో శరవేగంగా మార్పులు


జ్యోతి వెలిగించి సెమినార్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి

కవాడిగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆసియాలో శరవేగంగా రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. రాజకీయ మార్పులు, భౌగోళికపరమైన మార్పులను ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దోమలగూడలోని ఏవీ కళాశాలలో మంగళవారం ఏవీ కళాశాల, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ ఆధ్వర్యంలో 'ఆసియా భౌగోళిక- రాజకీయ సవాళ్లు' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి హాజరై జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ శాంతి, సౌభ్రాతృత్వం అనేఅంశాలతో భవిష్యత్‌లో ఆసియా దేశాలన్నీ కూటమిగా ఏర్పడి లోకకల్యాణం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ భీం బహదూర్ సుబ్బా, ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, రాజకీయ విశ్లేషకులు గిరిధర్ మామిడి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ సెక్రటరీ డాక్టర్ గీతారెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ బుచ్చారెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విజయంలో ఓబీసీ మోర్చా ప్రధాన భూమిక పోషించాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల విజయంలో ఓబీసీ మోర్చా ప్రధాన భూమిక పోషించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. అనేక రాష్ట్రాలలో బీసీలు బీజేపీకి అండగా నిలుస్తున్నారని అన్నారు. మంగళవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణలో 10 ఎంపీ స్థానాలను, దేశవ్యాప్తంగా 400పైగా ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకొని మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి రాధేశ్యామ్, ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులు సంజయ్ గనాటే, మహేష్, రమేష్‌గౌడ్, బైరి శంకర్, నగర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లి, ఎలుక, పావురం..

(5వ పేజీ తరువాయి)

నందనవనం సబ్‌స్టేషన్‌లో ఓ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బ్రేకర్ లింబోపై పిల్లి పడటంతో అది పేలిపోయింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని 13 ఫీడర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి గంటన్నర పాటు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. ఉన్నతాధికారులు, 20 మంది సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు. నాలుగురోజుల క్రితం జైన్‌మందిర్ ఫీడర్ పరిధిలో ఇన్సులేటర్ కండక్టర్ మధ్య ఓ పావురం చిక్కి చనిపోవడంతో ఫీడర్ ట్రిప్పయి విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. రెడ్‌హిల్స్ ప్రాంతంలోనూ అలాగే.. ఇటీవల సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. గ్రేటర్‌లో మొత్తం 364 సబ్‌స్టేషన్లు ఉండగా, వాటిలో 80 శాతం ఔట్‌డోర్‌లో ఉన్నాయి. సబ్‌స్టేషన్ల చుట్టూ చెత్త కుప్పలు పేరుకుపోవడం, శివారు ప్రాంతాల్లో నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

సీఎండీ సమీక్ష

విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు తగ్గించేందుకు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూక్ డిస్కం పరిధిలోని 21 సర్కిళ్ల ఎస్ఈలతో రోజూ ఉదయం గంటపాటు ఆన్‌లైన్‌లో సమీక్షిస్తున్నారు. ఏ ప్రాంతంలో 10 నిమిషాలు సరఫరా నిలిచినా విచారణ చేపడుతున్నారు. పక్షులు, ఎలుకల కారణంగా ఫీడర్లు ట్రిప్పు కాకుండా ఉండేలా కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తాజాగా సిబ్బందిని ఆదేశించారు.

సలహాలివ్వండి

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై సూచనలు ఇవ్వాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వాటికి వ్యాక్సినేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీడర్ స్వచ్ఛంద సంస్థల నమోదు, కమ్యూనిటీ అడాప్షన్‌పై ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కోర్ కమిటీ ఏర్పాటు చేసి.. సలహాలు, సూచనలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనున్నట్లు కమిషనర్ చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ రవికిరణ్, అక్కినేని అమల, కుమారి, వాసంతి, ఫిలిప్ బట్, అర్చన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ర్యాండమైజేషన్ పూర్తి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో నియోజకవర్గస్థాయిలో శిక్షణ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్లు అందించడంతో పాటు అవగాహన కల్పించాలని సూచించారు.

సెల్‌ఫోన్ టవర్‌లో సిగ్నల్ బాక్స్‌ల చోరీ ముఠా అరెస్ట్

● 9మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ● రూ. 60లక్షల సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏయిర్‌టెల్, జియో సెల్‌టవర్లలో అమర్చే 4జీ, 5జీ సిగ్నల్ ఆర్ఆర్‌యూ (రిమోట్ రేడియో యూనిట్) ఆర్ఆర్‌హెచ్(రిమోట్ రేడియో హెడ్) బీబీయూ(బేస్ బాండ్ యూనిట్) బాక్స్‌లు, టవర్ కేబుల్ వైర్లు చోరీ చేసి విక్రయిస్తున్న ముఠాను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 9 మందిని అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన బానావత్ నాగరాజు, మాలోత్ నగేష్ నగరానికి వచ్చి ఎల్‌బీనగర్‌లో ఉంటూ.. ఏయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో టవర్‌రిగ్గర్స్‌గా పనిచేస్తున్నారు. ఏపీకి చెందిన వెంకటరమణ ఏయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో సబ్ కాంట్రాక్టు తీసుకొని సెల్‌టవర్స్‌లో 4జీ, 5జీ సిగ్నల్స్‌కు సంబంధించిన ఆర్ఆర్‌యూ, ఆర్ఆర్‌హెచ్, బీబీయూ వంటి బాక్స్‌ల ఇన్‌స్టాలేషన్ చేయిస్తుంటారు. నాగరాజు, నగేష్ అతని వద్ద నెలజీతానికి పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. లగ్జరీ జీవితానికి అలవాటుపడిన నిందితులిద్దరూ సెల్‌టవర్స్‌లో బిగించే ఎక్విప్‌మెంట్ బాక్స్‌లను చోరీ చేసి మార్కెట్లో అమ్మేసి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు. అనుకున్నదే తడవుగా నగరంలోని ట్రై కమిషనరేట్ పరిధిలో ఖైరతాబాద్, కాచిగూడ, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, మీర్‌పేట, వనస్థలిపురం, నాగోల్, హయత్‌నగర్, శంషాబాద్, బాలానగర్ ప్రాంతాల్లో వారు ఇన్‌స్టాల్ చేసిన సెల్‌టవర్‌లలోని సిగ్నలింగ్ బాక్స్‌లు చోరీ చేశారు. వాటిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన చుక్కోలు శివ, దిల్‌షాద్ మాలిక్, చాంద్‌మాలిక్, సహారణ్యా మాలిక్, సోహిల్ మాలిక్‌లకు ఒక్కో బాక్స్‌ను రూ. 3లక్షల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నాగరాజు, నగేష్‌లు ఏయిర్‌టెల్ కంపెనీకి చెందిన సిగ్నలింగ్ బాక్స్‌లు చోరీ చేస్తుంటే.. నల్గొండ జిల్లాకు చెందిన నీరుడు చైతన్య, లావూరి రవి నాయక్ జియో కంపెనీకి చెందిన సిగ్నలింగ్ బాక్స్‌లు చోరీ చేస్తున్నారు. వీరంతా కలిసి ఉత్తరప్రదేశ్ మీరట్‌కు చెందిన ముఠాకు వాటిని అమ్ముతున్నారు.

● విదేశాలకు తరలింపు..

నాగరాజు, నగేష్‌ల నుంచి కొనుగోలు చేసిన సెల్‌టవర్స్ సిగ్నలింగ్ బాక్స్‌లను యూపీ దొంగలు వాటిని విదేశాలకు తరలించి అధిక మొత్తంలో సంపాదిస్తున్నారు. సిగ్నలింగ్ బాక్స్‌లను ఇండియాలో ఎక్కడ తిరిగి ఇన్‌స్టాల్ చేసినా.. వెంటనే ఎయిర్‌టెల్ కంపెనీ వారికి తెలిసిపోతుంది. దాంతో వాటిని దేశం దాటించి ఇతర ఏషియన్ కంట్రీస్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.


బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పిల్లలతో భిక్షాటన చేయించొద్దు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో భిక్షాటన చేయించి వారి జీవితాలను నాశనం చేయొద్దని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలోని ప్యారడైజ్, ప్యాట్నీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, మైత్రివనం, బల్కంపేట్ టెంపుల్, ఐఎస్ సదన్, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట, జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద భిక్షాటన చేస్తున్న వీధి బాలలు, వారి తల్లులను 25 మందిని జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ అధికారులు ఇటీవల స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించారు. ఈ మేరకు మంగళవారం కాచిగూడ నింబోలిగడ్డలోని జువెనైల్ గర్ల్స్ హోమ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో వారిని మహారాష్ట్రలోని షోలాపూర్‌లోని స్వగ్రామాలకు తరలించారు. ఈ బస్సును కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు, బాలికల హోమ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, బాల రక్షభవన్ అధికారి సుమలత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్, జువెనైల్ గర్ల్స్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికతో వెకిలి చేష్టలు.. పాస్టర్‌కు ఐదేళ్ల జైలు


పాస్టర్ సురేష్

అడ్డగుట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ నేర్పిస్తానంటూ పదహారేళ్ల బాలికతో వెకిలి చేష్టలకు పాల్పడిన ఓ పాస్టర్‌కు నాంపల్లి పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు, జరిమానా విధించింది. గోపాలపురం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని క్రిస్టియన్ మ్యాట్రిమోని మేనేజర్‌గా పనిచేస్తున్న మల్కాజిగిరి వసంతపురి కాలనికి చెందిన పాస్టర్ టి.సురేష్ వద్ద 2021 మార్చిలో పనిచేసేందుకు నగరానికి చెందిన 16 ఏళ్ల బాలిక చేరింది. 2021 మార్చి 18న పాస్టర్ సురేష్ బాలికకు కంప్యూటర్ నేర్పిస్తానని ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు వెంటనే గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న గోపాలపురం పోలీసులు పాస్టర్ సురేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు సాక్షాధారాలను నాంపల్లి పోక్సో కోర్టులో దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష కొనసాగించాలని తీర్పు ఇచ్చారు.

ద్విచక్రవాహనం రిపేర్ విషయంలో గొడవ..

యువకుడి హత్య

● జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

జీడిమెట్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పాడై పోయిన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతులు చేయించే విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంలో ఓ యువకుడు కత్తిపోట్లకు గురై మృతిచెందాడు. ఈఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జైలర్‌సింగ్(22), సమీర్ స్నేహితులు. వీరు సుభాష్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరు కొన్ని రోజులుగా వికారాబాద్ జిల్లా తాండూర్‌లో షెడ్ నిర్మాణ పనులు చేస్తున్నారు. హోలీ పండుగ సందర్భంగా జైలర్‌సింగ్ మరికొంతమంది స్నేహితులతో కలిసి సుభాష్‌నగర్‌కు వచ్చాడు. సమీర్ జైలర్‌సింగ్ ద్విచక్రవాహనంపై సుభాష్‌నగర్‌కు వచ్చాడు. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం కొంత దెబ్బతిన్నది. వాహనం రిపేర్ విషయమై మంగళవారం 3గంటల ప్రాంతంలో సమీర్‌ను పిలిపించి జైలర్‌సింగ్ కొట్టాడు. దీంతో కోపోద్రిక్తుడైన సమీర్ అప్పటికే తనతోపాటు తెచ్చుకున్న కత్తితో జైలర్‌సింగ్‌ను విచక్షణా రహితంగా పొడవడంతో తీవ్రరక్తస్రావమై అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితుడు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆస్పత్రికి తరలించారు.

జిమ్‌లో స్టెరాయిడ్స్‌ను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్టెరాయిడ్ ఇంజక్షన్‌లు విక్రయిస్తున్న ముఠాను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 75 మెఫెంటర్‌మైన్ ఇంజక్షన్‌లను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ రష్మీ పెరుమాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్‌కు చెందిన నితేష్ సింగ్, తప్పాచబుత్రాకు చెందిన రాహుల్‌సింగ్ జిమ్ ట్రైనర్స్‌గా పనిచేస్తున్నారు. స్టెరాయిడ్‌కు సంబంధించిన మెఫెంటర్‌మైన్ ఇంజక్షన్‌లు అడ్డదారిలో తెచ్చి జిమ్‌కు వచ్చేవారికి విక్రయిస్తున్నారు. బయట మార్కెట్లో రూ.500లకు దొరికే ఇంజక్షన్‌లను రూ. ఒక్కొక్కటి రూ.1500లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి జిమ్ ట్రైనర్స్‌ను పట్టుకున్నారు. ఆసిఫ్‌నగర్ పోలీసులు నిందితులను కటకటాల్లోకి నెట్టి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఉద్యోగి అదృశ్యం

● త్వరగా ఆచూకీ కనిపెట్టాలని పిల్లల విన్నపం


శేషవాహిణి

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లిన మహిళా ఉద్యోగి అదృశ్యమైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. అదృశ్యమైన తమ తల్లి ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తుండగా, పోలీసులు మాత్రం ఫిర్యాదు చేసిన వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్మన్‌ఘాట్ శ్రీనివాసనగర్ కాలనీలోని శ్రీ చైతన్య కళాశాలలో స్టోర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఎ.శేషవాహిని అలియాస్ భవాని(44) తన భర్త చనిపోవడంతో తన ఇద్దరు కుమారులు ప్రణీత్, ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి కర్మన్‌ఘాట్ భాగ్యనగర్ కాలనీలోని వెంకటసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, ప్రతి రోజులాగే ఈ నెల 23న ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం వరకు తల్లి ఇంటికి రాకపోవడం, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో పాఠశాలకు వచ్చి కుమారులు ఆరా తీశారు. ఆమె ఆస్పత్రికి వెళ్తున్నానంటూ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాఠశాల నుంచి వెళ్లి పోయారని సిబ్బంది తెలిపారు. దీంతో కుమారులు ఆమె కోసం ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె చిన్నకుమారుడు ప్రవీణ్ శనివారం రాత్రి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పట్టించుకోవడం లేదంటూ సోషల్ మీడియా ద్వారా..

శేషవాహిని శనివారం మధ్యాహ్నం నుంచి కనబడడం లేదంటూ సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆమె కుమారుడు ప్రణీత్, అతని స్నేహితుడు సందీప్ సోషల్ మీడియాలో ఓ వీడియో ద్వారా ఆరోపించారు. ఏసీపీకి ఫోన్ చేస్తే ఆదివారం కదా, హోలీ హాలిడేస్ కదా అంటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆమె కుమారుడే సీసీ కెమెరాలు పరిశీలించి, స్కూల్ వద్ద నుంచి ఒక ఆటోలో వెళ్లిపోయినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశామని, అయినా ఆచూకీ కనిపెట్టకలేకపోయారని సందీప్ ఆరోపించారు.

ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నాం: ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

శేషవాహిని తప్పిపోయినట్లు ఫిర్యాదు చేసిన వెంటనే శనివారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేశాం. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో కాల్ డేటాను పరిశీలించి, అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం. ఆమె ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు జరుపుతున్నాం. కేసు విచారణలో ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం లేదు.

అభిరుచి



ఇది ఒక 'చిత్ర'మైన కథ. భారతీయ సినిమా ప్రచారానికి జపాన్‌లో అనధికారిక రాయబారిగా వ్యవహరిస్తున్న ఓ మహిళ కథ. సంజీవ్‌కుమార్, ముంతాజ్‌ల 'ఖిలోనా'తో మొదలైన ఈ అనుబంధం... ఐదు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చి... మన చిత్రానికి తన దేశంలో పట్టం కడుతున్న జపాన్ సినీ ప్రేమికురాలు **టమకి మత్సువోక** కథ ఇది...

మనసంతా భారతీయ చిత్రమే

సగటు సినీ ప్రియులకు భిన్నం టమకి మత్సువోక. ఆమె దృష్టిలో సినిమా అంటే థియేటర్ బయటకు రాగానే మరిచిపోయే ఒక వినోద సాధనం మాత్రమే కాదు... ఎన్నో భావోద్వేగాలతో ముడిపడిన బంధం. మల్టీప్లెక్స్‌లు విస్తరించిన యుగంలోనూ సంప్రదాయ సింగిల్ స్క్రీన్ థియేటర్ల వైపు చూసే ఆమెకు... భారతీయ చిత్రాలు అంటే ఎనలేని మక్కువ... ప్రేమ. అంతేకాదు... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలన్నా టమకికి గౌరవం. ఆ ఇష్టంతోనే ఇప్పటికి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చి వెళ్లారు. ఒలింపస్ కెమెరా ఒకటి ఎప్పుడూ ఆమె చేతిలో ఉంటుంది. 'సినీ' విశేషాలన్నిటినీ ఆ లెన్స్‌లో బంధించడం ఆమెకు అలవాటు. ఇటీవల ముంబయికి వచ్చిన ఆమె... నగరమంతా తిరుగుతూ చాలా బిజీగా కనిపించారు. ప్రతి కార్యక్రమంలోనూ చక్కని చీర కట్టులో ఆకట్టుకున్నారు.

కథ మార్చిన కథలు...

ఇంతకీ మన చలన చిత్రాలంటే అంతటి ఇష్టం ఆమెకు ఎందుకు కలిగింది? దీని వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. అది తెలియాలంటే... ఒకసారి టమకి యుక్త వయసులోకి వెళ్లాలి. అది 1967. జపాన్ 'ఒసాకా యూనివర్సిటీ ఆఫ్ ఫారిన్ స్టడీస్' (ఓయూఎఫ్ఎస్)లో చదివే రోజులు. ఒక రోజు ప్రొఫెసర్ రెండు దిన పత్రికలు తీసుకువచ్చి విద్యార్థుల ముందు పెట్టారు. 'ఈ రెండిటిలో మీరు ఏ భాష చదవాలనుకొంటున్నారు' అని ప్రొఫెసర్ అడిగారు. వాటిల్లో ఒకటి హిందీ పత్రిక కాగా, రెండోది ఉర్దూ. 'చూడ్డానికి కాస్త సులువుగా అనిపించి హిందీని ఎంచుకున్నా. తరువాత ప్రేమ్‌చంద్ కథలు చదవమని మా ప్రొఫెసర్ చెప్పారు. ఆ కథలే నా కథను మార్చేశాయి. భారతీయ సంస్కృతిపై మక్కువ, ఆసక్తి కలిగించాయి' అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు టమకి.

మరో మలుపు...

అంతటితో అయిపోలేదు. ఎంఏ హిందీ లిటరేచర్ కోసం 1971లో 'టోక్యో యూనివర్సిటీ ఆఫ్ ఫారిన్ స్టడీస్' (టీయూఎఫ్ఎస్)లో చేరారు టమకి. అక్కడ ఆమెకు మరో కొత్త సమస్య వచ్చి పడింది. "నువ్వు హిందీ బాగా చదువుతున్నావు. రాస్తున్నావు. కానీ స్పష్టంగా మాట్లాడలేకపోతున్నావు. విన్నది సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నావు. భాషలో మెరుగవ్వాలంటే థియేటర్‌కు వెళ్లి హిందీ చిత్రాలు చూడు' అని ప్రొఫెసర్ సూచించారు. అప్పట్లో భారత ఎంబసీ జపాన్‌లోని భారతీయుల కోసం ఏడాదికి ఒకసారి హిందీ చిత్రాలు ప్రదర్శించేది. అలా 'ఖిలోనా' చూశాను. అందులో సంజీవ్‌కుమార్ నటన నన్ను విపరీతంగా ఆకట్టుకుంది. మొత్తంగా కథ, కథనం బాగా నచ్చాయి. అది మొదలు... భారతీయ చిత్రాలే కాదు, సంస్కృతి, సంప్రదాయాల గురించి కూడా తెలుసుకోవాలన్న ఆసక్తి అధికమైంది" అంటూ నాటి సంగతులు చెప్పుకొచ్చారు టమకి.

ఇక్కడి చిత్రం... అక్కడ ఉత్సవం...

ఎప్పుడు భారత్ వచ్చినా సింగిల్‌స్క్రీన్ థియేటర్‌లో సినిమా వీక్షించడానికే అధిక ప్రాధాన్యం ఇస్తారు టమకి. వాటిల్లో చూసిన అనుభూతి మల్టీప్లెక్స్‌ల్లో రాదంటారు. ఈ యాభై ఏళ్ల భారత ప్రయాణంలో రెండొందలకు పైగా సినీ పాటల పుస్తకాలు, స్క్రిప్ట్స్, పోస్టర్లు, ప్రమోషనల్ బుక్‌లెట్స్ ఎన్నో సేకరించి భద్రపరుచుకున్నారు. కొన్నిటిని 'ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్' (ఎఫ్‌హెచ్ఎఫ్)కు విరాళంగా ఇచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా కొన్నేళ్లుగా జపాన్‌లో భారతీయ చిత్రోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు టమకి. వాటిల్లో ఒక్క హిందీనే కాకుండా ఇతర భారతీయ భాషా చిత్రాలు కూడా ఉన్నాయి.

'గతంలో సత్యజిత్‌రే చిత్రాలను ఆదరించిన జపాన్‌వాసులు ప్రస్తుతం దక్షిణభారత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వాటిల్లో 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' ప్రముఖంగా ఉన్నాయి' అంటారామె. జపాన్ ప్రేక్షకులకు, భారతీయ ప్రేక్షకులకు ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏంటని అడిగితే... 'సినిమాను వీక్షించే విధానం' అంటారు టమకి. 'భారతీయ ప్రేక్షకులు సినిమాను ఆసాంతం ఆస్వాదిస్తారు. నవ్వుతారు. బాధపడతారు. ఈలలు వేస్తారు. చప్పట్లు కొడతారు. పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తారు. కానీ జపాన్‌లో ప్రేక్షకులు నిశ్శబ్దంగా చూసి బయటకు వస్తారు' అంటూ చెప్పుకొచ్చారు టమకి. ఆమెకు బాగా ఇష్టమైన డైలాగ్ 'అచ్చా తో హమ్ చల్‌తీ హై'. దీన్ని ఆమె 'గుడ్‌బై గ్రీటింగ్'గా ఉపయోగిస్తారు.

'షోలే'కు అభిమాని...



టమకి ఆసక్తి భారతీయత వైపు మళ్లిన సమయంలోనే... టీయూఎఫ్ఎస్‌లో కోర్సును అర్ధంతరంగా ఆపేశారు. అదే వర్సిటీకి అనుబంధంగా ఉన్న 'ఇనిస్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ లాంగ్వేజస్ అండ్ కల్చర్ ఆఫ్ ఆసియా అండ్ ఆఫ్రికా' (ఐఎస్‌సీఏఏ)లో చేరి, పరిశోధన మొదలుపెట్టారు. అందులో భాగంగానే 1975లో తొలిసారి ఆమె ముంబయికి వచ్చారు. లిబర్టీ థియేటర్‌లో రాజ్‌కపూర్, సులోచనా చటర్జీ నటించిన 'జాగ్తే రహో' చూశారు. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి ఆరు హిందీ చిత్రాలు వీక్షించారు. వాటిల్లో అమితాబ్ 'జంజీర్', 'షోలే' కూడా ఉన్నాయి. నాటి నుంచి టమకి యాభైసార్లకు పైగా భారత్‌కు వచ్చారు. '1980లో నా అభిమాన నటుడు అమితాబ్ బచ్చన్‌ను ఇంటర్వ్యూ చేసే అవకాశం లభించింది. మేమిద్దరం హిందీలోనే మాట్లాడుకున్నాం' అంటున్న టమకి ఆల్‌టైమ్ ఫేవరెట్ చిత్రం 'షోలే'.


కేన్సర్‌ను జయించిన విజేతలు

మార్చి 22న కెన్సింగ్టన్ ప్యాలెస్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్... కేట్ మిడిల్‌టన్ తనకు కేన్సర్ సోకినట్టు వీడియో పోస్ట్ చేయడంతో ప్రపంచమంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కేన్సర్ వ్యాధికి సెలబ్రిటీలు కూడా విఐనహాయింపు కాదని మరోసారి రుజువైంది. ఈ సందర్భంగా ఆ వ్యాధి మీద విజయం సాధించిన భారతీయ తారలను ఒకసారి గుర్తు చేసుకుందాం.

"గత రెండు నెలలుగా మా కుటుంబం మొత్తం గడ్డు రోజులను గడిపింది. అయితే అదృష్టవశాత్తూ, నా దగ్గరొక అద్భుతమైన వైద్య బృందం ఉంది. నా ఆరోగ్యం పట్ల కనబరిచిన శ్రద్ధకు వాళ్లకు నేనెంతో రుణపడి ఉంటాను. జనవరిలో లండన్‌లో నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో నాకున్న ఆరోగ్య సమస్యకూ కేన్సర్‌కూ సంబంధం లేదని వైద్యులు భావించారు. ఆ సర్జరీ విజయవంతమైంది. అయితే ఆపరేషన్ తర్వాత చేపట్టిన పరీక్షల్లో నాకు కేన్సర్ ఉందని తేలింది. దాంతో వైద్య బృందం నాకు ప్రివెంటివ్ కీమోథెరపీని సూచించింది. ప్రస్తుతం నేను చికిత్స ప్రథమ దశలో ఉన్నాను" అంటూ ఇన్‌స్టా వీడియోలో వివరించింది కేట్ మిడిల్‌టన్. 2024లోకి అడుగుపెట్టిన మూడు నెలల్లోపే రాయల్ ఫ్యామిలీకి చెందిన ముగ్గురు సభ్యులు కేన్సర్ బారిన పడ్డారు. ఇంగ్లండ్ రాజు మూడవ ఛార్లెస్‌కు కేన్సర్ సోకినట్టు బకింగ్‌హామ్ ప్యాలెస్ ఫిబ్రవరి ఐదున ప్రకటించింది. అంతకు ముందు డచెస్ ఆఫ్ యార్క్, శారా ఫెర్గుసన్‌కు చర్మ కేన్సర్ సోకింది. ఈ ఏడాదిలో ఆవిడకు సోకిన రెండవ కేన్సర్ ఇది.



సోనాలి బింద్రే



2018లో బాలీవుడ్ తార సోనాలి బింద్రేకు స్టేజ్4 మెటాస్టాటిక్ కేన్సర్ నిర్ధారణ అయింది. ఆవిడ బ్రతికే అవకాశాలు కేవలం 30 శాతమే ఉన్నాయని కూడా వైద్యులు తేల్చేశారు. అయినా ఆ తార ఏమాత్రం కుంగిపోకుండా, థెరపీ సాగినంత కాలం తన ఫొటోలను షేర్ చేస్తూ ఉల్లాసంగా కనిపించింది. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా మాట్లాడుతూ... "కేన్సర్ ప్రయాణం కష్టతరమైనదే! అయితే ఆశావహ దృక్పథంతో ఆ వ్యాధితో పోరాడి, విజయం సాధించాలి" అంటూ కేన్సర్ రోగులను ప్రేరేపించింది. కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న సోనాలి, చికిత్స కొనసాగినంత కాలం అంతులేని మనోధైర్యాన్ని ప్రదర్శించడం విశేషం.

మనీషా కొయిరాలా

"కేన్సర్ అనేది డెత్ సెంటెన్స్ కాదు". 2012లో నాల్గవ దశ ఒవేరియన్ కేన్సర్ నిర్ధారణ అయిన భారతీయ అగ్ర సినీ తార మనీషా కొయిరాలా మాటలివి. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే అమెరికాలోని న్యూయార్క్ హాస్పిటల్‌లో ఏడాది పాటు చికిత్స తీసుకుని పూర్తిగా కోలుకున్నప్పటికీ ఆరేళ్ల పాటు వెండి తెరకు దూరంగా ఉండిపోయింది మనీషా. ఆ తర్వాత "హీల్డ్: హౌ కేన్సర్ గేవ్ మి ఎ న్యూ లైఫ్" అనే ఆటోబయాగ్రఫీ పుస్తకాన్ని రాసి, దాన్లో తన కేన్సర్ ప్రయాణాన్ని వివరించిందామె. కేన్సర్ నుంచి పూర్తిగా బయటపడిన మనీషా, భారతదేశంలో స్థానికంగా తయారైన మొట్టమొదటి సర్వైకల్ వ్యాక్సీన్‌ను లాంచ్ చేసిన సందర్భంగా ప్రసంగిస్తూ 'ఇదెంత క్లిష్టమైన ప్రయాణమో నాకు తెలుసు. కానీ మీరు అంతకు మించిన క్లిష్టమైన వ్యక్తులు" అని చెప్పి, కేన్సర్ రోగుల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేసింది.

లీసా రే

బొంబే డైయింగ్ మోడల్ లీసా రేకు అరుదైన, ప్రాణాంతకమైన మల్టిపుల్ మైలోమా అనే రక్త కేన్సర్ సోకింది. నాలుగు నెలల పాటు కీమో థెరపీ తీసుకున్న తర్వాత, మూల కణ మార్పిడి కూడా చేయించుకుందామె. 'క్లోజ్ టు బోన్' అనే తన ఆటోగ్రఫీలో ఆ వ్యాధి మీద తాను సాగించిన విజయవంతమైన పోరాటం గురించి వివరించిందామె. ది ఎల్లో డైరీస్ అనే తన వ్యక్తిగత బ్లాగ్‌లో మల్టిపుల్ మైలోమా అనుభవాల్ని స్పష్టంగా వివరించిందామె. కేన్సర్ నుంచి తాను పూర్తిగా కోలుకోవడానికి పోషకాహారంతో పాటు, ఆయుర్వేదం, ధ్యానం, కౌన్సెలింగ్‌లు ఎలా తోడ్పడ్డాయో కూడా బ్లాగ్‌లో వివరించింది లీసా రే!

తాహిరా కాశ్యప్

ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి తాహిరా కాశ్యప్ రొమ్ము కేన్సర్‌తో పోరాడిందనే విషయం అందరికీ తెలిసిందే! ఆవిడెప్పుడూ తన వ్యాధి గురించి దాచలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు ప్రేరణ పొందేలా తన కేన్సర్ ప్రయాణాన్ని డాక్యుమెంట్ చేసింది. 2019 జనవరిలో కేన్సర్ చికిత్సను ముగించుకున్న తాహిరా ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందింది. కీమోథెరపీ చికిత్స ప్రభావంతో తల వెంట్రుకలు రాలిపోయినప్పటికీ, ఏమాత్రం వెరవకుండా ఫొటోలు షేర్ చేసిన తాహిరా, తనకు కేన్సర్ సోకినప్పటి నుంచి, ఎర్లీ డిటెక్షన్ గురించి మహిళల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

ఫ్యాషన్



వేలకు వేలు పోసి కొన్న ఖరీదైన చీరలు ఫ్యాషన్‌కు కాలం చెల్లి, బీరవాలకే పరిమితమైపోతూ ఉంటాయి. మహిళలందరూ ఎదుర్కొనే బాధే ఇది. అయితే వాటిని కట్టుకోలేకపోతున్నామని బాధ పడకుండా, ఇదిగో పాత చీరలతో కొత్త డ్రస్సులు కుట్టించుకోండి.

పాత చీరలతో కొత్త డ్రస్సులు



శారీ డ్రస్

అటు చీరనూ, ఇటు డ్రస్సునూ తలపించే శారీ డ్రస్ లేటెస్ట్ ఫ్యాషన్. చీర లుక్ చెదరకుండా ఆధునికత ఉట్టిపడేలా ఇలా శారీ డ్రస్ కుట్టించుకుంటే ఈవినింగ్ పార్టీల్లో రెట్టింపు మోడర్న్‌గా కనిపించవచ్చు. సింథటిక్, కాటన్ చీరలను ఈ శారీ డ్రస్‌గా ఎంచుకోవచ్చు.



శారీ గౌన్

నారాయణ్‌పేట్ శారీలతో లాంగ్ అండ్ షార్ట్ గౌన్స్ కుట్టించుకోవడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. జరీ అంచున్న చీరలను ఇందుకోసం ఎంచుకోవాలి. చేతులు, గౌను అంచులకు, ఛాతీ దగ్గర జరీ డిజైన్ వచ్చేలా కుట్టించుకోవాలి. సంప్రదాయ వేడుకల్లో ధరించడానికి ఈ కాటన్ శారీ గౌన్లు చాలా బాగుంటాయి.

వెల్వెట్ గౌన్

వెల్వెట్ మెటీరియల్ ఫ్యాన్సీ చీరలతో మోడర్న్ డ్రస్‌లు కుట్టించుకోవచ్చు. రబ్బర్ సిల్క్ మెటీరియల్ కూడా ఈ డ్రస్‌లకు చక్కగా నప్పుతుంది. కుచ్చులు, సెక్విన్లు, జరీలు జోడిస్తే వెల్వెట్ గౌన్లతో ఆధునికంగా కనిపించవచ్చు. సింపుల్ జ్యువెలరీ, హైహీల్స్ జోడించి మరింత రిచ్ లుక్ తెప్పించవచ్చు.





పిల్లల్లో ఆత్మవిశ్వాసం...

చిన్నపిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం.. వారిలోని అతి భయాలను పోగొట్టే పని చేయాల్సింది పేరెంట్స్. ముఖ్యంగా పిల్లల్లో ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టి.. ఆత్మవిశ్వాసం రెట్టింపు చేయాలంటే చిన్న టిప్స్ పాటించాల్సిందే.

- పిల్లలను నలుగురిలో అరవటం, కొట్టడం.. లాంటివి చేయటం వల్ల షేమ్‌గా ఫీలవుతారు. ఆ తర్వాత తోటి స్నేహితులతో మాట్లాడటానికి ఇష్టపడరు. అందుకే ఇలాంటివి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కోప్పడకుండా.. పర్సనల్‌గా ఇది మంచి, చెడు అని చెప్పాలి. అప్పుడే పిల్లలు అర్థం చేసుకోగలరు.



- మీ పిల్లల్లో బలాలు, బలహీనతలు మీకు మాత్రమే తెలుసు. ఇతరుల పిల్లలతో పోల్చటం, మార్కులు విషయంలో తిట్టడంతో పాటు వారిలా ఉండాలని చెప్పటం చేయకూడదు. ఇలా చేస్తే పిల్లల్లో వారిపట్ల తక్కువ భావం కలుగుతుంది. కోపం పెరుగుతుంది. తద్వారా ఇతర ఇబ్బందులు వస్తాయి. వారిలో కాన్ఫిడెన్స్ పోకుండా ఉండాలంటే.. చిన్న పనులైనా మెచ్చుకోవాలి. వారి బలహీనతలు మీద మాట్లాడకుండా.. వారి బలాలను, వారి ప్రతిభను మనసారా మెచ్చుకోండి. అప్పుడే పిల్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- కొన్ని వస్తువులు ఇవ్వకున్నా, ఇష్టమైన ఆహారం చేసిపెట్టకున్నా పిల్లలు అలుగుతారు. విషయం స్పష్టంగా నచ్చచెప్పాలి.
- పిల్లల మాటలను బాగా వినాలి. వారి మంచి పనులను ఎంకరేజ్ చేయాలి. అప్పుడే పిల్లలు మరింత ఆసక్తితో పని చేయగలరు. వారిలో ఆత్మవిశ్వాసం అధికమవుతుంది.

ఉదయం ఒక ఈవెంట్‌లో బంగారు పతకం... సాయంత్రం మరో ఈవెంట్‌లో స్వర్ణంతో పాటు జాతీయ రికార్డ్... లఖనవూలో ఇటీవల జరిగిన నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్ పోటీల్లో ఏక్తా ప్రదీప్ డే సాధించిన ఘనతలివి. అడుగడుగునా అవరోధాలు ఎదురైనా... దృఢసంకల్పంతో వాటిని ఎదుర్కొన్న ఏక్తా ఇప్పుడు అథ్లెటిక్స్‌లో భారత్‌కు సరికొత్త ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటోంది.



సవాళ్లకు ఎదురొడ్డి పతకాలు పట్టి

భోపాల్‌లోని మధ్యప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ అకాడమీ. కొన్ని నెలల క్రితం జరిగిన ట్రయల్స్‌లో పాల్గొనడానికి రాష్ట్రస్థాయి క్రీడాకారులు సిద్ధమయ్యారు. వారిలో ఒకరైన ఏక్తా ప్రదీప్ డే తన కాళ్లవైపు చూసుకుంది. ఆమె వేసుకున్న షూస్ చిరిగిపోయి, అడుగు భాగం ఊడి వచ్చేలా ఉన్నాయి. 'అలాంటి షూస్‌తో... తోటి అథ్లెట్లను అధిగమించి పరిగెత్తగలనా?' అనే సందేహం ఆమెకు లేదు. 'ఎంత వేగంగా లక్ష్యాన్ని చేరుకోగలను?' అనేదే ఆమె ఆలోచనంతా. ఎందుకంటే ఇంట్లో ఆర్థిక సమస్యలు మొదలు, వీధిలో అవహేళనల వరకూ ఎన్నో అనుభవాలను ఎదుర్కొంది. కానీ ఆమెలో ఆత్మవిశ్వాసం ఎప్పుడూ చెక్కుచెదరలేదు.

ప్రతి వస్తువూ తాకట్టు పెట్టి...

ఏక్తాది భోపాల్‌లో స్థిరపడిన బెంగాలీ కుటుంబం. రెండు గదుల ఇంట్లో... తల్లి, తండ్రి, తోబుట్టువులతో నివాసం. రెండు పూటలా తిండి కూడా గగనం. "అలాంటి పరిస్థితుల్లో అథ్లెట్ కావాలని నేను కన్న కలను నెరవేర్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను" అంటుంది ఏక్తా. వారు నివసించే పంచశీల్‌నగర్ ప్రాంతం దొంగ సారా, మాదక ద్రవ్యాలకు, అసాంఘిక శక్తులకు అడ్డాగా పేరుపొందింది. ఆమె ప్రాక్టీస్‌కు వెళ్తుంటే... పోకిరీలు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసేవారు.




"అన్నిటినీ సహనంతో దిగమింగుకొనేదాన్ని. పాఠశాల, జిల్లా స్థాయిలో సాధించిన విజయాలు ఎప్పటికప్పుడు నాకు ఉత్తేజం కలిగించేవి. పరిగెత్తడానికి సరైన షూస్ ఉండేవి కావు. సెకెండ్ హ్యాండ్ షూస్ కొనడం కూడా కష్టమయ్యేది. కానీ నా కుటుంబం నా మీద ఎంతో నమ్మకం ఉంచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యానని తెలిసినప్పుడు... మా నాన్న మా ఇంట్లో కాస్త విలువైన ప్రతి వస్తువూ తాకట్టు పెట్టి డబ్బు తెచ్చారు. అప్పుడు నాకు కన్నీళ్ళు ఆగలేదు" అంటుంది ఏక్తా.

ఇది ఎప్పటికీ ప్రత్యేకం...


కష్టాలు ఆమెను మరింత రాటుదేల్చాయి. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, ప్రతికూలతలు ఎదురైనప్పుడు పట్టుదలగా ఎదురు నిలవడం తన తత్వంగా మార్చుకుంది. కోచ్ శివకుమార్ ప్రసాద్ ఆమె నైపుణ్యానికి మెరుగులు దిద్దారు. పోటీలకు సిద్ధం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రోత్సాహంతో ట్రయల్స్‌లో సెలక్టయిన ఏక్తా... ఈ నెల 10న లక్నోలో జరిగిన నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొంది. "ఒకే రోజు రెండు పెద్ద ఈవెంట్లలో ఆమె రాణించగలదా? అని అనుకున్నాను. కానీ ఆమె అంకితభావం గొప్పది" అంటారు శివకుమార్. ఆ రోజు ఉదయం జరిగిన 5000 మీటర్ల ఈవెంట్‌లో ఏక్తా బంగారు పతకం గెలుచుకుంది. సాయంత్రం అండర్-20 గర్ల్స్ 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లోనూ గోల్డ్‌మెడల్ సాధించడమే కాదు... జాతీయ రికార్డ్ నెలకొల్పింది. పతకాలు గెలుస్తాననే ధీమా ఉంది. కానీ రెండు స్వర్ణాల్ని గెలవడం, ఒక జాతీయ రికార్డు సాధించడం... ఇవన్నీ ఒకే రోజు జరగడం నమ్మశక్యంగా అనిపించలేదు" అంటోంది ఏక్తా. "పోటీలు ముగిసి ఇంటికి వెళ్ళినప్పుడు స్థానికులు ఆహ్వానించిన తీరు నా కష్టాలన్నిటినీ మరపించింది. నన్ను ఆటపట్టించినవారు ఇప్పుడు ఎంతో మర్యాదగా చూస్తున్నారు. ఇక మా అమ్మా, నాన్న సంతోషాన్ని వర్ణించడానికి నా దగ్గర మాటలు లేవు" అని ఆమె చెబుతోంది. భారత అథ్లెటిక్స్ ఆశాకిరణంగా ప్రశంసలందుకుంటున్న ఏక్తా దుబాయ్‌లో జరగబోయే అండర్-20 ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, పెరూ రాజధాని లిమాలో జరగనున్న అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. "దేశం తరఫున ఆడి, పతకాలు సాధించాలనేది నా లక్ష్యం" అంటుంది ఏక్తా.

రాముడి కోసం రెడీ అవుతున్న రణ్‌బీర్



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్ర కోసం మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నారు. శ్రీరాముడు బాణం వేసి శత్రువుల్ని మట్టుపెట్టడంలో ఆరితేరిన వ్యక్తి కనుక రణ్‌బీర్ ఇప్పుడు విలువిద్య మీద దృష్టి పెట్టారు. విలువిద్యలో ఆయన శిక్షణ పొందుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే శారీరకంగా మరింత ధృడంగా కనిపించడం కోసం ఎక్కువ సమయం జిమ్‌లోనే గడుపుతున్నారు. 'రామాయణ్' షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారనే అధికారిక సమాచారాన్ని శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 17న దర్శకుడు నితిశ్ తివారి వెల్లడించనున్నారు. ఒక అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రాన్ని రూపొందించడం కోసం నితిశ్, ఆయన టీమ్ ఐదేళ్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తోంది. ఎటువంటి విమర్శలకు తావు లేకుండా స్క్రిప్ట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే విజువల్ ఎఫెక్ట్స్ అత్యద్భుతంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సీతగా సాయిపల్లవి, రావణునిగా యశ్ నటించే 'రామాయణ్' చిత్రం 2025 దీపావళికి విడుదల అవుతుంది.

150 థియేటర్లలో జరగండి పాట



రామ్‌చరణ్, తమిళ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసిన రోజు నుంచే భారీ అంచనాలు ఏర్పడి, రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆసక్తి చాలా మందిలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రామ్‌చరణ్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకనిర్మాతలు. బుధవారం రామ్‌చరణ్ పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా నుంచి 'జరగండి' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్లలో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శిస్తుండడం విశేషం. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజు అందించిన కథకు సాయిమాధవ్ బుర్రా మాటలు రాశారు. తిరుణ్ణావుక్కరసు ఛాయాగ్రాహకుడు.

యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునా హోగా' అనేది ఉపశీర్షిక. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్ లక్నోలో మొదలైంది. ఈ కీలక షెడ్యూల్‌లో పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ బ్లాక్స్ చిత్రానికే హైలెట్‌గా ఉండబోతున్నాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త రవితేజను ఇందులో చూపించబోతున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. ఈ చిత్రానికి నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాశ్ కొల్లా.



హాట్‌గా కనిపించడం కష్టమే!

'ప్రేమం'తో కుర్రకారు మతిపోగొట్టి.. గర్ల్ నెక్స్ట్ డోర్ పాత్రలతో మెప్పించారు క్యూట్ బ్యూటీ అనుపమా పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె 'టిల్లు స్క్వేర్' చిత్రంలో హాట్‌హాట్‌గా కనిపించడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆమె ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో లిల్లీ పాత్ర గురించి మాట్లాడారు. లిల్లీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఈ సినిమాలో నేను వేసుకున్న డ్రెస్సులు రియల్ లైఫ్‌లో అస్సలు వేసుకోలేను. స్ర్కీన్‌పైన హాట్‌గా కనిపించాలంటే ఎంత కష్టమో ఈ చిత్రంతోనే తెలిసొచ్చింది. ఇప్పటివరకూ పక్కింటి అమ్మాయి పాత్రలు చేసే నేను ఒక్కసారిగా ఇలా గ్లామరస్ రోల్ చేయడంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. నిజానికి ఇలా గ్లామరస్ రోల్స్ చేసే సమయంలో వేసుకునే డ్రెస్సులు అసౌకర్యంగానే ఉంటాయి. ఇప్పటివరకూ ఇలాంటి రోల్స్ చేసిన హీరోయిన్స్‌ను మెచ్చుకోవాల్సిందే. ఇందులో నా బాడీ లాంగ్వేజ్ మునుపటి చిత్రాలతో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. లిల్లీ పాత్రలో సరికొత్త అనుపమను చూస్తారు" అని చెప్పారు.

పిల్లల్ని ఎలా పెంచాలో చూపించాం

'అల్లంత దూరాన', 'కళా పోషకులు', 'జై సేన' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు యంగ్ హీరో విశ్వ కార్తికేయ. ప్రస్తుతం ఆయన నటించిన 'కలియుగం పట్టణంలో' చిత్రం ఈ నెల 29న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా విశ్వ కార్తికేయ, మంగళవారం మీడియాతో ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.



"ప్రతీ ఒక్కరిలో వివిధ రకాల షేడ్స్ ఉంటాయి. వాటిని చూపించేలా ఈ చిత్రం ఉంటుంది. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని అనుకుంటున్న సమయంలోనే నేను ఈ కథ విన్నాను. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ కథ చెప్పిన విధానానికి ఆశ్చర్యపోయాను. క్లైమాక్స్ వరకు ఏం జరుగుతుందో కనిపెట్టలేకపోయాను. అందుకే సెకండ్ థాట్ లేకుండా ఈ చిత్రంలో నటించడానికి ఒప్పేసుకున్నా. ఈ సినిమాలో ప్రతీ పాత్రను దర్శకుడు చక్కగా మలిచారు. అన్ని క్యారెక్టర్లకు టూ షేడ్స్ ఉంటాయి. ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్. ఇందులో ఉన్న మదర్ సెంటిమెంట్ ప్రేక్షకుల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమాలో సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, పిల్లల్ని తల్లిదండ్రులు సరిగ్గా పెంచకపోతే ఎలా ఉంటుందో చూపించాం. ఇందులో క్రైమ్ సీన్లను కూడా సరికొత్తగా ప్రజంట్ చేశాం. 'కలియుగం పట్టణంలో' టెక్నికల్‌గా ఎంతో బాగుంటుంది. కెమెరా వర్క్‌కు అందరూ ఆశ్చర్యపోతారు. పాటలు, రీ రికార్డింగ్ అద్భుతంగా వచ్చాయి. అజయ్ మాకు మంచి సంగీతాన్ని ఇచ్చారు. ప్రస్తుతం ఇండోనేషియన్ సినిమాలో నటిస్తున్నాను. మంత్ర, తంత్రాలు, చేతబడుల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది" అని చెప్పారు.

లవ్ గురు ప్రేమ పాట్లు



వైవిధ్యమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తున్న తమిళ నటుడు విజయ్ ఆంటోని తాజా చిత్రం 'లవ్ గురు'. తొలిసారిగా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఆయన చేసిన సినిమా ఇది. దీనికి నిర్మాత కూడా ఆయనే. మృణాలిని రవి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. రంజాన్ పండగ సందర్భంగా ఏప్రిల్ 11న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబూటర్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. పెళ్లి అంటే ఇష్టం లేకపోయినా తండ్రి మాట కాదనలేక పెళ్లికి అంగీకరిస్తుంది ప్రియ. కానీ కాబోయే భర్తకు కొన్ని కండిషన్స్ పెడుతుంది. ఆమె అంటే ఇష్టం ఉన్న లవ్ గురు ఆ షరతులకు అంగీకరిస్తాడు. కానీ పెళ్లయ్యాక కానీ వాటిలో ఉన్న ఇబ్బందులు అర్థం కావు. ఆ సమస్యల నుంచి హీరో ఎలా బయట పడ్డాడు, భార్య ప్రేమను ఎలా పొందగలిగాడు.. అనే అంశాల్ని ఈ ట్రైలర్‌లో వినోదాత్మకంగా చూపించారు. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే విధంగా సినిమాను తీర్చిదిదినట్లు దర్శకనిర్మాతలు చెప్పారు.

మళ్లీ రావాలనుకుంటున్నా

'పెళ్లాం ఊరెళితే', 'ఇంద్ర' వంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించిన ప్రశాంతి హారతి ఆ తర్వాత పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టడానికి సిద్ధమవుతున్న ప్రశాంతి హారతి మీడియాతో ముచ్చటించారు.



"నాకు చిన్నప్పటి నుంచి ఆర్ట్స్ అంటే ఇష్టం. కూచిపూడి నేర్చుకున్నాను. కొన్ని ఫొటోషూట్స్ చేశాను. అవి చూసి కొన్ని సినిమాల్లో అవకాశాలు ఇచ్చారు. అలా శ్రీనివాసరెడ్డి డైరెక్ట్ చేసిన 'ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్' సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టాను. ఆ తర్వాత మణిశర్మ నిర్మించిన 'రూపాయి' చిత్రంలోనూ నటించాను. 'ఇంద్ర', 'పెళ్లాం ఊరెళితే' చిత్రాలు నటిగా నాకు మంచి గుర్తింపు ఇచ్చాయి. పెళ్లయ్యాక మా వారితో యూఎస్ వెళ్లాను. అక్కడ ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను. మన నృత్యరూపకాలు రేపటి తరానికి కూడా అందాలనేది నా కోరిక. మా పాప తాన్యతో 'తెలుగింటి సంస్కృతి' మ్యూజిక్ వీడియో రూపొందించాం. తాన్యకు ఇప్పుడు 16 ఏళ్లు. తన ఏజ్ కు తగిన మంచి అవకాశం వస్తే తనను కూడా సినిమా ఇండస్ట్రీకి పంపేందుకు మా ఫ్యామిలీకి అభ్యంతరం లేదు. నేను యాక్టింగ్ కోర్సులు నేర్చుకోలేదు. అయితే క్లాసికల్ డ్యాన్సర్‌ను కాబట్టి నటిగా భావోద్వేగాలు పలికించడం తేలికయ్యేది. ఈ ఆత్మవిశ్వాసంతోనే సినిమాలు, సీరియల్స్ చేశాను. వెబ్ సిరీస్‌లు, ఓటీటీల వల్ల ఎంతో మంది నటీనటులకు చాలా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఈ అవకాశాలు చూసే మళ్లీ టాలీవుడ్‌కు రావాలనుకుంటున్నా" అని చెప్పారు.

యధార్థ సంఘటన ఆధారంగా



ఒక యథార్థ సంఘటన స్ఫూర్తితో రూపుదిద్దుకొన్న మలయాళ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' సంచలన విజయం సాధించింది. ప్రపంచ మార్కెట్‌లో రూ. 200 కోట్లు సంపాదించిన తొలి మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించింది. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ బాసి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా హక్కుల్ని కొన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. 2006లో కొడైకెనాల్‌లోని గుణ కేవ్‌లో చిక్కుకున్న తమ స్నేహితుడిని రక్షించిన ఎర్నాకులం మంజుమ్మెల్ యువకుల అనుభవాల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని అదే టైటిల్‌తో తెలుగులో అందిస్తున్నారు.

హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్‌లోని తెలుగు సంపన్నులు

గ్లోబల్ ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (బిలియన్ డాలర్లు)
381	మురళి దివి, కుటుంబం	దివీస్ ల్యాబొరేటరీస్	7
536	పీ పిచ్చి రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	6
561	పీవీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	6
942	జూపల్లి రామేశ్వర్ రావు కుటుంబం	మై హోమ్ ఇండస్ట్రీస్	4
1024	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి కుటుంబం	అరబిందో ఫార్మా	3
1024	బీ పార్థసారథి రెడ్డి కుటుంబం	హెటిరో ల్యాబ్స్	3
1855	కే సతీశ్ రెడ్డి కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	2
1855	జీ అమరేందర్ రెడ్డి కుటుంబం	జీవీఆర్	2
2038	వెంకటేశ్వర్లు జాస్తి కుటుంబం	సువెన్ ఫార్మా	2
2038	ఎం సత్యనారాయణ రెడ్డి కుటుంబం	ఎంఎస్ఎన్ ల్యాబ్స్	2
2418	జీవీ ప్రసాద్ కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	1
2750	జీఎస్ రాజు కుటుంబం	---------	1
2750	ఆళ్ల అయోధ్య రామి రెడ్డి	రాంకీ గ్రూప్	1
2895	సీ వెంకటేశ్వర రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	1
2895	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	1
3058	జగదీశ్ ప్రసాద్ ఆలూరు కుటుంబం	హెచ్‌బీఎల్ పవర్	1
3058	పీసీ నన్నపనేని	నాట్కో ఫార్మా	1

ఆసియా కుబేరుల అడ్డా ముంబై



రెండో స్థానానికి జారిన బీజింగ్ ● ప్రపంచ టాప్-10 బిలియనీర్లలోని ఏకైక భారతీయుడు ముకేశ్ అంబానీ

- భారత్‌లో 271 మంది బిలియనీర్లు
- హైదరాబాద్ నుంచి 17 మందికి చోటు
- మురళి దివికి అగ్రస్థానం
- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ విడుదల

ముంబై: ఆసియాలో అత్యధిక మంది కుబేరులు నివసిస్తున్న నగరాల్లో బీజింగ్‌ను వెనక్కి నెట్టి ముంబై అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారం విడుదలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ ప్రకారం.. ముంబైలో 92 మంది బిలియనీర్లుండగా, బీజింగ్‌లోని బిలియనీర్ల సంఖ్య 91గా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే, ముంబై బిలియనీర్ల లిస్ట్‌లోకి మరో 27 మంది చేరగా.. బీజింగ్ బిలియనీర్ల పెరుగుదల 6కే పరిమితమైంది. ముంబై బిలియనీర్ల మొత్తం సంపద గడిచిన ఏడాది కాలంలో 47 శాతం వృద్ధి చెందగా.. బీజింగ్ కుబేరుల మొత్తం సంపద 28 శాతం తగ్గింది. అంతేకాదు, ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లు నివసిస్తున్న నగరాల్లో న్యూయార్క్ (119 మంది), లండన్ (97 మంది) తర్వాత ముంబై 3వ స్థానంలో నిలిచింది. 57 మందితో ఢిల్లీ 9వ స్థానంలో ఉండగా 27 మంది బిలియనీర్లతో బెంగళూరు 23వ స్థానంలో ఉంది. కనీసం 100 కోట్ల డాలర్ల (మన కరెన్సీలో రూ.8,300 కోట్ల పైమాటే) వ్యక్తిగత సంపద కలిగిన వారిని బిలియనీర్‌గా పరిగణిస్తారు.

రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈసారి జాబితా ప్రపంచ బిలియనీర్ల జాబితాలో మొత్తం 3,279 మందికి చోటు దక్కింది. 167 మందికి కొత్తగా స్థానం లభించింది. ఈసారి భారత బిలియనీర్ల జాబితాలో మరో 84 మంది చేరారు. చైనా జాబితాలో కొత్తగా చేరిన వారి సంఖ్య 55కు పరిమితమైంది.
- భారత కుబేరుల్లో ముకేశ్ అంబానీ 11,500 కోట్ల డాలర్ల సంపదతో తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. గడిచిన ఏడాది కాలంలో అంబానీ ఆస్తి 40 శాతం (3,300 కోట్ల డాలర్లు) పెరిగింది. అంతేకాదు, ప్రపంచ టాప్-10 కుబేరుల్లోని ఏకైక భారతీయుడు కూడా ఆయనే.
- భారత సంపన్నుల్లో గౌతమ్ అదానీ 8,600 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో రెండో స్థానంలో నిలిచారు. హిండెన్‌బర్గ్ నివేదికతో భారీగా తరిగిపోయిన అదానీ ఆస్తి పుంజుకుని గడిచిన ఏడాది కాలంలో 62 శాతం పెరిగింది. ప్రపంచ సంపన్నుల్లో ఆయనకు 15వ స్థానం దక్కింది.
- హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ 3,700 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆయన 34వ స్థానంలో ఉన్నారు. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (2,500 కోట్ల డాలర్లు) 55వ స్థానంలో, సన్‌ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ (2,400 కోట్ల డాలర్లు) 61వ స్థానంలో, కుమార మంగళం బిర్లా(1,800 కోట్ల డాలర్లు) వందో స్థానంలో ఉన్నారు. అనగా.. ప్రపంచ టాప్-100 బిలియనీర్లలో భారత్ నుంచి కేవలం ఆరుగురు చోటు సంపాదించుకోగలిగారు.
- ఈసారి జాబితాలోని భారత బిలియనీర్ల మొత్తం సంపద లక్ష కోట్ల డాలర్లుగా (రూ.83 లక్షల కోట్లు) నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో భారత బిలియనీర్లలో కేవలం 24 మంది సంపద మాత్రమే తగ్గింది. కాగా, చైనా బిలియనీర్లలో 573 మంది సంపద క్షీణించింది.

ఎలాన్ మస్క్ ప్రపంచ నం.1

టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ (గతంలో ట్విటర్) సంస్థల అధిపతి ఎలాన్ మస్క్ 23,100 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ (18,500 కోట్ల డాలర్లు), ఫ్రెంచ్ లగ్జరీ బ్రాండ్ల గ్రూప్ ఎల్‌వీఎంహెచ్ అధిపతి బెర్నార్డ్ ఆర్నో (17,500 కోట్ల డాలర్లు) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు.

HURUN

మార్కెట్ లాభాలకు బ్రేక్

ముంబై: మూడు రోజుల స్టాక్ మార్కెట్ లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 361.64 పాయింట్ల నష్టంతో 72,470.30 వద్ద ముగియగా నిఫ్టీ 92.05 పాయింట్ల నష్టంతో 22,004.70 వద్ద క్లోజయింది. సెన్సెక్స్ హెవీవెయిట్స్ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. దీంతో సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 20 నష్టాలతో క్లోజయ్యాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, ఎఫ్‌పీఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

అదానీల చేతికి ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్

న్యూఢిల్లీ: దివాలా ప్రక్రియలో ఉన్న ల్యాంకో అమర్‌కంటక్ పవర్ ప్లాంట్ కథ కంచికి చేరింది. ఈ ప్లాంట్ కొనుగోలు కోసం అదానీ పవర్ వేసిన బిడ్‌కు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఈ నెల 5న ల్యాంకో అమర్‌కంటక్ పవర్ రుణదాతలూ ఇందుకు ఆమోదం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ల్యాంకో గ్రూపు ఈ 600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,710 ▼	61,150 ▼	80,500 ▲
ముంబై	66,720 ▲	61,110 ▲	74,052 ▼

అదానీ చేతికి గోపాల్‌పూర్ పోర్టు

95 శాతం వాటా రూ.1,349 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తాజాగా మరో నౌకాశ్రయాన్ని సొంతం చేసుకుంది. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఉన్న గోపాల్‌పూర్ పోర్ట్‌లో 95 శాతం ఈక్విటీ వాటాను రూ.1,349 కోట్లకు కొనుగోలు చేసినట్లు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ మంగళవారం ప్రకటించింది. షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ (ఓఎస్ఎల్) నుంచి ఈ వాటాను చేజిక్కించుకుంది. 2 కోట్ల టన్నుల వార్షిక సామర్థ్యంతో కూడిన డీప్ వాటర్ బెర్తింగ్ పోర్ట్ అయిన గోపాల్‌పూర్ పోర్ట్‌లో ఎస్‌పీ గ్రూప్‌నకు చెందిన ఎస్‌పీ పోర్ట్ మెయింటెనెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 56 శాతం వాటా, ఓఎస్ఎల్ 44 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ పోర్ట్‌లో ఎస్‌పీ గ్రూప్ నుంచి 56 శాతం వాటా, ఓఎస్ఎల్ నుంచి 39 శాతం వాటాను (మొత్తం 95 శాతం వాటా) కొనుగోలుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ పోర్ట్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ డీల్ తర్వాత 5 శాతం వాటాతో ఓఎస్ఎల్ తమ భాగస్వామిగా కొనసాగనుందని స్పష్టం చేసింది. ఈ డీల్‌లో భాగంగా పోర్ట్ ఎంటర్‌ప్రైస్ విలువను రూ.3,080 కోట్లుగా లెక్కగట్టినట్లు తెలిపింది. ఎంటర్‌ప్రైస్ విలువకు అదనంగా రూ.270 కోట్లను ఐదున్నరేళ్ల తర్వాత చెల్లించనున్నట్లు, దీంతో కలిపి పోర్ట్ మొత్తం ఎంటర్‌ప్రైస్ విలువ రూ.3,350 కోట్లకు చేరుకోనుందని అదానీ పోర్ట్స్ పేర్కొంది. తూర్పు తీరంలో అదానీ పోర్ట్స్ మరింత బలపడేందుకు ఈ డీల్ దోహదపడనుందని అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. ఆస్తుల నగదీకరణ ప్రణాళికలో భాగంగా ఒడిశాలోని గోపాల్‌పూర్ పోర్ట్‌ను అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు రూ.3,350 కోట్ల ఎంటర్‌ప్రైస్ విలువకు విక్రయిస్తున్నట్లు ఎస్‌పీ గ్రూప్ విడిగా ప్రకటించింది.

ప్రపంచంలో శక్తిమంతమైన బీమా బ్రాండ్ ఎల్ఐసీ

బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రిపోర్టు విడుదల



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన బీమా బ్రాండ్‌గా నిలిచింది. ఈ ఏడాదికిగాను విడుదల చేసిన 'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100' రిపోర్టులో ఈ విషయం వెల్లడించారు. 980 కోట్ల డాలర్ల బ్రాండ్ విలువతో పాటు బ్రాండ్ శక్తి సూచీలో 88.3 పాయింట్లు, ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌తో ఎల్ఐసీ అగ్రస్థానంలో నిలిచిందని నివేదిక పేర్కొంది. కాగా, తైవాన్‌కు చెందిన క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్, ఆస్ట్రేలియాకు చెందిన ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ వరుసగా ఈ జాబితాలో 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాండ్ విలువ 9 శాతం పెరిగి 490 కోట్ల డాలర్లకు చేరుకోగా.. ఎన్ఆర్ఎంఏ బ్రాండ్ వేల్యూ 82 శాతం వృద్ధితో 130 కోట్ల డాలర్లుగా నమోదైంది. కాగా, ప్రపంచంలోని అత్యంత విలువైన బీమా బ్రాండ్లలో చైనా ఆధిపత్యం కొనసాగింది. పింగ్ యాన్ (3,360 కోట్ల డాలర్లు) ప్రపంచంలో అత్యంత విలువైన ఇన్సూరెన్స్ బ్రాండ్‌గా నిలిచింది. చైనా లైఫ్ ఇన్సూరెన్స్, సీపీఐసీ 3, 5 స్థానాల్లో ఉన్నాయి. జర్మనీకి చెందిన అలియాన్జ్, ఫ్రాన్స్‌కు చెందిన ఆక్సా ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ విషయంలో 2, 4 స్థానాల్లో కొనసాగాయి.

"స్టోరబుల్" కొత్త కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్: సెల్ఫ్ స్టోరేజీ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికాకు చెందిన స్టోరబుల్ హైదరాబాద్‌లోని నాలెడ్జ్ సిటీలో కొత్త కార్యాలయం ప్రారంభించింది. ఆసియాలో తొలి జీసీసీని గత ఏప్రిల్‌లో ప్రారంభించిన స్టోరబుల్ ఆర్ అండ్ డీ కార్యకలాపాలు మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా ఉద్యోగుల సంఖ్యను 60 నుంచి 120కి పెంచుకోవాలని నిర్ణయించినట్టు కంపెనీ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
26వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	395	విశాఖపట్నం	415
27వ తేదీ		వరంగల్	397
చిత్తూరు	458		
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్			
హైదరాబాద్	118	గోదావరి	116
వరంగల్	118	విజయవాడ	116
కరీంనగర్	118	గుంటూరు	117
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	117
కర్నూలు	118	చిత్తూరు	130
విశాఖపట్నం	115		

ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు: ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: ఏప్రిల్ 1 నుంచి సరెండర్ చార్జీలతో సహా అనేక బీమా నిబంధనలు మారనున్నాయి. ఈ చార్జీల వివరాలను కంపెనీలు ముందుగానే పాలసీహోల్డర్లకు తెలపాలని స్పష్టం చేస్తూ ఐఆర్‌డీఏఐ ఆరు ఆదేశాలు జారీ చేసింది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బీమా కంపెనీలు సిద్ధమవడం, బీమా వ్యాపార సరళీకరణ, బీమా పాలసీలు తీసుకునే వారి సంఖ్య పెంచడం లక్ష్యంగా ఐఆర్‌డీఏఐ ఈ ఆరు నియంత్రణలు రూపొందించింది. దీంతో బీమా పాలసీల రూపకల్పన, ప్రీమియం నిర్ణయం, హామీతో కూడిన సరెండర్ వాల్యూ నిబంధనలు, ప్రత్యేక సరెండర్ వాల్యూ విధానం మరింత మెరుగుపడుతుందని భావిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం పాలసీ తీసుకున్న మూడేళ్లలోపు సరెండర్ చేస్తే బీమా కంపెనీలు అప్పటి వరకు వసూలు చేసిన ప్రీమియం, ఆ పాలసీపై అప్పటి వరకు సమకూరిన రాబడి లేదా అంతకంటే తక్కువ మొత్తాన్ని చెల్లించాలి. అదే మూడేళ్ల తర్వాత సరెండర్ చేస్తే కొద్దిగా ఎక్కువ మొత్తం చెల్లించాలి.

సన్‌రైజర్స్ బోణీ చేసేనా?



కమిన్స్



హార్దిక్

- నేడు ముంబైతో హైదరాబాద్ ఢీ
- రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్టార్‌స్పోర్ట్స్‌లో..

హైదరాబాద్: కోల్‌కతాతో తొలి మ్యాచ్‌లో త్రుటిలో గెలుపును చేజార్చుకొన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై బోణీ చేయాలన్న కసితో ఉంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో కమిన్స్ సేన తలపడనుంది. ముంబై కూడా గుజరాత్ చేతిలో అనూహ్యంగా పరాజయం పాలైంది. ఇరుజట్లూ విజయం కోసం పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశాలున్నాయి. సన్‌రైజర్స్ బ్యాటర్ క్లాసెన్ పవర్‌హిట్టింగ్‌తో కోల్‌కతా వెన్నులో వణుకు పుట్టించాడు. గెలుపు అసాధ్యం అని భావించిన తరుణంలో భారీ సిక్సర్లతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కానీ, అతడు అవుట్ కావడంతో హైదరాబాద్ గెలుపు గీత దాటలేక పోయింది. అయితే, అతడి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మయాంక్ ఫర్వాలేదనిపించినా..మిగతా బ్యాటర్లు పుంజుకోవాల్సి ఉంది. పేస్ విభాగంలో నటరాజన్ ఆరంభంలో వికెట్లు తీసినా.. కమిన్స్, భువనేశ్వర్ నుంచి అతడికి సహకారం అందలేదు. మరోవైపు ముంబై బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ, బ్రేవిస్ మంచి టచ్‌లో కనిపిస్తున్నారు. అయితే, ఓపెనర్ ఇషాన్ డకౌట్ కాగా.. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన హార్దిక్ బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు జరగడం విమర్శలకు దారి తీసింది. పేసర్ బుమ్రా తొలిమ్యాచ్‌లోనే సత్తాచాటడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే.

చెన్నై.. అదిరెన్!

వరుసగా రెండో గెలుపు ● గుజరాత్ చిత్తు ● శివమ్ దూబే హాఫ్ సెంచరీ



శివమ్ దూబే (23 బంతుల్లో 51)


రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 46)

చెన్నై: గతేడాది ఫైనలిస్టుల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. చెన్నై సూపర్ కింగ్స్ అన్ని విభాగాల్లో రాణిస్తూ కలిసికట్టుగా కదం తొక్కింది. బ్యాటింగ్‌లో శివమ్ దూబే (23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) మెరుపు ఆటతీరును ప్రదర్శించారు. అటు పేసర్లు పదునైన బంతులతో కట్టడి చేయగా, ఫీల్డింగ్‌లోనూ సూపర్ అనిపించుకుంది. దీంతో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 63 రన్స్‌తో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 46) ఆకట్టుకున్నాడు. రషీద్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (37), మిల్లర్ (21), సాహా (21) ఫర్వాలేదనిపించారు. తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దూబే నిలిచాడు.

పోరాటమే లేదు..: భారీ ఛేదనలో గుజరాత్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు గిల్ (8), సాహా వికెట్లను కోల్పోయింది. తన వరుస ఓవర్లలో పేసర్ చాహర్ వీరిని పెవిలియన్‌కు చేర్చాడు. విజయ్ శంకర్ (12).. ధోనీ సూపర్ క్యాచ్‌తో స్వల్ప స్కోరుకే వెనుదిరగ్గా, సాయి సుదర్శన్ కాసేపు క్రీజులో నిలదొక్కుకున్నాడు. కానీ అతడి ఆటలో ఛేదనకు తగ్గ వేగం లేకపోయింది. దీంతో ఏ దశలోనూ జట్టు ప్రమాదకరంగా కనిపించలేదు. అటు మూడు ఫోర్లతో మిల్లర్ కాస్త జోరు చూపినా రహానె అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. నాలుగో వికెట్‌కు సాయి, మిల్లర్ 41 పరుగులు జోడించారు. దీనికి తోడు వరుస ఓవర్లలో సాయి, అజ్మతుల్లా (11), రషీద్ ఖాన్ (1) వెనుదిరగడంతో టైటాన్స్ చేసేదేమీ లేకపోయింది.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు సమష్టి ఆటతీరును కనబరిచారు. ముందుగా ఓపెనర్లు రచిన్, రుతురాజ్ మెరుపు ఆరంభాన్ని అందివ్వగా.. ఆ తర్వాత శివమ్ దూబే శివాలెత్తాడు. ఓపెనర్ల ధాటికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సాధించింది. తొలి ఓవర్‌లోనే గైక్వాడ్ క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నా.. మరో ఎండ్‌లో రచిన్ బాదుడుకు ఓవర్‌కు పదకొండు పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో 6,4తో బ్యాట్‌కు పనిజెప్పిన తను ఎక్కడా ఆగలేదు. మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో 12, నాలుగో ఓవర్‌లో 6,4తో 16, ఐదో ఓవర్‌లో 4,6తో 17 ఇలా ఎదురుదాడే లక్ష్యంగా అలరించాడు. అటు రుతురాజ్ సైతం అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే రషీద్ ఓవర్‌లో రచిన్ ఓ ఫోర్ కొట్టాక స్టంపౌటయ్యాడు. కానీ అప్పటికే తొలి వికెట్‌కు 32 బంతుల్లోనే 62 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. పదో ఓవర్‌లో రుతురాజ్ 6,4 బాది స్కోరును వంద దాటించాడు. ఇక రహానె (12)ను సాయికిశోర్ అవుట్ చేశాక బరిలోకి దిగిన దూబే ఎదుర్కొన్న తొలి రెండు బంతులనే సిక్సర్లుగా మలిచి జోష్ తెచ్చాడు. పేసర్ మోహిత్ మాత్రం 12వ ఓవర్‌లో కట్టడి చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే రుతురాజ్ వికెట్ తీసిన పేసర్ జాన్సన్ 2 పరుగులే ఇచ్చాడు. ఈ దశలో దూబే రన్‌రేట్ పెంచే బాధ్యతను తీసుకుంటూ రషీద్ ఓవర్‌లో సిక్సర్, జాన్సన్ ఓవర్‌లో 4,6తో జట్టు స్కోరును ట్రాక్ మీదికి తెచ్చాడు. అతడి ధాటికి 16 ఓవర్లలో చెన్నై 165/3తో నిలిచింది. ఇక 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన దూబేను 19వ ఓవర్‌లో రషీద్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు మిచెల్ (24 నాటౌట్)తో జత పరిచిన 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన సమీర్ రిజ్వీ (14) అదే ఓవర్‌లో రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. ఆఖరి ఓవర్‌లో మోహిత్ 8 పరుగులే ఇచ్చి రిజ్వీ వికెట్ తీయగా.. జడేజా (7) రనౌటయ్యాడు.

1 ఐపీఎల్‌లో పరుగుల పరంగా గుజరాత్ టైటాన్స్‌కిదే అతి పెద్ద పరాజయం.

స్కోరుబోర్డు

చెన్నై: రుతురాజ్ (సి) సాహా (బి) జాన్సన్ 46, రచిన్ రవీంద్ర (స్టంప్డ్) సాహా (బి) రషీద్ 46, రహానె (స్టంప్డ్) సాహా (బి) కిశోర్ 12, శివమ్ దూబె (సి) శంకర్ (బి) రషీద్ 51, డారిల్ మిచెల్ (నాటౌట్) 24, రిజ్వీ (సి) విల్లర్ (బి) మోహిత్ 14, జడేజా (రనౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 206/6; వికెట్ల పతనం:** 1-62, 2-104, 3-127, 4-184, 5-199, 6-206; **బౌలింగ్:** ఒమర్జాయ్ 3-0-30-0, ఉమేశ్ 2-0-27-0, రషీద్ 4-0-49-2, సాయి కిశోర్ 3-0-28-1, జాన్సన్ 4-0-35-1, మోహిత్ శర్మ 4-0-36-1.

గుజరాత్: సాహా (సి) దేశ్‌పాండే (బి) చాహర్ 21, గిల్ (ఎల్బీ) చాహర్ 8, సాయి సుదర్శన్ (సి) రిజ్వీ (బి) పథిరన 37, విజయ్ శంకర్ (సి) ధోనీ (బి) మిచెల్ 12, మిల్లర్ (సి) రహానె (బి) దేశ్‌పాండే 21, ఒమర్జాయ్ (సి) రచిన్ (బి) దేశ్‌పాండే 11, తెవాటియా (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 6, రషీద్ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 1, ఉమేశ్ (నాటౌట్) 10, స్పెన్సర్ జాన్సన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 11, మొత్తం: 20 ఓవర్లలో 143/8; వికెట్ల పతనం:** 1-28, 2-34, 3-55, 4-96, 5-114, 6-118, 7-121, 8-129; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-28-2, ముస్తాఫిజుర్ 4-0-30-2, తుషార్ దేశ్‌పాండే 4-0-21-2, జడేజా 2-0-15-0, మిచెల్ 2-0-18-1, పథిరన 4-0-29-1.

ఎవరూ గుర్తుపట్టని చోట వీధుల్లో తిరుగుతూ!



రెండు నెలలు కుటుంబంతో గడిపా

బెంగళూరు: సుమారు రెండు నెలల పాటు ఆటకు దూరంగా.. కుటుంబంతో గడపడం సరి కొత్త అనుభూతి అని విరాట్ కోహ్లీ చెప్పాడు. విరాట్ భార్య అనుష్క కొద్ది రోజుల క్రితం ఓ బాబుకు జన్మనిచ్చింది. కూతురు వామికతో కలసి విరాట్ లండన్‌లోని ఓ రెస్టారెంట్‌లో కనిపించిన ఫొటోలు వైరలయ్యాయి. భార్యతో ఉండడం కోసం ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌కు కూడా దూరమైన కోహ్లీ.. సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్‌లో మళ్లీ కనిపించాడు. సోమవారం పంజాబ్‌పై మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ ఆ కొన్ని రోజులు తాను ఎక్కడ ఉన్నదీ చెప్పాడు. 'మేం భారత్‌లో లేం. మమ్మల్ని ఎవరూ గుర్తుపట్టని చోట రెండు నెలలపాటు సాధారణ జీవితం గడిపాం. నిజంగా అదో అనిర్వచనీయమైన అనుభూతి. రోడ్లపై తిరుగుతున్నా ఎవరూ గమనించకపోవడం కొత్తగా అనిపించింద'ని కోహ్లీ చెప్పాడు.

ఈసారి పెర్త్‌లో తొలి టెస్టు

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్

మెల్‌బోర్న్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ ఏడాది నవంబరు-జనవరిలజరిగే ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మంగళవారం విడుదల చేసింది. అయితే అడిలైడ్‌లో తొలి టెస్టు జరగడం ఆనవాయితీ కాగా.. ఈసారి మాత్రం పెర్త్‌లో సిరీస్‌ను ఆరంభించనున్నారు. నవంబరు 22 నుంచి 26 వరకు ఈ మ్యాచ్ జరుగుతుంది. డిసెంబరు 6-10న రెండో టెస్టు (డే/నైట్) అడిలైడ్‌లో, 14-18 మధ్య మూడో టెస్టు బ్రిస్బేన్‌లో, 26-30 మధ్య నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో, జనవరి 3-7 తేదీల్లో ఆఖరి టెస్టు సిడ్నీ వేదికగా జరుగుతాయి.

శ్రీజకు కెరీర్ బెస్ట్ ర్యాంక్



న్యూఢిల్లీ: గతవారం తన కెరీర్‌లో రెండో డబ్ల్యూటీటీ సింగిల్స్ టైటిల్ నెగ్గి రికార్డు సృష్టించిన తెలుగమ్మాయి ఆకుల శ్రీజ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది. మంగళవారం వెలువడిన తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీజ మహిళల సింగిల్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 40వ ర్యాంక్‌ను అందుకుంది. పురుషుల సింగిల్స్‌లో శరత్ కమల్ 35వ స్థానంలో ఉండగా, సాథియాన్ 43 స్థానాలు మెరుగై 60వ ర్యాంక్‌లో నిలిచాడు.

'అవును.. నేను నలుపే'!


శివరామకృష్ణన్

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో తనను కించపరిచే విధంగా వర్ణ వివక్ష కామెంట్లు చేసిన వారికి భారత మాజీ ఆటగాడు లక్ష్మణ్ శివరామకృష్ణన్ దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చాడు. చెన్నైలోని మహాలింగపురం అయ్యప్పన్ గుడిలో ఓ ఏనుగు ముందు నిలబడి దిగిన ఫొటోను శివరామకృష్ణన్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. దీన్ని చూసిన ఓ వ్యక్తి 'రాత్రిపూట మీ కంటే..ఆ ఏనుగే బాగా కనిపిస్తుందేమో' అంటూ ఎగతాళిగా కామెంట్లు పెట్టాడు. దీనికి 'అవును. నేను నల్లవాణ్ణే' అని శివరామకృష్ణన్ ఘాటుగా సమాధానమిచ్చాడు. దిగజారి ప్రవర్తించవద్దని హితవు పలికాడు.

భారత్‌కు షాక్

- 1-2తో అఫ్ఘాన్ చేతిలో ఓటమి
- ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్


ఛెత్రి

గువాహటి: ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత్‌కు షాక్ తగిలింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓటమిపాలైంది. కెరీర్‌లో 150వ మ్యాచ్ ఆడిన కెప్టెన్ సునీల్ ఛెత్రి.. 37వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలచడంతో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. కానీ, సెకండాఫ్‌లో రహ్మత్ (71వ నిమిషం) గోల్‌తో అఫ్ఘాన్ 1-1తో సమం చేసింది. 88వ నిమిషంలో కీపర్ గుర్‌ప్రీత్ సంధూ తప్పిదం కారణంగా అఫ్ఘాన్‌కు పెనాల్టీ లభించింది. దీన్ని షరీఫ్ గోల్‌లోకి పంపడంతో అఫ్ఘాన్ 2-1తో పైచేయి సాధించింది. కాగా, 150 మ్యాచ్‌ల్లో ఛెత్రి 94 గోల్స్ సాధించాడు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

న్యూఢిల్లీ: రోహన్ బోపన్న మియామి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న క్వార్టర్‌ఫైనల్ చేరాడు. డబుల్స్ రెండోరౌండ్లో టాప్‌సీడ్, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ జంట బోపన్న/ఎబ్డెన్ 7-5, 7-6(3)తో మోనెగాస్కో (ఫ్రాన్స్)/జెలెన్స్కీ (పోలెండ్) జోడీపై విజయం సాధించింది.

వచ్చే నెల కేసీఆర్ జిల్లాల పర్యటన

- రైతుల సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన
- నల్లగొండ జిల్లా ముషంపల్లి నుంచి షురూ
- లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై వ్యూహరచన
- ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై దృష్టి

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజాసమస్యలను ప్రచారాస్త్రాలుగా మల్చుకొని జనంలోకి వెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. ఓవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే.. మరోవైపు విద్యుత్ కొరత, నీటి ఎద్దడితో పంటలు ఎండిపోవడం వంటి ప్రధాన సమస్యలను ప్రచారంలో లేవనెత్తటంపై కసరత్తు జరుపుతోంది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించాలని నిర్ణయించారు. ఏప్రిల్ మొదటి వారంలో ఆయన పర్యటన మొదలుపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. రైతులు బోర్లు వేసి తీవ్రంగా నష్టపోయిన నల్లగొండ జిల్లా ముషంపల్లి గ్రామంతోపాటు ఆలేరు నియోజకవర్గం నుంచి కేసీఆర్ పర్యటన ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. నల్లగొండ, భువనగిరి జిల్లాల్లో జరిగిన పంట నష్టం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేలా.. ఆయాగ్రామాలను కలుపుకొని రూట్ మ్యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు రావాలని అక్కడి నేతలు కూడా కేసీఆర్‌ను కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తమ పరిధిలోని గ్రామాల్లో జరిగిన పంట నష్టం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుతం పంటల పరిస్థితిని పరిశీలించాలని కేసీఆర్ రెండురోజుల కిందట సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయానికి నివేదికల రూపంలో పంపాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ నేతలు గ్రామాల్లో పంటల పరిస్థితిని పరిశీలిస్తున్నారు.



కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య

వరంగల్ లోక్‌సభ స్థానానికి తనను ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించినందుకు కడియం కావ్య మంగళవారం కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటూ కావ్యను కేసీఆర్ ఆశీర్వదించారు.

కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదు

- నోటికొచ్చినట్టు మాట్లాడితే నాలుక చీరేస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓడించి బుద్ధి చెప్పినా కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ చిన్నాభిన్నమైనా సిగ్గు రావట్లేదన్నారు. చెల్లెలు కవిత జైలుకు పోయి కేసులు చుట్టుముడుతుంటే బుర్ర పని చేయక నిరాశా నిస్పృహతో సీఎం రేవంత్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కేటీఆర్ నోటి దురుసును తగ్గించుకోకుంటే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. "సీఎంను పట్టుకుని హౌలా అంటావా? నువ్వే పెద్ద హౌలా.. బట్టేబాజ్ గానివి. ఎన్నికల్లో ప్రజలు నిన్ను, నీ అయ్యను ఇంటికి పంపించారు. ప్రజల జేబులు కొట్టి కల్వకుంట్ల కుటుంబం దాచుకున్న వేల కోట్లను కక్కిస్తాం" అని ధ్వజమెత్తారు. దొంగలు కాబట్టే కేటీఆర్ చెల్లెలు కవిత తిహాడ్ జైల్లో ఉందని, కేటీఆర్ కూడా చంచల్‌గూడ జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

వ్యక్తిగత వ్యవహారాల్లో 'నిఘా' ఆందోళనకరం

- దీని వెనుకున్న వారిని శిక్షించాలి: కూనంనేని

హైదరాబాద్, యాదాద్రి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వెలుగుచూస్తున్న విషయాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నాయకులు, ప్రముఖుల వ్యక్తిగత వ్యవహారాల్లో నిఘా వ్యవస్థ తలదూర్చడం అత్యంత ఆందోళనకరమైన అంశమని ఆయన పేర్కొన్నారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో ఇళ్లను అద్దెకు తీసుకుని అక్కడ ఉండి ఆధునిక పరికరాలతో ఆయన ఇంట్లో ఏమి మాట్లాడుకుంటున్నారో రికార్డు చేసి విన్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారం పోలీసుల సొంత నిర్ణయం కాదని, దీని వెనుకాల ఉన్న వ్యక్తులు, కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతికి చట్టబద్ధత కల్పించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెగాసస్ ద్వారా ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టిందని, అదేమాదిరిగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ అవినీతిపై చర్చకు సిద్ధమా?:జూపల్లి

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్చకు సిద్ధమా అని మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ మంత్రి హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. తేదీ, వేదిక ఏదో ఆయనే చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నేతలకు రైతులు, వారి సమస్యల గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. "గత పదేళ్లలో రాష్ట్ర ఖజానాను ముట్టడించిన వారు ఇప్పుడు చేసేదేమీ లేక సచివాలయాన్ని ముట్టడిస్తామంటున్నారు. పదేళ్లలో ఎప్పుడైనా పంట నష్టానికి పరిహారం ఇచ్చారా? పంటల బీమాను అమలు చేశారా?" అని ప్రశ్నించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అకాల వర్షాలతో 20 లక్షల ఎకరాల మేరకు పంటకు నష్టం వాటిల్లిందని హరీశ్‌రావు ఏ లెక్కల ఆధారంగా చెబుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ప్రశ్నించారు.

అసెంబ్లీకి దోస్తీ.. పార్లమెంట్‌కు కుస్తీ?

- వామపక్షాలకు అందని స్నేహ 'హస్తం'
- ఈ నెల 30న తేల్చేస్తామంటున్న సీపీఐ
- 2 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన సీపీఎం

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో దోస్తీ కట్టిన కాంగ్రెస్.. వామపక్షాలు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి లోక్‌సభ స్థానాల విషయంలో కుస్తీ పడుతున్నాయి. ఇప్పటికే సీపీఎం తాము రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాం.. పొత్తు ఉంటుందో లేదో కాంగ్రెస్ తేల్చుకోవాలని ప్రకటించింది. సీపీఐ ఇప్పటికీ పొత్తు ధర్మాన్ని పాటిద్దామంటూ కాంగ్రెస్ చుట్టూ తిరుగుతోంది. తాము ఐదు స్థానాల్లో బలంగా ఉన్నామని, వాటిలో ఒకటి తమకు కేటాయించాలని ప్రతిపాదించింది. అయితే దీనిపై కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి హామీ రాలేదు. నల్గొండ, ఖమ్మం, భువనగిరి, పెద్దపల్లి, వరంగల్... ఈ స్థానాల్లో ఏదో ఒకటి తమకు కేటాయించాలని సీపీఐ కోరుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఐ నేతలు తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో కలిసి వెళ్లి.. కాంగ్రెస్ పెద్దలను కలిశారు. తమ ప్రతిపాదనలను వివరించారు. రాష్ట్ర స్థాయిలో మాట్లాడుకుని మీరే నిర్ణయం తీసుకోండని ఢిల్లీ పెద్దలు చెప్పడంతో.. సీట్ల పంచాయతీ మళ్లీ రాష్ట్ర నాయకత్వం వద్దకే వచ్చింది. తమ ప్రతిపాదనకు కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన లేకపోవడంతో సీపీఐ నాయకులు 30న లోక్‌సభ సీట్ల సర్దుబాటు, పొత్తులపై కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా కూడా హాజరవుతున్నారు. ఆ రోజు కాంగ్రెస్‌తో కలిసి వెళ్లడమా లేక సొంతంగా పోటీకి దిగడమా అనే దానిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సీపీఐ నాయకులు చెబుతున్నారు. పొత్తు ధర్మాన్ని పక్కన పెట్టి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న 17 స్థానాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే పోటీకి దిగితే.. సీపీఐ, సీపీఎం రెండూ తమ అభ్యర్థులను బరిలో దింపేలా సన్నాహాలు చేస్తున్నాయి.

ఢిల్లీకి రేవంత్ 2,500 కోట్లు కప్పం

బిల్డర్లు, రియల్టర్లను బెదిరించి వసూలు చేసి పంపారు.. ఇసుక దందా, మిల్లర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు

- పథకాలు ఇవ్వలేకనే ట్యాపింగ్ కథనాలు
- జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్న సీఎం
- రేవంత్ బెదిరింపులకు భయపడేదిలేదు
- మా వెంట్రుక కూడా పీకలేరు
- ఎన్నికలయ్యాక బీజేపీలో చేరే తొలి వ్యక్తి ఆయనే
- కిషన్‌రెడ్డికి దమ్ముంటే లిక్కర్ స్కాంపై కోర్టుకు చెప్పాలి: కేటీఆర్



బీఆర్ఎస్ భవన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): "మున్సిపల్ శాఖను తన వద్దనే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలలుగా డబ్బులిస్తేనే బిల్డింగులకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. అలా వసూలు చేసిన రూ.2,500 కోట్లను ఢిల్లీకి పంపారు. ఓవైపు ఇసుక దందా, రైస్ మిల్లర్లను, మరోవైపు బిల్డర్లు, రియల్టర్లను బెదిరిస్తూ డబ్బు వసూలు చేస్తున్నారు. కత్తెర పెట్టుకుని జేబు దొంగలా తిరుగుతున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేగులు తెంపి మెడలో వేసుకుంటా అని అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్‌కు సీఎంగా పనిచేసే తెలివి లేదన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని శ్రేణులకు ఎన్నికల సంసిద్ధతపై సూచనలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు, ఎమ్మెల్యేలు తలసాని, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ గృహ జ్యోతి, రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2,500, రూ.4 వేలు పింఛను ఇవ్వలేక చేతులెత్తేశారని, ఇవేవీ బయటకు రాకుండా, ఫోన్ ట్యాపింగ్, స్కామ్‌ల పేరు చెప్పి, ఆ వార్తలే మీడియాలో రాయించుకుంటున్నారని విమర్శించారు. "రేవంత్.. నీ చేతిలో అధికారం ఉంది. ఏం చేస్తావో చెయ్. ఎవరు తప్పు చేసినా చర్యలు తీసుకో. నీ బెదిరింపులకు భయపడేవారెవరూ లేరు. మా వెంట్రుక కూడా పీకలేవ్" అని వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరే తొలి వ్యక్తి రేవంతేనని జోస్యం చెప్పారు. ఎన్నో మాటలు మాట్లాడే ఆయన.. ఈ ఆరోపణపై ఎందుకు స్పందించడం లేదన్నారు. జీవితమంతా కాంగ్రెస్‌లో ఉంటానని రేవంత్ ఏనాడూ చెప్పలేదని, బీజేపీలో చేరడం నిజం కాబట్టే నోరు మెదపడం లేదని పేర్కొన్నారు. బీజేపీ తమపై పగబట్టి వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాముడిని అడ్డుపెట్టుకుని ఆడుతున్న నాటకాన్ని ప్రజలు గమనించాలని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి దమ్ముంటే లిక్కర్ స్కాంలో ఏముందో కోర్టుకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బీజేపీ అధికారంలో ఉన్నట్లుంది..

రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి విచిత్రంగా ఉందని.. ఇక్కడ బీజేపీనే అధికారంలో ఉన్నట్లుగా కనిపిస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గుజరాత్ మోడల్ దుర్మార్గమని రాహుల్ చెబుతుంటే.. బడే భాయ్ మోడల్ బాగుందంటూ రేవంత్ బీజేపీ పాట పాడుతున్నారని ఆరోపించారు. అదానీ మంచోడు కాదని రాహుల్ విమర్శిస్తుంటే.. రేవంత్ మాత్రం మద్దతుగా మాట్లాడుతున్నారని అన్నారు. జాతీయ స్థాయిలో బీజేపీని ఆపే దమ్ము కాంగ్రెస్‌కు లేదని, ఆ పార్టీకి 40 ఎంపీ సీట్లు కూడా దాటవని కేటీఆర్ జోస్యం చెప్పారు. ఖైరతాబాద్ ప్రజలకు దానం నాగేందర్ ద్రోహం చేశారని, కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్లే నిజమైన నాయకులని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి దానంను అనర్హుడిగా ప్రకటించేలా చూస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని గెలిపిస్తే బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వస్తుందని కేటీఆర్ అన్నారు. గోవా క్యాంప్‌లో ఉన్న ప్రజాప్రతినిధులతో ఆయన మాట్లాడారు.

సికింద్రాబాద్‌కు కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదు

కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదని.. కుర్‌కురే ప్యాకెట్లు పంచడం, సీతాఫల్‌మండీలో రైల్వే లిఫ్ట్, సింటెక్స్ ట్యాంకులను ఓపెన్ చేయడమే ఆయన చేసిన మూడు గొప్ప పనులని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అంబర్‌పేట్‌లో కేంద్ర ప్రభుత్వం నిధులతో ఫ్లై ఓవర్ కట్టించమంటే నాన్చుతూనే ఉన్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు ఒక్క కారణం కూడా లేదన్నారు. విఫల ఎంపీ కిషన్‌రెడ్డికి, అవకాశవాద ఎమ్మెల్యే దానంతో పోటీలో నిబద్ధత కలిగిన పద్మారావే గెలుస్తారని పేర్కొన్నారు.

కుర్చీ ఖాళీ చెయ్..!! నువ్వెవడివిరా..?

- మాగంటి, రావుల శ్రీధర్‌రెడ్డి మాటల యుద్ధం
- వేదికపై బీఆర్ఎస్ నేతల పరస్పర దూషణలు
- ఇరువురిని శాంతింపజేసిన తలసాని

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం రసాభాసగా జరిగింది. పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సభా వేదికపైనే పరస్పరం దూషించుకున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభకు బీఆర్ఎస్ అభ్యర్థిగా పద్మారావుగౌడ్‌ను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా మాగంటి గోపినాథ్ పార్టీ కార్యాలయంలో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. కేటీఆర్ సభకు వచ్చే కొద్దిసేపటి ముందు నేతల మధ్య వివాదం జరిగింది. కేటీఆర్ వస్తున్నాడు.. కుర్చీ ఖాళీ చెయ్.. అంటూ వేదికపై కూర్చొన్న శ్రీధర్‌రెడ్డిని గోపినాథ్ సూచించారు. శ్రీధర్ రెడ్డి వెంటనే కుర్చీ నుంచి లేవకపోవడంతో వాగ్వాదం మొదలైంది. శ్రీధర్‌రెడ్డిని ప్రచురించలేని భాషలో గోపినాథ్ దూషించారు. దీంతో నువ్వు పార్టీ అధ్యక్షుడివా? ఏం మాట్లాడుతున్నావ్. ఇదే పద్ధతి? అంటూ శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. నిన్ను ఎవడు పిలిచాడు? నువ్వెందుకు వచ్చావు? అని మాగంటి ఎదురు ప్రశ్నించగా.. నువ్వెవడివిరా? అంటూ శ్రీధర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. దీంతో కార్యకర్తలు ఒక్కసారిగా కేకలు వేశారు. ఆపై, అనవసరంగా ఎక్కువ చెయ్యకు.. తన్నులు తింటావ్ అని గోపినాథ్ హెచ్చరించారు. వెంటనే జోక్యం చేసుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇరువురు నేతలకు సర్దిచెప్పారు. కాగా, గోపినాథ్, శ్రీధర్ రెడ్డి మధ్య చాలాకాలంగా విభేదాలు ఉన్నాయి. గతేడాది బోనాల సమయంలో ఫ్లెక్సీల అంశంలో ఘర్షణ జరగ్గా ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నాయి. సమావేశంలో కేటీఆర్ ప్రసంగిస్తుండగా నాంపల్లి నియోజకవర్గ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్ కేసులు పెట్టి తమను వేధిస్తున్నాడంటూ ప్లకార్డులు, ఎఫ్ఐఆర్ కాపీలను ప్రదర్శించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. సమస్యను

పంట నష్టపరిహారానికి రూ.40 కోట్లు!

- అకాల వర్షాలకు 40 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టుగా లెక్క
- ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే పరిహారం పంపిణీ

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల విస్తీర్ణం విషయంలో స్పష్టత వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టిన వ్యవసాయ శాఖ అధికారులు కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో 40,084 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. ఈ విస్తీర్ణం పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు చొప్పున పరిహారంగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ లెక్కన నష్ట పరిహారం చెల్లించాలంటే రూ.40 కోట్లు వరకు అవసరం. ఇప్పుడు నిధులు సమకూర్చినా ఎన్నికల కోడ్ ఉండడంతో పరిహారం చెల్లించే అవకాశం లేదు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత జూన్‌లోనే రైతులకు నష్టపరిహారం అందనుంది. ఇందుకోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతుల సమగ్ర వివరాలు సేకరించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. రైతుల వారీగా క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతున్నదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తెలిపారు.

జిల్లాలవారీగా పంట నష్టం వివరాలు (ఎకరాలలో)

కరీంనగర్- 22,815; నిజామాబాద్- 6,060;
సిద్దిపేట- 2,802; మెదక్- 2,766; నిర్మల్- 1,913;
రాజన్న సిరిసిల్ల- 913; ఆదిలాబాద్- 1,167;
సంగారెడ్డి- 714; కరీంనగర్- 490;
మంచిర్యాల- 444; మొత్తం- 40,084



మంగళవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

ఆ భూములు రాష్ట్రానికే చెందేలా

హౌసింగ్, దిల్ భూములపై ప్రభుత్వం ప్రణాళిక

- అందుబాటులో 1491 ఎకరాల భూమి!
- విభజన సమయంలో షెడ్యూల్ 9లోకి
- ఈ భూములు ఏ రూపంలో ప్రభుత్వ పరిధిలోకొచ్చాయి?
- నిజాంకు ముందు నాటివా? వారి వారసత్వంగా వచ్చాయా?
- సేకరణలో కొంత నిజాం కాలంలోనే.. ఇంకొంత ఉమ్మడి రాష్ట్రంలో?
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ.. వివాదం తేల్చేయాలనే యోచన



హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ (దిల్) భూములపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ భూముల పరంగా ఏపీతో తలెత్తిన వివాదం నేపథ్యంలో భూములను రాష్ట్రానికే చెందేలా చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించే పనిలో పడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ భూములు షెడ్యూల్ 9లోకి వెళ్లాయి. అప్పటి నుంచి ఆ భూముల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎంత మేర వాటా వస్తుందన్న విషయమ్మీద సందిగ్ధత నెలకొంది. తెలంగాణ పరిధిలో ఉన్న భూముల్లో తమకూ వాటా వస్తుందని ఏపీ వాదిస్తోంది. ఈ క్రమంలో అసలు హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ఉన్న భూముల చరిత్ర ఏమిటి? అసలు ఈ భూములు ప్రభుత్వ పరిధిలోకి ఎలా వచ్చాయి? అనే వివరాలను తేల్చి... ఆ ప్రకారం కేంద్రానికి సమగ్ర వివరాలతో నివేదిక ఇస్తే భూములను రాష్ట్ర ఖాతాలోకి వేసుకోవచ్చునని సంబంధిత శాఖలో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ భూములు.. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందే నిజాం ఆధీనంలో ఉన్నాయా? లేదంటే నిజాం ప్రభువుల వారసత్వంగా ప్రభుత్వానికి అందాయా? అనే వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆ భూముల చరిత్ర గుర్తిస్తే, ఏపీకి వాటా ఉంటుందా? లేదా? అన్నదీ తేల్చడం తేలికవుతుందని అధికారులు భావిస్తున్నారు. వాస్తవానికి ఉమ్మడి ఏపీలో హౌసింగ్ బోర్డు కింద 5వేల ఎకరాలు, దిల్ కింద 1,800 ఎకరాలను అప్పటి ప్రభుత్వం సేకరించింది. వీటిలో ప్రస్తుతం హౌసింగ్ బోర్డు పరిధిలో 691 ఎకరాలు, దిల్ కింద 800ఎకరాలు ఉన్నాయి.

మనభూములని తేలితే ఏపీకివాటా లేనట్టే

హైదరాబాద్ స్టేట్, ఆంధ్ర రాష్ట్రం కలిపి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. అయితే ఏపీగా ఏర్పాటయ్యేనాటికే హైదరాబాద్ స్టేట్‌లో నిజాం రాజులు చాలా ప్రాంతాల్లో పలు నిర్మాణాలు చేపట్టారు. ఆయా అభివృద్ధి పనుల కోసం నిజాం ప్రభువులు భూములను సేకరించడంతో పాటు, వారి వారసత్వ భూములను కూడా ఇచ్చారనే ప్రచారం ఉంది. అయితే ప్రస్తుతం హౌసింగ్, దిల్ పరిధిలో ఉన్న భూములు కూడా నిజాం రాజులు ఇచ్చినవేనా? లేదంటే వారి వారసత్వ భూములను ప్రభుత్వానికి అందించారా? అన్నది తేలాల్సి ఉంది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యేనాటికే అవి అప్పటి హైదరాబాద్ స్టేట్ పరిధిలో ఉంటే గనుక ఆ భూముల్లో ఏపీకి వాటా ఉండదని నిపుణులు భావిస్తున్నారు. భూములను పొందేందుకు సాంకేతికంగానూ ఇది కలిసివస్తుందని విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు, దిల్ కింద ఉన్న భూముల్లో కొన్నింటినే అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా భూ సేకరణ విధానంలో భాగంగా సేకరించిందని, మరికొన్ని భూములు మాత్రం గతం నుంచే ప్రభుత్వ ఆస్తుల్లో భాగంగానే వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో హౌసింగ్ బోర్డు, దిల్ భూములను క్షుణ్ణంగా పరిశీలించి వాటి వివరాలను తేల్చనున్నట్లు సమాచారం.

సీఐబీ, టీఐటీ నుంచి హౌసింగ్ బోర్డుగా


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యాక కొంతకాలానికి ఏపీ హౌసింగ్ బోర్డును అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అంతకుముందు నిజాం పాలనలో హైదరాబాద్, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సీఐబీ), టౌన్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ (టీఐటీ) అనే రెండు సంస్థలను ఏర్పాటు చేశారు. ఈ రెండింటినీ కలిపి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఏపీ హౌసింగ్ బోర్డుగా మార్చింది. ప్రస్తుతం నాంపల్లి ప్రాంతం, దాని పరిధిలో ఉన్న గాంధీభవన్, గృహకల్ప కార్యాలయం, మోజంజాహీ మార్కెట్ ఏరియాలో భూములను నిజాం హయాంలోనే సేకరించారు. ఒక సచివాలయాన్ని నిర్మించాలనే యోచనతోనే వీటిని సేకరించినట్లు తెలుస్తోంది. కానీ ఆ తర్వాత వివిధ కారణాలతో సచివాలయాన్ని విఎంట్ కాంపౌండ్ వద్ద నిర్మించారు. ఒక్క నాంపల్లి ప్రాంతంలోనే కాకుండా నగరంలోని పలు చోట్ల కూడా వివిధ అవసరాల కోసం అప్పటి నిజాం ప్రభుత్వం భూసేకరణ చేసింది.

శరణ్ ఎవరో తెలియదు

నాపై చేసిన ఫిర్యాదులు, ఆరోపణలు అవాస్తవం.. ఎన్ఆర్ఐ విజయ్‌ను 5 కోట్లకు మోసగించాడు

- నాపై చేసిన ఫిర్యాదులు, ఆరోపణలు అవాస్తవం
- ఎన్ఆర్ఐ విజయ్‌ను 5 కోట్లకు మోసగించాడు
- అతడిపై ఎన్నో చీటింగ్ కేసులు.. పాస్‌పోర్టు సీజ్
- ఫోన్ ట్యాపింగ్‌తోనూ నాకు ఏ సంబంధం లేదు
- పార్టీ మారాలంటూ కొందరి ద్వారా నాపై ఒత్తిడి
- ఎవరేం చేసినా బీఆర్ఎస్‌ను వీడను: ఎర్రబెల్లి
- ఎకరం లేకున్నా.. 300 ఎకరాలున్నట్లు చెప్పాడు
- ప్రవాసులను మోసగించడమే శరణ్ పని
- అతడే మాకు రూ.2.50 కోట్లు ఇవ్వాలి: విజయ్

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): "శరణ్‌చౌదరి ఎవరో నాకు తెలియదు. ఆయనను అసలు చూడనే లేదు. తన ఇంటిని లాక్కున్నానని.. నా బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నానంటూ శరణ్ నాపై చేసిన ఫిర్యాదు, ఆరోపణల్లో వాస్తవం లేదు" అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. భూమికి సంబంధించి విజయవాడకు చెందిన విజయ్ అనే ఎన్ఆర్ఐ నుంచి శరణ్ రూ.5 కోట్లు తీసుకుని మోసం చేశాడని, ఆ విషయాన్ని కొందరు ఎన్ఆర్ఐలు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. దీనిపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించానని, అంతే తప్ప విజయ్‌తో తనకు ఎటువంటి బంధుత్వం, పూర్వ పరిచయం లేదని స్పష్టం చేశారు. కానీ, తానే మోసం చేశానని, పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడ్డానని శరణ్ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడారు. నకిలీ పత్రాలతో ఎన్ఆర్ఐల నుంచి డబ్బు తీసుకుని మోసం చేసిన శరణ్‌పై అనేక కేసులు ఉన్నాయని, అతడితో పాటు అతడి భార్య పాస్‌పోర్ట్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారని పేర్కొన్నారు. భూ దందాలు, కబ్జాలు చేస్తుండడంతో శరణ్‌ను బీజేపీ నుంచి తొలగించినట్లు తెలిసిందన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని.. ఇబ్బంది పెట్టాలనే తనపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని ఆరోపించారు. తనను ఇరికించాలని ఎన్నో ప్రభుత్వాలు ప్రయత్నించినా సాధ్యం కాలేదని పేర్కొన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసుతోనూ ఎలాంటి సంబంధం లేదని, ఆ కేసులో నిందితుడిగా ఉన్న దుగ్యాల ప్రణీత్‌రావు తనకు తెలియదని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ప్రణీత్ బంధువులు తమ ఊరిలో ఉన్నారని, వారికి ఏ పార్టీతో సంబంధం ఉందో విచారణ చేస్తే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ మారాలంటూ కొందరి ద్వారా తనపై ఒత్తిడి తెస్తున్నారని, ఎవరేం చేసినా తాను బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

శరణ్ ఒక చీటర్: ఎన్ఆర్ఐ విజయ్

వడ్డేపల్లి శరణ్ చౌదరి తనలాంటి ఎందరో ఎన్ఆర్ఐలను మోసగించాడని విజయ్ ఆరోపించారు. "రియల్ ఎస్టేట్ చేస్తున్నాను. నా కంపెనీలో పెట్టుబడి పెట్టండి. రూ.20 కోట్లు పెడితే అధిక లాభాలు వస్తాయి అని చెప్పాడు. దొంగ డాక్యుమెంట్లతో మోసం చేశాడు. అతడి పేరున ఎకరం కూడా లేనప్పటికీ.. 300 ఎకరాలు ఉన్నట్లు డాక్యుమెంట్లు చూపి రూ.5 కోట్లు అడ్వాన్సు తీసుకున్నాడు" అని తెలిపారు. న్యూజెర్సీ నుంచి ఈ మేరకు విజయ్ పంపిన వీడియోను ఎర్రబెల్లి మీడియాకు చూపించారు. భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని.. 6 నెలలైనా స్పందించలేదని, ఏం చేయాలో తెలియక.. తన మిత్రుడి ద్వారా ఎర్రబెల్లిని కలిసి సాయం కోరామన్నారు. కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలవాలని సూచించడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. అంతే తప్ప ఎర్రబెల్లితో తమకు బంధుత్వం, పరిచయం, రాజకీయ, వ్యాపార, ఇతర లావాదేవీలు ఏమీ లేవని స్పష్టం చేశారు. పోలీసుల ద్వారా వెళ్లినా శరణ్ తమకు రూ.5 కోట్లు ఇవ్వలేదని తెలిపారు. తన పేరిట ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నాడని, దానిపై కూడా రూ.1.20 కోట్లు రుణం ఉంటే తామే తీర్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని చెప్పారు. మొత్తం రూ.2.50 కోట్లు మాత్రమే సర్దుబాటు అయినట్లు తెలిపారు. మిగిలిన డబ్బులు సెప్టెంబరు 20న ఇస్తామని గడువు పెట్టి ఇంకా ఇవ్వలేదని వివరించారు. తాము డబ్బులు అడుగుతున్నందుకే తప్పుడు కేసులు పెడుతున్నాడని ఆరోపించారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ‘అమరజ్యోతి’ రూపశిల్పి

» కళారంగ సమస్యలపై సీఎంకు వినతిపత్రం



హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ‘అమరజ్యోతి’ రూపశిల్పి ఎంవీ రమణారెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. కళారంగ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సీఎంను ఆయను కోరారు. అలాగే తెలంగాణ లలిత కళా అకాడమీని పునరుద్ధరించడంతో పాటు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీకి ప్రత్యేక స్థలం కేటాయించమని వినతి పత్రం అందించారు. చిత్రకారుడైన రేవంత్ తెలంగాణ కళారంగం దేశంలోనే అగ్రగామిగా నిలవాలనే ఆకాంక్షను వెలిబుచ్చడంతో పాటు కళారంగానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను తనతో చర్చించారని రమణా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌కు ‘అమరజ్యోతి’పై తాను రాసిన పుస్తకంతోపాటు ప్రత్యేక జ్ఞాపికను ఆయన అందించారు.

బీజేపీ అండతో బీఆర్ఎస్ దోపిడీ

» రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ములుగు, మార్చి 26: బీజేపీ అండతో బీఆర్ఎస్ పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని దోపిడీ చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో కలిసి ములుగు జిల్లాలోని గోవిందరావుపేట, కన్నాయిగూడెం మండలాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావుపేటలో కార్యకర్తల సమావేశంలో సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను ఆచరణలో పెట్టామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 కే గ్యాస్‌సిలిండర్ పథకాలను అమలులోకి తెచ్చామన్నారు. మరోవైపు పేదలు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం విస్మరించిందని మంత్రి సీతక్క విమర్శించారు. కనీస మద్దతు ధర కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలిపితే వారిపై తుపాకులు ప్రయోగించారని ఆమె ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని సీతక్క కోరారు.

రూ.1,718 కోట్ల రుణం తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,718 కోట్ల రుణం తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ అప్పును సేకరించింది. 26 ఏళ్ల కాల పరిమితి 7.46 శాతం వార్షిక వడ్డీతో ఈ అప్పు తీసుకుంది. తెలంగాణ సహా దేశంలోని 18 రాష్ట్రాలు రూ.55,032 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

తాగునీటి కోసం ఆందోళన చెందొద్దు:సీఎస్

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవిలో తాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందని ఆమె వెల్లడించారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై మంగళవారం సచివాలయంలో ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే ‘సమ్మర్ యాక్షన్ ప్లాన్’ను రూపొందించి, జిల్లాలకు అవసరమైన మేర నిధులను విడుదల చేశామని తెలిపారు. బోరుబావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతు పనులను పూర్తి చేశామని, నిర్వహణాపరమైన లోపాలను ఎప్పటికప్పుడు సవరించి, నిరంతర నీటి సరఫరా జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. వేసవికాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఈసారి లోటు వర్షపాతం ఉన్నా ప్రధాన జలాశయాలైన ఎస్ఆర్ఎస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జునసాగర్‌లలో నీటి మట్టాలు గతేడాదిలానే ఉన్నాయని, దాంతో తాగునీటి కోసం ఆందోళన అవసరం లేదని చెప్పారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా రూపొందించుకోవాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.

‘పాలమూరు’కు కేంద్ర సాయం కోసం ప్రతిపాదనలివ్వండి:రాహుల్ బొజ్జా

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎం కేఎస్‌వై-ఏఐబీపీ) కింద సహాయం పొందడానికి వీలుగా తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఆదేశించారు. మంగళవారం జలసౌధలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య జాబితాలో చేర్చిందని, ఈ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం కోరాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. పాలమూరు పథకానికి రెండో దశ పర్యావరణ అనుమతుల గురించి రాహుల్ బొజ్జా ఆరా తీశారు. అలాగే మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ, పనులకు రూ.155 కోట్లు విడుదల చేస్తే ఈ ఏడాది 85 వేల ఎకరాలను సాగు నీరు ఇవ్వవచ్చని అధికారులు నివేదించారు.

ఆర్టీసీ కార్మికులకు బాండ్ల బకాయిల చెల్లింపు!

ఆర్టీసీ కార్మికులకు 2013 పీఆర్సీ బాండ్ల బకాయిలను 50 శాతం మేర దశలవారీగా చెల్లించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మొదటి విడతలో అందిన నిధులను ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం ఆయా రీజియన్లకు సమానంగా విడుదల చేసింది. బుధవారం నుంచి సంబంధిత ఉద్యోగులకు సీనియారిటీ ఆధారంగా బాండ్ల బకాయిలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ఉద్యోగులందరికీ బాండ్ల బకాయిలు పూర్తిగా అందిస్తామన్నారు. అయితే కార్మికులకు పీఆర్సీ బాండ్ల బకాయిల చెల్లింపులకు మొత్తం రూ.281 కోట్ల నిధులు అవసరమని ఆర్టీసీ అంచనా వేసింది. ఈ విషయమై ఇందువరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు మొదటి విడతలో అందిన నిధుల నుంచి ఒక్కో రీజియన్‌లో 200 మంది సీనియర్ డ్రైవర్లకు బాండ్ల బకాయిలను విడుదల చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఎప్ సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షా కేంద్రాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కారు నిర్వహించే ఎప్ సెట్‌కు ఏపీలో పరీక్ష కేంద్రాలను తగ్గించడం అక్కడి విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేసింది. అయితే, నిన్న మొన్నటి వరకు ఆన్‌లైన్‌లో కనిపించిన ఆ కొన్ని కేంద్రాలు కూడా ఇప్పుడు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకై నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ (గతంలో ఎంసెట్)కు గతేడాది ఆంధ్రప్రదేశ్ నుంచి 51,470 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అయితే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలను భారీగా తగ్గించడంతో ఇప్పటి వరకు 26,977 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారు. మూడు రోజుల నుంచి దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులకు ఏపీలో పరీక్ష కేంద్రాలను ఎంచుకునే ఆప్షన్ కనిపించకుండా పోయింది. హైదరాబాద్‌లోని సెంటర్లను ఎంచుకునే ఆప్షన్ మాత్రమే ఉండటంతో అభ్యర్థులు అగచాట్లు పడుతున్నారు. ఎప్‌సెట్‌ను ఏపీలో నిర్వహించేందుకు తగినన్ని పరీక్ష కేంద్రాలు దొరకలేదని సెట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులు చెబుతున్నారు.

నేడో రేపో కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి?

» కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌కు షాక్!



సంగారెడ్డి/కౌడిపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ సొంత ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు గట్టి షాక్ తగలనుంది. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, కేసీఆర్ మిత్రుడు చిలుముల మదన్ రెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరబోతున్న తొలి నాయకుడు మదన్‌రెడ్డి కావడం విశేషం. కాంగ్రెస్ నుంచి మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసే అంశాలపై పార్టీ నాయకత్వంతో మదన్ రెడ్డి చర్చలు జరిపినట్టు తెలిసింది. 2014, 2018 ఎన్నికల్లో నర్సాపూర్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన మదన్‌రెడ్డి గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇప్పుడు పార్లమెంట్ టికెట్ కూడా ఇవ్వకపోవడంతో మదన్ రెడ్డి పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అందులో భాగంగా సోమవారం సీఎం రేవంత్ ముఖ్య అనుచరుడు ఒకరితో, మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో చర్చలు జరిపారు. అయితే మెదక్ పార్లమెంట్ టికెట్ కేటాయించే విషయమై కాంగ్రెస్ నాయకత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. మదన్ రెడ్డి పార్టీ మారే విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు కౌడిపల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి ఆయనతో రహస్యంగా మాట్లాడారు. హరీశ్ ఎంత నచ్చజెప్పినా వినకుండా మదన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా, నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే మైనంపల్లి హన్మంతరావును కలిశానని మదన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. తనకు ఎంపీ టికెట్ ఇస్తామని చెప్పి ఇతరులకు ఇచ్చారన్నారు. అయినా తాను పార్టీ మారడం లేదని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరడం లేదు.. బీఆర్ఎస్‌లోనే ఉంటా: పోచారం

» రాజకీయ వారసుడిగా తనయుడు భాస్కర్ రెడ్డి పేరు ప్రకటన



బాన్సువాడ, మార్చి 26: తాను కాంగ్రెస్‌లో చేరడం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తాను కాంగ్రెస్‌లోకి మారుతున్నట్లు కథనాలు వస్తున్నాయని, అవి అవాస్తవమన్నారు. తనకు బీఆర్ఎస్‌లో గౌరవం ఉందన్నారు. పదవులు అనుభవించి పార్టీ మారే వ్యక్తిని కాదని, తాను బీఆర్ఎస్‌లోనే, కేసీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతానన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో తన తర్వాత రాజకీయ వారసుడిగా తనయుడు, నిజామాబాద్ డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డిని ప్రకటించారు. ఆయనను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు తెలిపారు.

రెఫరెండమే!

(మొదటి పేజీ తరువాయి)



తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో ఆరు గ్యారెంటీలను ప్రకటించిన సంగతి రేవంత్ గుర్తు చేశారు. మళ్లీ అక్కడే జాతీయ స్థాయిలో ఐదు గ్యారెంటీలను ప్రకటించుకోబోతున్నట్లు చెప్పారు. మంగళవారం సీఎం రేవంత్ నివాసంలో జరిగిన చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లలో 14 సీట్లు గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉన్నామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందని తెలిపారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందని చెప్పారు. అన్ని రకాలుగా ఆలోచించిన తర్వాతే చేవెళ్లలో రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరిలో సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌ని పార్టీ అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించిందని అన్నారు.

పదేళ్లలో ప్రధాని మోదీ ఏం చేశారు?

గడిచిన పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ.. రాష్ట్రానికి, దేశానికి ఏం చేశారని రేవంత్ ప్రశ్నించారు. “ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదు. బుల్లెట్ ట్రైన్‌ను గుజరాత్‌కు తీసుకెళ్లిన మోదీ.. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురాలేదు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకున్న ఆయన.. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. రీజనల్ రింగు రోడ్డు రాకుండా.. బీజేపీ మోకాలు అడ్డుతోంది. ఇంక ఏం చూసి మూడోసారి మోదీకి ఓటు వేయాలి?” అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి ఓటేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు అభ్యర్థులను కాకుండా మోదీని చూపించి ఓటడుగుతున్నారని ఎద్దేవా చేశారు. పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలి అన్నట్లుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం వ్యవహార శైలి ఉందని వ్యాఖ్యానించారు.

ప్రాంతాన్నీ అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం

రంగారెడ్డి జిల్లా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది చక్కటి అవకాశమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి, సోనియాగాంధీ నాయకత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చేవెళ్ల నియోజకవర్గ సమావేశంలో పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఇతర ముఖ్య నాయకులూ పాల్గొన్నారు.

దొంగలను తీసుకు రాకండి: రేవంత్‌కు కేఎల్ఆర్ విజ్ఞప్తి

“మీరు డోర్ తెరుస్తం.. డోర్ తెరుస్తం అంటున్నరు. పార్టీని మోసం చేసిన దొంగలను కూడా మీరు లోపలికి తీసుకువస్తే.. మా లాంటి నాయకులు మళ్లీ చచ్చిపోయే ఛాన్స్ ఉంది. కార్యకర్తలూ చచ్చిపోయే ఛాన్స్ ఉంది” అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి పార్టీ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి నివేదించారు. అక్కడక్కడా రేవంత్‌రెడ్డి, కేఎల్ఆర్‌కు పడదని అనుకుంటున్నారని, మనిద్దరం దగ్గర మిత్రులమన్న సంగతి మీరే చెప్పాలని సీఎంను కోరారు. ఈ విషయం తాను చెబితే జనం నమ్మేట్లు లేరన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో తన అభిప్రాయాలు వినిపిస్తూ కేఎల్ఆర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వీడియో క్లిప్పింగ్ మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

జనజాతర ఏర్పాట్లపై 29న టీపీసీసీ భేటీ

జన జాతర పేరుతో తుక్కుగూడలో నిర్వహించనున్న రాహుల్‌గాంధీ సభకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 29న గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యవర్గం సమావేశం కానుంది. ఇదే సమావేశంలో బూత్ స్థాయి నుంచి లోక్‌సభ స్థాయి వరకు మూడంచెల సమన్వయ కమిటీల వ్యవస్థ ఏర్పాటుపైనా కసరత్తు జరగనుంది. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియా ముఖంగా నేతలు మాట్లాడకుండా ఈ సమావేశం వేదికగా ప్రకటన చేయనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాల పైనా చర్చించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ కార్యవర్గం హాజరు కానుంది. ఈ సమావేశం ఏర్పాట్లపైన తనను కలిసిన టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

నేడు కాంగ్రెస్ సీఈసీ భేటీ

» తెలంగాణలో మిగిలిన సీట్లలో అభ్యర్థులపై స్పష్టత!

» హాజరుకానున్న సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సహా దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) బుధవారం భేటీ కానుంది. ఏఐసీసీ కార్యాలయంలో అధ్యక్షుడు ఖర్గే నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో అగ్ర నేతలు సోనియా, రాహుల్‌గాంధీ పాల్గొంటారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. తొలి జాబితాలో నలుగురు, మలి జాబితాలో ఐదుగురు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. ఒకట్రెండు మినహా అన్నిటికీ మిగిలిన అభ్యర్థుల పేర్లను బుధవారం సీఈసీ భేటీలో తేల్చేసే అవకాశం ఉంది. బుధ, గురువారాల్లో వెల్లడించనుందని తెలుస్తోంది. ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ విషయంలో ఇబ్బంది లేకున్నా.., భువనగిరి, ఖమ్మంలో అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా తయారైంది. మరోవైపు సామాజిక సమతుల్యత పాటించడమూ సవాల్‌గా మారింది. బీఆర్ఎస్ ఆరు సీట్లను బీసీలకు ఇవ్వగా, కాంగ్రెస్ ఇప్పటివరకు ప్రకటించినవాటిలో రెండు మాత్రమే కేటాయించింది. దీంతో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అంశంపై చర్చ జరుగుతోంది. మాజీ ఎంపీ మల్లు రవికి నాగర్‌కర్నూల్ టికెట్ ఇచ్చినందున ఆయన సోదరుడు భట్టి భార్య నందినికి ఖమ్మం సీటు దక్కే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక్కడినుంచి మంత్రి పొంగులేటి తమ్ముడిని నిలిపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భార్య లక్ష్మి ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలకు గాను పెద్దపల్లి, నాగర్‌కర్నూల్‌లో మాల వర్గం నాయకులకు టికెట్లిచ్చారు. వరంగల్‌ను మాదిగ వర్గానికి కేటాయించక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ సీటును దొమ్మేటి సాంబయ్యతో పాటు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ ఆశిస్తున్నారు. పరమేశ్వర్ గతంలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి పోటీ చేశారు. ఏఐసీసీ పరిశీలనలో ఈ ఇద్దరి పేర్లు ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆత్రం సుగుణకు ఆదిలాబాద్ అభ్యర్థిత్వం దాదాపు ఖాయమైనట్లేనని తెలుస్తోంది. నిజామాబాద్‌కు జీవన్‌రెడ్డి, మెదక్‌కు నీలం మధు, కరీంనగర్‌కు ప్రవీణ్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. మిగిలిన లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి సమావేశమయ్యారు.



పంటల బీమా పథకానికి త్వరలో టెండర్లు!

» 11 బీమా కంపెనీలకు కేంద్రం ఎం-ప్యానల్

» గ్రామమే యూనిట్‌గా బీమా అమలు

» ప్రీమియం స్వీకరణకు జూలై 31 తుది గడువు

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే వానాకాలం పంట సీజన్ నుంచి రాష్ట్రంలో అమలుచేయనున్న పంటల బీమా పథకానికి త్వరలో టెండర్లు పిలిచేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకం(పీఎం-ఎఫ్‌బీవై)లో రాష్ట్రం ఇప్పటికే చేరింది. ఈ క్రమంలో రైతుల తరఫున ప్రీమియం కూడా చెల్లించి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు.. టెండర్ల నిర్వహణకు విధివిధానాలకు రూపకల్పన చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగయ్యే ఆహార, నూనెగింజలు, ఉద్యాన పంటలన్నీ క్రాప్ ఇన్సూరెన్స్ పంటల బీమా పథకం పరిధిలోకి వస్తాయి. సబ్సిడీ వాటాధనంలో 30 శాతం కేంద్రం చెల్లిస్తే... రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం వాటాధనం చెల్లిస్తుంది. కాగా ‘ఎస్‌టెక్(ఆటోమేషన్ ఆఫ్ ఈల్డ్ ఎస్టిమేషన్) పద్ధతిలో నష్ట పరిహారాన్ని నిర్ధారించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. రియల్ టైమ్‌లో పంట దిగుబడిని సాంకేతికంగా నిర్ధారించి సత్వరమే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటారు. ‘విండ్స్’ (వెదర్ ఇన్‌ఫర్మేషన్ నెట్‌వర్క్ అండ్ డేటా సిస్టమ్) టెక్నాలజీని ఉపయోగించి నిర్దిష్ట ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, నష్టాన్ని అంచనావేసి పరిహారం చెల్లింపులు సులభతరం చేస్తారు. ‘క్రాపిక్’ (కలెక్షన్ ఆఫ్ రియల్‌టైమ్ అబ్జర్వేషన్ అండ్ ఫొటో గ్రాఫ్స్ అండ్ క్రాప్స్) సిస్టమ్, శాటిలైట్ ఇమేజరీ అప్లికేషన్స్‌డేటాను ఉపయోగించటం ద్వారా అన్ని పంటలపై పర్యవేక్షణ ఉంటుంది. మానవ ప్రమేయం లేకుండా టెక్నాలజీ ఆధారంగా క్లెయిమ్ అసెస్‌మెంట్ చేసేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. దీంతో పంట నష్టం అంచనా, డీబీటీ ద్వారా చెల్లింపులు త్వరగా జరిగిపోయేలా ప్రక్రియ సిద్ధంచేస్తున్నారు. కాగా పంటల బీమా పథకం కోసం కేంద్ర ప్రభుత్వం 11 కంపెనీలను ఎం-ప్యానల్ చేసింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట రుణాలు పొందే సమయం ఏప్రిల్ నుంచి జూలై వరకు ఉంది. యాసంగి సీజన్‌లో అక్టోబరు నుంచి డిసెంబరు 31 వరకు ఉంది. అయితే రైతుల నుంచి ప్రీమియం స్వీకరించటానికి ఖరీఫ్ సీజన్‌కు జూలై 31వ తేదీని.. యాసంగి సీజన్‌కు డిసెంబరు 31 వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. ఆగస్టులో కూడా రాష్ట్రంలో రైతులు వరి నాట్లు, ఇతర పంటలు సాగుచేస్తుండటంతో ప్రీమియం స్వీకరించేందుకు ఆగస్టు దాకా గడువు ఇవ్వాలని రైతులు, రైతు సంఘాల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంలో చర్చ జరుగుతోంది.

కొత్త హైకోర్టుకు నేడు శంకుస్థాపన

» సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చేతుల మీదుగా..

» హాజరు కానున్న సుప్రీం, హైకోర్టు జడ్జిలు

హైదరాబాద్, రాజేంద్రనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు నూతన భవన నిర్మాణ పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల వద్ద కేటాయించిన 100 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులకు.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ బుధవారం సాయంత్రం 5.30కు శంకుస్థాపన చేయనున్నారు. పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు హాజరుకానున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు ఎవరూ పాల్గొనే అవకాశం లేదు. కాగా, హైకోర్టు నూతన భవనాన్ని వందేళ్లపాటు పటిష్ఠంగా ఉండేవిధంగా నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూ.వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్‌తో 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం హైకోర్టుకు కేటాయించిన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా.. భవిష్యత్తులో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కోర్టు హాళ్లను నిర్మించాల్సి ఉంటుంది. జడ్జిల నివాస భవనాలు, రాష్ట్ర బార్ కౌన్సిల్, హైకోర్టు బార్ అసోసియేషన్, ఆడిటోరియం, లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఫైలింగ్ సెక్షన్‌లు, రికార్డుల గదులు, పార్కింగ్ తదితర అనేక అవసరాలకు తగిన విధంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. కాగా, హైకోర్టు నూతన భవనం వరకు మెట్రోరైలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే పేర్కొంది.

19 ఆర్కిటెక్ట్ కంపెనీల ఆసక్తి

హైకోర్టు నూతన భవనం నిర్మాణ డిజైన్లను అందించేందుకు 19 ఆర్కిటెక్ట్ కంపెనీలు ముందుకొచ్చాయి. శంకుస్థాపన తర్వాత హైకోర్టు బిల్డింగ్ కమిటీ.. నిర్మాణానికి ఒకటి రెండు కంపెనీలను ఎంపిక చేయనున్నట్టు సమాచారం. ఎంపికైన కంపెనీలు డిజైన్లను రూపొందించి బిల్డింగ్ కమిటీకి అందిస్తాయి. వాటిలో నుంచి ఒక డిజైన్‌ను కమిటీ సెలెక్ట్ చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. అనంతరం నిర్మాణానికి టెండర్లను ఆహ్వానిస్తారు. నిర్మాణ బాధ్యతలను రోడ్లు, భవనాల శాఖ నిర్వహించనుంది.

1919లో ప్రస్తుత హైకోర్టు నిర్మాణం

ప్రస్తుతం మూసీ నది ఒడ్డున మదీన వద్ద ఉన్న హైకోర్టు భవనాన్ని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో 1919లో నిర్మించారు. భారత్‌లో హైదరాబాద్ విలీనం కాకముందు హైదరాబాద్ హైకోర్టుగా దీనిని వ్యవహరించేవారు. 1956లో ఏపీ హైకోర్టుగా మార్పు చెందింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు కావడంతో, 2019 జనవరి 1న తెలంగాణ హైకోర్టుగా రూపాంతరం చెందింది. వందేళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో.. కొంతకాలంగా పార్కింగ్ సమస్య, మౌలిక సదుపాయాల కొరత ఎదురవుతోంది. అగ్నిప్రమాదాలు, లీకేజీలు సమస్యగా మారాయి. ఏటా రిపేర్లు చేయాల్సి వస్తోంది. దీంతో కొత్త భవనాన్ని నిర్మించాలని, ఇందుకోసం 100 ఎకరాలు కేటాయించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నా అది నెరవేరలేదు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డితో పలు సందర్భాల్లో భేటీ అయిన నేపథ్యంలో.. నూతన భవనం డిమాండ్ సాకారం దిశగా అడుగులు పడ్డాయి.

ఉత్తుత్తి జీవోలు.. డమ్మీ బటన్లే!

ఎన్నికల ముందు ఉద్యోగాలు, రెగ్యులరైజేషన్ పేరుతో నాటకాలు

» ఇంత విధ్వంసాన్ని నా జీవితంలో చూడలేదు:చంద్రబాబు



కుప్పంలో పర్యటనలో చంద్రబాబు

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ఏపీ సీఎం జగన్ ఉత్తుత్తి జీవోలు విడుదల చేశాడని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. రామకుప్పంలో హంద్రీ-నీవా కుప్పం కాలువ ద్వారా నీళ్లను వదులుతున్నట్లు డమ్మీ బటన్ నొక్కారని ఎద్దేవాచేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో మంగళవారం రెండో రోజూ పర్యటించారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన యువత సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రామకుప్పం మండలం రాజుపేట వద్ద సీఎం జగన్ కుప్పం బ్రాంచి కెనాల్ గేటు బటన్ నొక్కి, నీళ్లను వదిలిన విషయం తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుప్పానికి నీరిచ్చానని డప్పు కొట్టుకున్న మరుసటి రోజే కాలువలో నీళ్లు ఇంకిపోయాయి. నీళ్లు లేని ఆ కాలువలోకి బాబు స్వయంగా దిగి పరిశీలించారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. జగన్‌పై విరుచుకుపడ్డారు. ట్యాంకర్లో నీళ్లు తెచ్చి పోసి సినిమా సెట్టింగులా గేటు పెట్టి బటన్ నొక్కి వెళ్లిపోయాడని.. తెచ్చిపోసిన నీళ్లు తెల్లారేసరికి ఇంకిపోయాయని.. మట్టి పెళ్లలు కూడా తడవలేదని.. అద్దెకు తెచ్చిన గేట్లను సాయంత్రానికి అధికారులు తీసుకెళ్లిపోయారని.. ఇలాంటి సినిమా సెట్టింగుల సీఎం వస్తాడని డైరెక్టర్లు, నిర్మాతలు కూడా అనుకుని ఉండరని వ్యాఖ్యానించారు. ఐదేళ్లు నడిపిన వైసీపీ డ్రామా కంపెనీని శాశ్వతంగా మూసేయబోతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా కుప్పానికి నీళ్లు తెస్తానని హామీఇచ్చారు. రాష్ట్రంలో ఇంత విధ్వంసాన్ని తన జీవితంలో చూడలేదన్నారు. కేంద్రం సాయం లేకుంటే రాష్ట్రాభివృద్ధి కష్టమవుతుందని.. అన్నిటినీ సరిచేయడానికే ఎన్డీయేలో చేరామని చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక 60 రోజుల్లోనే మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం పెడతానని ఆయన ప్రకటించారు.

‘లా’పై యువత ఆసక్తి శుభపరిణామం

» సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు న్యాయవిభాగం కృషి: సీజేఐ చంద్రచూడ్



తిరుపతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యులు, ఇంజనీర్లు, ఐటీ నిపుణులతోపాటు న్యాయవాదులు కూడా ప్రాధాన్యం కలిగిన వారేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం లా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు దశాబ్ది ఉత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ..తాను లా చదవాలనుకున్న సమయంలో చాలావరకు వైద్య, ఇంజనీరింగ్ విద్యలో సీటు రాని వారు మాత్రమే లా కోర్సులో చేరడానికి ఆసక్తి చూపేవారన్నారు. అయితే నేడు న్యాయవాద వృత్తిని ఎన్నుకోవడానికి యువత ముందుకొందని, యువతులు కూడా లా చదవడానికి ప్రాముఖ్యత ఇస్తున్నారని, ఇది మంచి పరిణామమని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో న్యాయవాదులు పాల్గొన్నారని, సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి న్యాయవిభాగం పనిచేస్తోందని తెలిపారు. కక్షిదారులు, న్యాయమూర్తులు చెప్పేది యువ న్యాయవాదులు జాగ్రత్తగా వినాలని సూచించారు. కేవలం కోర్టుల్లో బిగ్గరగా వాదించడం, ఎదుటి పక్షం న్యాయవాదిని పదే పదే అడ్డుకోవడం వంటి వాటితో కేసులు గెలవలేరన్నారు. కేసులో తమ వాదన ఎంత నాణ్యంగా వినిపిస్తారనే దానిపై తీర్పు ఆధారపడి ఉంటుందని చెప్పారు.

హైకోర్టు జడ్జిగా సుజయ్ పాల్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణ స్వీకారం చేశారు. మొదటి కోర్టు హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే జస్టిస్ ఆయనచే ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు రాష్ట్రపతి కార్యాలయం నుంచి వెలువడిన బదిలీ ఉత్తర్వులను, గవర్నర్ తరఫున చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారం చేయించేందుకు వీలుగా జారీ అయిన జీవోను రిజిస్ట్రార్ జనరల్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో అందరు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ సుజయ్ పాల్ మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. కలకత్తా హైకోర్టు నుంచి బదిలీపై వస్తున్న మరో జడ్జి మౌసమీ భట్టాచార్య ఈనెల 28న ప్రమాణస్వీకారం చేయనున్నారు.



జస్టిస్ సుజయ్ పాల్‌కు రాష్ట్రపతి ఉత్తర్వులు అందజేస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

- ఫెమా నిబంధనలు ఉల్లంఘించి వేల కోట్లు దేశం దాటించిన కేసులో...
- ఢిల్లీ, ముంబై, కురుక్షేత్ర, కోల్‌కతాల్లోనూ...
- వాషింగ్ మెషిన్‌లో దాచిన రూ. 2.54 కోట్ల నగదు స్వాధీనం
- కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలూ

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద లావాదేవీలతో వేల కోట్ల రూపాయలు దేశం దాటించిన కేసులో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈడీ) అధికారులు హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌తోపాటు దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో ఈడీ ప్రత్యేక బృందాలు మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. సింగపూర్‌లోని గెలాక్సీ షిప్పింగ్, లాజిస్టిక్స్ లిమిటెడ్‌తోపాటు మరికొన్ని కంపెనీలకు భారత్‌లోని కాప్రికార్నియన్ షిప్పింగ్స్ ఇతర కంపెనీల నుంచి ఫెమా నిబంధనలు ఉల్లంఘించి రూ. 1,800 కోట్లు తరలించిన కేసులో ఈడీ విచారణ చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ప్రత్యేక బృందాలు ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, కురుక్షేత్ర, కోల్‌కతాలో మంగళవారం సోదాలు నిర్వహించాయి. ఈ సోదాల్లో రూ. 2.54 కోట్ల నగదు, కీలక పత్రాలు, డిజిటల్ పరికరాల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాషింగ్ మెషిన్‌లో దాచిన రూ. 2.54 కోట్ల నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



గుండె రంధ్రం పూడ్చలేని పేదరికం

బాలుడిని బలిగొంది!

- బడి ఆవరణలో గుండెపోటుతో మృతి.. సిరిసిల్ల జిల్లాలో విషాదం
- శస్త్రచికిత్స తప్పనిసరి అని తెలిసినా వైద్యం చేయించలేని దైన్యం

ఇల్లంతకుంట, మార్చి 26: శస్త్రచికిత్స చేస్తే ప్రాణాంతకమైన అనారోగ్యం నుంచి ఆ బాలుడు స్వస్థత పొందుతాడని తెలిసినా ఖరీదైన ఆ వైద్యం చేయించలేని తల్లిదండ్రుల పేదరికం చివరికి ఆ చిన్నారి ప్రాణం తీసింది. పుస్తకాల సంచీతో బడికి వెళ్లిన ఆ బాలుడు పాఠశాల ఆవరణలోనే తీవ్రమైన గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో ఈ విషాద ఘటన జరిగింది. మృతుడు 14 ఏళ్ల విద్యార్థి సాయితేజ. నర్సక్కపేటకు చెందిన శ్రీనివాస్, రేణుక దంపతుల ఇద్దరు సంతానంలో సాయితేజ పెద్ద కుమారుడు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో నర్సక్కపేట నుంచి అదే మండలంలోని కందికట్కూర్‌కు వచ్చేశారు. శ్రీనివాస్ దంపతులు కూలీ పనులకు వెళుతుంటారు. సాయితేజ, అతడి సోదరుడు అదే ఊర్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సాయితేజకు పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉంది. తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పినా ఆర్థిక స్థోమత సరిగా లేకపోవడంతో సాయితేజకు శ్రీనివాస్, రేణుక దంపతులు వైద్యం చేయించలేకపోయారు. రోజూలాగే మంగళవారం పాఠశాలకు వెళ్లిన సాయితేజ భోజనం చేసిన కొద్దిసేపటికి వాష్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి బయలుదేరి కుప్పకూలాడు. వెంటనే బాలుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కుమారుడి మృతితో కన్నీరుమున్నీరుగా విలపించిన దంపతులు తమ మరో కుమారుడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని చెప్పారు.



సాయితేజ (ఫైల్)

లోకోక్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకు మొదటి బహుమతి

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి లోకో క్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేకు మొదటి బహుమతి లభించింది. పాటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో జరిగిన ఈ పోటీల్లో భారత రైల్వేకు చెందిన వివిధ రైల్వేజోన్‌ల నుంచి 13 లోకో మోటివ్‌లు పాల్గొన్నాయి. పోటీలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన లాలాగూడ ఎలక్ట్రిక్ లోకో షెడ్, పశ్చిమ రైల్వేకు చెందిన వటావాల డీజిల్ లోకో షెడ్‌లు సంయుక్తంగా మొదటి బహుమతిని అందుకున్నాయి. రైలు ఇంజిన్‌ను నడిపే సిబ్బంది అలసటను తగ్గించి ఎక్కువ గంటలు పని చేసే విధంగా ఎలక్ట్రిక్ లోకో క్యాబ్‌లను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు జోనల్ రైల్వేలకు సూచించింది. ఈ నిబంధనలకు అనుగుణంగా క్యాబ్‌ను సౌకర్యంగా తీర్చిదిద్దడంతో పాటు సిబ్బంది కదలికలను సులభతరం చేయడానికి సరికొత్త సామగ్రి అత్యాధునిక సాంకేతికను విజయవంతంగా అమలు చేయడం ద్వారా లాలాగూడ ఎలక్ట్రిక్ లోకో షెడ్ ఈ బహుమతిని పొందింది.

సుప్రీంకోర్టుకు చేరిన ఐఎంజీ భూముల రద్దు

హైదరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఐఎంజీ అకాడమీస్ భారత్‌కు 850 ఎకరాల భూకేటాయింపు రద్దు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సేల్‌డీడ్‌ను రద్దు చేస్తూ అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం చేసిన చట్టాన్ని సమర్థిస్తూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఐఎంజీ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. 2003లో ఐఎంజీకి భూకేటాయింపు చేసే విషయంలో అక్రమాలు జరిగాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ టీ శ్రీరంగారావు, ఏబీకే ప్రసాద్, విజయసాయిరెడ్డి తదితరులు అప్పటి ఉమ్మడి ఏపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లు మంగళవారం మరోసారి చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజయ్ పాల్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగానే ఐఎంజీ అకాడమీస్ భారత్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ తాము సుప్రీంకోర్టులో అప్పీలు చేసిన విషయాన్ని వెల్లడించారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టులో ఉన్న అంశం, తాము కోరుతున్న విషయం వేరు వేరని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. సుప్రీంకోర్టులో ఏం జరుగుతుందో చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.

యాదగిరీశుడి హుండీ లెక్కింపు

- 35 రోజుల్లో రూ 2.85 కోట్ల రాబడి

భువనగిరి అర్బన్, మార్చి 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి హుండీల కానుకలను మంగళవారం ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఆలయ ఖజానాకు 35 రోజుల్లో రూ. 2,85,02,418 ఆదాయం సమకూరింది. భక్తులు స్వామివారి హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం కొండకింద సత్యదేవుని వ్రతమండపంలో లెక్కించారు. ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో సిబ్బంది వీటిని లెక్కించారు. గత ఫిబ్రవరి 21 నుంచి ఈ నెల 26 వరకు క్షేత్ర సందర్శనకు విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించారు. కాగా, మిశ్రమ బంగారం 0.425 గ్రాములు, మిశ్రమ వెండి 5.960 కిలోలు, విదేశీ కరెన్సీ రూపంలో అమెరికా డాలర్లు 2,697 ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మహీంద్ర వర్సిటీకి ఐదేళ్లలో 500 కోట్లు

- ఆనంద్ మహీంద్ర ప్రకటన

ఢిల్లీ, మార్చి 26: హైదరాబాద్‌లో నెలకొల్పిన మహీంద్ర యూనివర్సిటీకి రానున్న అయిదేళ్లలో రూ.500 కోట్లు ఇస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర ప్రకటించారు. తొలుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు ఇస్తామని, మిగిలింది దశల వారీగా చెల్లిస్తామని తెలిపారు. దీంతో పాటుగా ఇందిరా మహీంద్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు మరో రూ.50 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. 2020లో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 35 ప్రోగ్రాంలు అందిస్తున్నారు. త్వరలోనే ఈ వర్సిటీ పరిధిలో స్కూల్‌ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, లిబరల్ ఆర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలి

హైదరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు డీరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారి సమస్యలపై చర్చించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందించే ప్రయోజనాలను వెంటనే చెల్లించడం, పీఆర్‌సీ అమలు, నాలుగు డీఏలను ప్రకటించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

ట్యాపింగ్ మంటలు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం, డీజీపీ, ఉన్నతాధికారుల జోక్యం ఎంతనే విషయం బయటపడుతుందని వ్యాఖ్యానించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ హయాంలో తమ పార్టీ నాయకుల ఫోన్లను, ఆఫీస్ సిబ్బంది ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయని మండిపడ్డారు. వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేయడం కోసం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇక.. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చేర్చాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా తన ఫోన్‌ను కూడా ట్యాప్‌చేసి తన ప్రచార తీరుతెన్నులను తెలుసుకొని ఇబ్బందులకు గురిచేశారని ఆయన ధ్వజమెత్తారు. దానికి సంబంధించి రెండో ముద్దాయిగా మాజీ మంత్రి హరీశ్‌రావును, మూడో ముద్దాయిగా అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని చేర్చాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు అప్పటి డీజీపీని కూడా ముద్దాయిగా చేర్చాలన్నారు. మంగళవారం సంగారెడ్డి సమీపంలోని కందిలో బీజేపీ జిల్లా కార్యాలయంలో రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికలోనూ బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. బీజేపీ నేత బీఎల్ సంతోష్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసి కేసుల్లో ఇరికించారని ఆరోపించారు. ఇందులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాత్ర కూడా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయని, ఆయనను కూడా అరెస్ట్ చేసి విచారించాలని కోరారు. "ఐన్యూస్ చానల్ ఎవరిది? ఆయనను ఎందుకు అరెస్ట్ చేయట్లేదు? చానల్‌ను ఎందుకు సీజ్ చేయట్లేదు?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తరువాత హరీశ్‌రావు ఢిల్లీకి వెళ్లిన సందర్భంలో.. ఈ నెల 19న విమానంలో హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య రెండు గంటలపాటు చర్చలు జరిగాయని రఘునందన్‌రావు అన్నారు. ఆ చర్చల నేపథ్యంలోనే.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాస్‌పోర్ట్‌లను వెంటనే సీజ్ చేయాలని.. హరీశ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై వెంటనే క్యాబినెట్ తీర్మానం చేసి సీబీఐకి అప్పగించాలన్నారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.



కఠినచర్యలు తీసుకోవాలి..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తాను కూడా బాధితుడినేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తనతోపాటు తన కుటుంబసభ్యులు, సన్నిహితుల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారని.. మహబూబ్‌నగర్ జిల్లాలోనే వందల మంది బాధితులు ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఫోన్లు ట్యాప్ చేయడమే కాక.. వాటి ద్వారా ఎంతోమంది వ్యక్తిగత అంశాలను సేకరించి, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తునకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని డీజీపీని కోరారు. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వ ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు.. బాధ్యులందరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం యెన్నం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు తన ఫోన్ ట్యాప్ చేశారని.. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాల్ని డీజీపీకి అందించానని చెప్పారు. బాధితులంతా ముందుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు కూడా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఫోన్ ట్యాపింగ్ చేయించడం ద్వారా కల్వకుంట్ల కుటుంబం అతిపెద్ద నేరానికి పాల్పడిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని, ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే కేటీఆర్ తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించుకుని.. చేయని పాపం లేదని విమర్శించారు. అధికార దాహంతో ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడిన కల్వకుంట్ల కుటుంబంపై ప్రజలు తిరగబడి.. ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని దుయ్యబట్టారు. తన చెల్లి కవితలాగానే కేటీఆర్ కూడా జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని దయాకర్ వ్యాఖ్యానించారు.

ఆడిస్తానంటూ తీసుకెళ్లి.. రెండేళ్ల బాలికపై

అత్యాచారం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోరం
- నిలోఫర్‌లో చిన్నారి.. పరిస్థితి విషమం
- పోలీసుల అదుపులో నిందితుడు

చౌటుప్పల్ రూరల్, మార్చి 26: అతడు పొరుగున ఉండే యువకుడు. పైగా పరిచయస్తుడు కూడా. రోజూ ఇంటికొచ్చి రెండేళ్ల పాపను ఎత్తుకొని ఆడిస్తుంటాడు. ఆ రోజూ వచ్చి పాపను కాసేపు ఆడించి తీసుకొస్తాని చెబితే ఆ తల్లి ఎందుకు అనుమానిస్తుంది? అయితే ఆ యువకుడు దుర్మార్గానికి ఒడిగట్టాడు. బాలికను ఓ నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. కాసేపటికి ఏడ్చుకుంటూ వచ్చిన చిన్నారికి రక్తస్రావం అవుతుండటంతో తల్లిదండ్రులు గుర్తించి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఈ ఘటన జరిగింది. బాలికను హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించారు. బాధిత బాలిక పరిస్థితి విషమంగా ఉంది. సీఐ అశోక్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన 22 ఏళ్ల శివ దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే పరిశ్రమకు చెందిన ఓ గదిలో ఉంటున్నాడు. యూపీలో శివ గ్రామానికే చెందిన దంపతులు అదే పరిశ్రమలో పనిచేస్తూ అక్కడే గదిలో ఉంటున్నారు. శివ రోజూ ఆ దంపతుల రెండేళ్ల బాలికను ఎత్తుకొని ఆడించేవాడు. సోమవారం సాయంత్రం చిన్నారిని ఎత్తుకొని ఆడిపిస్తానని తల్లికి చెప్పి పరిశ్రమ సమీపంలోని ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత పాపను ఇంటి సమీపంలో వదిలి వెళ్లిపోయాడు. ఏడుస్తూ వచ్చిన చిన్నారిని చూసి తల్లి కంగారుపడింది. కుమార్తె అత్యాచారానికి గురైనట్లు తెలుసుకొని భర్తకు సమాచారమిచ్చింది. ఘటనపై మంగళవారం తెల్లవారుజామున దంపతులు, పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.



ఎన్నాళ్లకెన్నాళ్లకు..

శివయ్యకు నిత్య జలాభిషేకం

- రామప్ప ఆలయంలో సోమసూత్రం పునరుద్ధరణ

ములుగు, మార్చి 26: సూర్యుడు నమస్కార ప్రియుడు.. విష్ణువు అలంకార ప్రియుడు.. శివుడు అభిషేక ప్రియుడు అంటారు. అయితే.. ప్రపంచ వారసత్వ కట్టడంగా ప్రఖ్యాతిపొందిన రామప్ప దేవాలయంలో కొలువుదీరిన రుద్రేశ్వరుడికి మాత్రం కొన్నేళ్లుగా పరిపూర్ణమైన అభిషేకాలు జరగడం లేదు. నిత్య జలాభిషేకానికి అవసరమైన సోమసూత్రం లేకపోవడమే ఇందుక్కారణం..! అంటే అభిషేక జలాలను బయటకు పంపే వ్యవస్థ లేదు. ఈ సమస్యను పురావస్తు శాఖ పరిష్కరించింది. ఆలయ గర్భగుడిలో డ్రిల్లింగ్ చేసి.. సోమసూత్రానికి మరమ్మతు చేయించింది. అభిషేక జలాలు బయటకు వెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేసింది. కాకతీయులు 1213లో రామప్ప దేవాలయాన్ని నిర్మించారు. గర్భగుడిలో శివలింగం ఎత్తుగా ఉంటుంది. రామలింగేశ్వరుడి పేరుతో వందల ఏళ్లుగా ఈ శివలింగానికి నిత్యపూజలు జరిగేవి. నిజానికి గర్భాలయంలో దీపం వెలుగుతో అవసరం లేకుండా నిర్మాణాన్ని జరిపారు. అంటే.. సూర్యకిరణాలు ఆలయ స్తంభాలపై పడి, పరావర్తనం చెంది గర్భగుడిలోకి ప్రవేశిస్తాయి. చారిత్రక ఈ ఆలయానికి నిజాం హయాంలో చివరిసారి పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగాయి. అయితే.. అప్పట్లో నిత్యపూజలు జరగలేదు.2001లో పాలంపేట వాసులు శివలింగానికి పునఃప్రాణప్రతిష్ఠ చేయించారు.

ఎలుకలు.. చీమలే కారణం..!

ఈ ఆలయంలోని సోమసూత్రం (అభిషేక జలం బయటకు వెళ్లే వ్యవస్థ) కొన్నేళ్లక్రితం దెబ్బతిన్నది. ప్రసాదాల కోసం వచ్చే ఎలుకలు, చీమల కారణంగా సోమసూత్రం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో.. అభిషేకాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రముఖుల పర్యటనలు, ప్రత్యేక రోజులు, పర్వదినాల్లో మాత్రమే అభిషేకాలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకంలో భాగంగా రామప్ప ఆలయాభివృద్ధికి రూ.60 కోట్లను కేటాయించింది. సోమసూత్రం పునరుద్ధరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పదిరోజుల క్రితం పనులను ప్రారంభించింది. గర్భాలయ గోడకు డ్రిల్లింగ్ చేసి.. అభిషేక జలాలు బయటకు.. అక్కడి నుంచి 15 మీటర్ల దూరం దాకా వెళ్లేలా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. దీంతో.. ఆ పరమశివుడికి నిత్యాభిషేకాలు చేసుకునే భాగ్యం భక్తులకు దక్కింది.

ట్యాపింగ్‌లో ఎమ్మెల్సీ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు.. సదరు ఎమ్మెల్సీ ఖర్చుకు ఏమాత్రం వెనుకంజ వేయలేదని తెలుస్తోంది. ఆ ఎమ్మెల్సీ మాట పోలీసు విభాగంలో బాగా చెల్లుబాటయ్యేదని హోంశాఖలో చర్చ జరుగుతోంది. కొంతమంది ఉన్నతాధికారులు కూడా ఆయన చెప్పిన పనిని చెప్పినట్లు చేయడానికి సిద్ధపడేవారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు సదరు ఎమ్మెల్సీకి నోటీసులు ఇచ్చి, విచారించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎస్ఐబీలో ప్రణీత్‌రావుకు రెండు గదులను కేటాయించి, 17 కంప్యూటర్ల ద్వారా ఫోన్‌ట్యాపింగ్‌లు చేసినట్లు ఇప్పటికే దర్యాప్తులో తేలింది. వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, నిజామాబాద్, మెదక్ తదితర జిల్లాల్లోనూ వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు రూఢీ అయ్యింది. ఇక సీఎం రేవంత్ విపక్ష నేతగా ఉన్నప్పుడు.. ఆయన ఇంట్లో ఎవరేం మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేక పరికరాన్ని తెప్పించినట్లు దర్యాప్తు అధికారులు నిగ్గుతేల్చారు. మొత్తం ఎన్ని టూల్స్‌ని దిగుమతి చేసుకున్నారు? వాటికి ఖర్చు ఎంతైంది? సదరు ఎమ్మెల్సీ ఆ నిధులను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఏవైనా భూదందాలు, సెటిల్మెంట్ల ద్వారా నిధులను సమకూర్చుకున్నారా? ఆ మొత్తాన్ని ఇజ్రాయెల్‌కు ఎలా తరలించారు? చట్టబద్ధమైన మార్గాల్లో డబ్బు తరలితే.. ఇప్పటికే కేంద్ర నిఘావర్గాలు గుర్తించేవి. అయితే.. హవాలా మార్గాల్లో నిధుల తరలింపు జరిగిందా? అనే కోణాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఈ టూల్స్ కొనుగోలుకు ఎస్ఐబీ నిధులు ఎంత ఖర్చుచేశారు? ఇంకా ఎవరైనా నిధులిచ్చారా? అనే అంశంపై దర్యాప్తు జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో ఒకవేళ హవాలా కోణం వెలుగులోకి వస్తే.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే అవకాశాలుంటాయి.

రంగంలోకి ఏసీబీ

ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్న కొద్దీ.. కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే అరెస్టయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలు ట్యాపింగ్ విషయంలో స్వామికార్యంతో పాటు.. స్వకార్యం కూడా పూర్తిచేశారని దర్యాప్తు అధికారులు తేల్చారు. కొందరు వజ్రాల/నగల వ్యాపారులను బెదిరించినట్లు నిర్ధారించారు. ఎన్నికల సమయంలో హవాలా ఆపరేటర్ల నుంచి సీజ్ చేసిన నగదును నొక్కేశారని అనుమానిస్తున్నారు. ట్యాపింగ్‌ను ఆసరాగా చేసుకుని, రియల్టర్లు, సెలబ్రిటీలను బెదిరించడమే కాకుండా.. పలు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు అధికారులు ఆదాయానికి మించి కూడబెట్టిన ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు రంగంలోకి దిగారు. ఈ ముగ్గురు అధికారులు సర్వీసులో చేరినప్పటి నుంచి.. అరెస్టయ్యే వరకు వారు సంపాదించిన ఆస్తుల చిట్టాపై దృష్టి సారించారు. వీరు గత ప్రభుత్వ హయాంలో ఎక్కడెక్కడ దందాలు చేశారు? ఆస్తులను ఏ మేర కూడబెట్టారు? వీటిలో కబ్జాలు, బెదిరింపుల ద్వారా సంపాదించిన ఆస్తులెన్ని? అప్పట్లో వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలు ఏమిటి? ఇలా అనేక కోణాల్లో ఇప్పటికే సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. ఈ ముగ్గురితోపాటు.. ఈ కేసులో ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన పోలీసు అధికారుల ఆదాయాలపైనా ఏసీబీ దృష్టి సారించింది.



పోలీస్ కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును పోలీస్ కస్టడీకి ఇవ్వాలని, వారిని విచారించి అనేక అంశాలను రాబట్టాలని పంజాగుట్ట పోలీసులు న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుల తరఫు న్యాయవాదులు తమ క్లైంట్స్ ఏ తప్పూ చేయలేదని, తమ వద్ద ఆధారాలున్నాయని, రెండ్రోజుల గడువు ఇస్తే.. వివరాలు అందజేస్తామని వాదనలు వినిపించారు. న్యాయస్థానం వారి వాదనలను తోసిపుచ్చింది. బుధవారం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. కస్టడీ పిటిషన్‌పై తీర్పును బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

పోలీసు శాఖలో టెన్షన్.. టెన్షన్..!

ట్యాపింగ్ వ్యవహారం ఎప్పుడు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని పోలీసు శాఖలో ఇప్పుడు టెన్షన్ నెలకొంది. తీగ లాగితే.. ఈ వ్యవహారంలో ఉన్న అధికారులు, సిబ్బంది డొంక కదులుతోంది. తొలుత ప్రణీత్‌రావు ఒక్కడే అరెస్టవ్వగా.. ఆయన విచారణలో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన ప్రభాకర్‌రావు పేర్లు వెలుగులోకి వచ్చాయి. నలుగురు ఇన్‌స్పెక్టర్లను దర్యాప్తు అధికారులు విచారించారు. ఇప్పుడు భుజంగరావు, తిరుపతన్నలను కస్టడీకి తీసుకుని, విచారిస్తే.. ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తనను బెదిరించారని, తన ఇంటిని ఆయన బంధువు పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని శరణ్‌చౌదరి ఆరోపిస్తూ సీఎం, డీజీపీలకు ఈ-మెయిల్ పంపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో రాధాకిషన్‌రావు పేరుతోపాటు.. సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు పేర్లు వెలుగులోకి వచ్చాయి. రాధాకిషన్ ఇప్పటికే ట్యాపింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నారు. ఈ టీమ్ బెదిరింపులపై పోలీసులకు కొత్తగా ఫిర్యాదులు వస్తే.. ఇంకా ఎవరెవరి పేర్లు వెలుగులోకి వస్తాయోననే టెన్షన్ ఇన్‌స్పెక్టర్, ఆపైస్థాయి అధికారుల్లో నెలకొంటోంది.

బ్యాంకు ఖాతాల వివరాలు విదేశాలకు

- కమీషన్ల వల వేసి వివరాలు సేకరణ
- ఆపై ఇతర దేశాల్లో నేరగాళ్లకు విక్రయం
- తెలంగాణ, ఏపీకి చెందిన నలుగురి అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), మార్చి 26: సోషల్ మీడియాలో ఫేక్ మెసేజ్‌లు పెట్టి.. స్టాక్ ఎక్స్ఛేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లతో వల పన్నుతారు. మాయమాటలతో కమీషన్ల ఆశ చూపి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తారు. ఆ వివరాలను విదేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్మేస్తారు. కొన్ని రోజులుగా ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న నలుగురిని సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన మాతంగి ప్రశాంత్ (30), మాతంగి కుమార్ (27), పెరుమండ్ల అశోక్ (20) ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన త్రిపురామల్లు శ్రీనాగ రమేశ్ (31).. వాట్సాప్, టెలిగ్రామ్‌తో పాటు పలు రకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో స్టాక్ ఎక్స్ఛేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లను పరిచయం చేస్తారు. వీటిలో జాయిన్ అయితే కమీషన్లు ఇస్తామని ఆశ చూపి వారి వారి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి.. వాటిని ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్ముకుంటున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతోపాటు, నగరంలోని కొంతమంది బాధితులు కూడా పోలీసులను ఆశ్రయించడంతో సైబర్‌క్రైమ్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

ఫోన్ నంబర్లు మార్చేసి మాయ..

నిందితులు ఫేక్ నంబర్లతో సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపుతుంటారు. స్టాక్ ఎక్స్ఛేంజ్, ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన యాప్‌లతో వల వేస్తుంటారన్నారు. కమీషన్ ఇస్తామని ఆశ చూపి వాటికి స్పందించే వారి బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు సేకరిస్తారు. వివరాలు ఇచ్చిన వారికి కొంత డబ్బు జమ చేసి నమ్మకం కలిగిస్తారు. ఆ తర్వాత ఆ ఖాతాలకు లింక్ అయిన ఫోన్ నంబర్లను మార్చేసి ఆయా ఖాతాలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకుంటారు. ఆపై ఆ వివరాలను ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు. ఆ ఖాతాలను వినియోగించి చైనా, కంబోడియా తదితర దేశాలకు చెందినవారు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***K. Srinivas****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 27 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



భోపాల్ ఐసర్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)- పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

పీహెచ్‌డీ విభాగాలు - స్పెషలైజేషన్‌లు

- **నేచురల్ సైన్సెస్:** బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మేథమెటిక్స్, ఫిజిక్స్
- **ఇంజనీరింగ్ సైన్సెస్:** కెమికల్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్
- **హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్:** ఎకనామిక్ సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్)

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు

- **నేచురల్ సైన్సెస్:** మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత: పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంకాం ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోర్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్ఎం/డీఎస్‌టీ ఇన్‌స్పైయిర్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు; కనీసం 8 సీజీపీఏతో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్, ఐసర్ల నుంచి బీఎస్-ఎంఎస్ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 28 ఏళ్లు మించకూడదు.

- ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. (జెస్ట్/జామ్)(2023/2024) అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/admission

ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ)- లాసెట్, పీజీఎల్‌సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తోంది. లాసెట్ ద్వారా అయిదేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. పీజీఎల్‌సెట్ ద్వారా రెండేళ్ల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పరీక్షల సిలబస్, మాక్ టెస్ట్‌ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత వివరాలు

- అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు
- మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కనీసం 45 శాతం మార్కులతో డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి
- ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అయిదేళ్లు/మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్ లేదా బీఎల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- బేసిక్ క్వాలిఫికేషన్ లేకుండా సింగిల్ సిట్టింగ్ ద్వారా డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. ఐటీఐ కోర్సులు చేసినవారు లాసెట్ రాయడానికి వీలు లేదు. పాలిటెక్నిక్ డిప్లొమాను ఇంటర్ అర్హతగా పరిగణిస్తారు.
- ప్రస్తుతం ఇంటర్/డిగ్రీ/పీజీ చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాస్తున్న/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.


లాసెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మ్యాచింగ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్షలో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ అంశాల నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 42 మార్కులు(35 శాతం) రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలో; మూడేళ్ల ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలో ఉంటాయి. లాసెట్ ప్రశ్నపత్రాలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో నిర్వహిస్తారు.

పీజీఎల్‌సెట్ 2024: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జ్యూరిప్రుడెన్స్, కాన్‌స్టిట్యూషనల్ లా అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మర్కంటైల్ లా, లేబర్ లా, క్రైమ్స్ అండ్ టార్ట్స్, అదర్ లాస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 16 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మ్యాచింగ్ ఐటెమ్స్ ఇస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 30 మార్కులు(25 శాతం) రావాలి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **లాసెట్ దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; బీసీ అభ్యర్థులకు రూ.850; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **పీజీఎల్‌సెట్ దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; బీసీ అభ్యర్థులకు రూ.950; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** మే 30 నుంచి జూన్ 1 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 3 నుంచి
- **ఏపీ లాసెట్ 2024, పీజీఎల్‌సెట్ 2024 తేదీ:** జూన్ 9
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

నోటిఫికేషన్స్



జిప్‌మ్యాట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్ గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. దీని వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో కూడా కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి ఇంగ్లీష్ సహా ఏవేని అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంట్రప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 23 నుంచి 25 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 2 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/JIPMAT/

లిటిల్స్



మీకు తెలుసా?

- బూడిద రంగులో పెద్ద ముక్కుతో పాటు పొడవైన కాళ్లుండే ఈ పక్షిని 'షూబిల్' అని పిలుస్తారు. ఈ పేరు రావటానికి కారణం వీటి ముక్కు 'షూ'ను పోలిఉండటమే.
- తొమ్మిది ఇంచుల పొడవు, నాలుగు ఇంచులు వెడల్పుండే వీటి ముక్కుతో పెద్ద చేపలను కూడా వెంటాడగలవు. ప్రపంచంలోనే అతి పెద్ద ముక్కులుండే పక్షుల్లో షూబిల్ మూడోస్థానంలో ఉంది.
- తూర్పు ఆఫ్రికాలో ఈ పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా సూడాన్, కాంగో, ఇథియోపియా దేశాల్లో కనిపిస్తాయివి. కేవలం తడినేలలు.. అందునా పచ్చగడ్డి ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తాయి. నీళ్ల దగ్గర ఎలాంటి చప్పుడు లేకుండా నిలబడి క్షణాల్లో చేపలను పట్టగలవు.



- 4.5 ఫీట్లు పొడవు, ఐదు కేజీల బరువుండే ఈ పక్షులు ముప్పయ్ ఐదేళ్లు బతుకుతాయి.
- నత్తలు, కప్పలు, చేపలు, మొసళ్ల పిల్లలను తిని బతుకుతాయివి.
- ఇవి రెండు కిలోమీటర్ల పరిధిలో కనీసం మూడు గూళ్లు కట్టుకుంటాయి. కేవలం రెండు గుడ్లు పెడతాయి. ఈ పిల్లలను కూడా వేరే పక్షులు చంపేస్తుంటాయి.
- 1840ల్లోనే వీటి ఆనవాళ్లను యూరోపియన్లు కనుక్కున్నారు.
- బ్లాక్ మార్కెట్‌లో ఈ పక్షుల ధర పదివేల డాలర్లు కూడా పలుకుతుంది. అందుకే మనుషులతోనే వాటికి ప్రమాదం ఉంది.
- వీటి రెక్కల పొడవు శరీరానికంటే నాలుగైదు రెట్లు ఉంటుంది. ఇవి గాల్లో దూసుకుపోతాయి.
- దాదాపు ఈ పక్షులన్నీ ఒంటరిగానే ఉంటాయి. గుంపులుగా ఉండటానికి ఇష్టపడవు.


ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 265

	1		5		7		4	
				2		6	3	
					3		7	
	7	3			8	9		
		4				5		
		9	1			7	6	
	9		8					
	8	5		4				
	3		2		9		5	

సుడోకు - 264 సమాధానం

4	8	3	1	9	7	5	6	2
7	6	9	2	5	3	4	8	1
1	2	5	6	4	8	9	7	3
3	9	7	4	1	5	8	2	6
8	4	1	7	2	6	3	9	5
2	5	6	3	8	9	7	1	4
6	3	2	8	7	4	1	5	9
9	1	8	5	3	2	6	4	7
5	7	4	9	6	1	2	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

కోడింగ్ డీకోడింగ్

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

1. ఒక సంకేత భాషలో LOVEను DTLHగా రాసిన అదే సంకేత భాషలో PONDను ఏ విధంగా రాస్తారు?
ఎ) LCLL బి) CLLL
సి) LLLC డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

12 15 22 5   4 20 12 8
L O V E - D T L H
-1, -2, -3, -4

ఇదే విధంగా

16 15 14 4   3 12 12 12
P O N D - C L L L
-1, -2, -3, -4

గా రాస్తారు.

గమనిక:- పై వివరణ పరిశీలిస్తే LOVE అనే పదంలో చివరి అక్షరం E నుంచి మొదటి అక్షరం L వరకు (చివరి నుంచి మొదటికి) -1, -2, -3 -4 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.)

2. ఒక కోడ్ భాషలో ROUNDను NODRUగా రాసిన అదే కోడ్ భాషలో READYను ఏ విధంగా రాస్తారు?
ఎ) DEYAR బి) DEYRA
సి) YADER డి) EDRAY

సమాధానం: (బి)

వివరణ: ROUND అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పదతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5   4 2 5 1 3
R O U N D   N O D R U
ఇదే విధంగా
1 2 3 4 5   4 2 5 1 3
R E A D Y   D E Y R Aగా రాస్తారు.

3. ఒక కోడ్ భాషలో PONDను QRFPగా రాస్తే అదే కోడ్ భాషలో IDEAను ఏ విధంగా రాస్తారు?
ఎ) FKCG బి) FCGK
సి) CFKG డి) FGKC

సమాధానం: (ఎ)

వివరణ: POND అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQPF. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలు తిప్పిరాయగా QRFPగా కోడ్ చేశారు. అదే విధంగా IDEA అనే పదంలోని అక్షరాలను +2 చేయగా KFGC. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలను తిప్పి రాయగా FKCG సమాధానం అవుతుంది.

16 15 14 4   ఇదే విధంగా   9 4 5 1
P O N D   I D E A
+2 +2 +2 +2   +2 +2 +2 +2
Q R F P   F K C G
17 18 6 16   6 11 3 7

గా రాస్తారు.

గమనిక: పదాలను పైన, కింద ఇచ్చిన అంకెలను పరిశీలిస్తే క్రాస్‌గా +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

4. ఒక కోడ్ భాషలో JOKEను NIDJగా రాసిన అదే కోడ్ భాషలో NIKEను ఏ విధంగా రాస్తారు?
ఎ) HMJD బి)MDJH సి) HMDJ డి) JODL

సమాధానం: (సి)

వివరణ:

10 15 11 5   ఇదే విధంగా   14 9 11 5
J O K E   N I K E
-1 -1 -1 -1   -1 -1 -1 -1
N I D J   H M D J
14 9 4 10   8 13 4 10

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే క్రాస్‌గా -1 పద్ధతిని అనుసరిస్తున్నదని తెలుస్తున్నది.


5. ఒక కోడ్ భాషలో POLICEను NQRGEKగా రాశారు. అదే కోడ్ భాషలో ORANGE ఏ విధంగా రాస్తారు?
ఎ) CTQGIP బి) CQTPIG
సి) QTCPIG డి) CTGQPI

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQNKEG. ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా NQRGEK. అదేవిధంగా ORANGE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా QTCPIG. ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా CTQGIP సమాధానం అవుతుంది.

16 15 12 9 3 5   ఇదే విధంగా   15 18 1 14 7 5
P O L I C E   O R A N G E
+2 +2 +2 +2 +2 +2   +1 +2 +3 +1 +2 +3
N Q R G E K   C T Q G I P
14 17 18 7 5 11   3 20 17 7 9 16

గా రాస్తారు.



గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన అంకెలను గీతల ఆధారంగా జాగ్రత్తగా పరిశీలిస్తే +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

6. ఒక కోడ్ భాషలో FAMOUSను PWVGCPగా రాశారు. అదే కోడ్ భాషలో MOBILEను ఏవిధంగా రాస్తారు?
ఎ) JHQNNE బి) QJENNH
సి) JNHNQE డి) JNNHEQ

సమాధానం: (సి)

వివరణ:

6 1 13 15 21 19   ఇదే విధంగా   13 15 2 9 12 5
F A M O U S   M O B I L E
+1 +2 +3 +1 +2 +3   +1 +2 +3 +1 +2 -3
P W V G C P   J N H N Q E
16 23 22 7 2 16   10 14 8 14 17 5

గా రాస్తారు.

జాగ్రత్తగా క్రాస్‌లైన్ గమనించండి. క్రాస్‌లైన్‌కు పైన, కింద ఇచ్చిన సంఖ్యలు +1, +2, +3, +1, +2, +3లో ఉన్నాయి. (లేదా)

FAMOUS అనే పదంలోని అక్షరాలను ముందుగా +1, +2, +3, +1, +2, +3గా రాయగా GCPPWV అవుతుంది. దీనిలో ఎడమవైపు అర్థభాగంలోని అక్షరాలను (GCP) కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలోని అక్షరాలను (PWV)ఎడమవైపు అర్థభాగంలో రాయగా PWVGCP అవుతుంది. ఇదేవిధంగా పదం MOBILEలోని అక్షరాలను +1, +2, +3, +1, +2, +3లో రాయగా NQEJNH దీనిలో ఎడమవైపు అర్థభాగంలోని అక్షరాలు (NQE) కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలోని అక్షరాలు (JNH) ఎడమ వైపు అర్థభాగంలో రాయగా JNHNQE సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో MISTAKEను SAMKIETగా రాస్తే అదే కోడ్ భాషలో PRIVATEను ఏవిధంగా రాస్తారు?
ఎ) IAPTREV బి) APTIRVE
సి) IAPRTVE డి) IATPREV

సమాధానం: (ఎ)

వివరణ: MISTAKE అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పద్ధతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 6 7   3 5 1 6 2 7 4
M I S T A K E   S A M K I E T
ఇదే విధంగా
1 2 3 4 5 6 7   3 5 1 6 2 7 4
P R I V A T E   I A P T R E V

గా రాస్తారు.

8. ఒక కోడ్ భాషలో POLICEను ECILOPగా రాస్తే అదే కోడ్ భాషలో CINEMAను ఏవిధంగా రాస్తారు?
ఎ) AMENIC బి) NEACIM
సి) AMNIEC డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పిరాయగా ECILOP. అదే విధంగా CINEMA అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పి రాయగా AMENIC సమాధానం అవుతుంది.

9. ఒక కోడ్ భాషలో LONGERను OLGNREగా రాశారు. అయితే అదే కోడ్ భాషలో NATIVEను ఏవిధంగా రాస్తారు?
ఎ) ANTIEV బి) NATVEI
సి) ANITEV డి) ఏదీకాదు



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

సమాధానం: (సి)

వివరణ: LONGER అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా OL, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా GN, ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా RE అనగా పదంలో ప్రతి రెండు అక్షరాలు తిప్పి రాయడమైనది. ఈ విధంగా LONGER అనే పదం OLGNREగా మారింది. ఇదే విధంగా NATIVE అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా AN, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా IT. ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా EV, కావున సమాధానం ANITEV అవుతుంది.